www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 22-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 308 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: నవమి మ. 1.20 తదుపరి దశమి; నక్షత్రం: జ్యేష్ఠ సా. 5.40 తదుపరి మూల; వర్జ్యం: రా. 2.01-3.41; దుర్ముహూర్తం: ఉ. 6.41-8.14; అమృతఘడియలు: ఉ. 8.13-9.56; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 6.15 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 22-2-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
| విజయవాడ సిటీ**

498.. వరకట్నం సెక్షన్ మాత్రమే కాదు!

అన్ని రకాల వేధింపులకు వర్తిస్తుంది


భర్తపై క్రూరత్వ అభియోగాల

నమోదుకు కట్నం డిమాండ్‌ను

ప్రత్యేకంగా చేర్చక్కర్లేదు

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

ఏపీ హైకోర్టు తీర్పు కొట్టివేత



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: భర్త, అత్తింటి వారి నుంచి వివాహితలకు రక్షణ ఛత్రంగా తీసుకువచ్చిన ఐపీసీ 'సెక్షన్ 498'లో అన్ని రకాల వేధింపులను ఇమిడ్చారని సుప్రీంకోర్టు పేర్కొంది. భర్తలపై క్రూరత్వ అభియోగాలు మోపడానికి 'వరకట్నం డిమాండ్' అవసరం లేదని పేర్కొంది. ఐపీసీ సెక్షన్ 498ఏ కింద వరకట్నం డిమాండ్ చేయడాన్ని

మిగతా 10వ పేజీలో...

వర్సిటీల విభజన ఇంకెప్పుడు?

హైదరాబాద్‌లోనే ఓపెన్ వర్సిటీ, తెలుగు విశ్వవిద్యాలయం

రాష్ట్రం విడిపోయి పదేళ్లు దాటినా తేలని పంచాయితీ

ఏపీలోని స్టడీ సర్కిళ్లకు సేవలు ఆపేసిన ఓపెన్ వర్సిటీ

ఈ ఏడాది రాష్ట్ర విద్యార్థులకు దూర విద్య అడ్మిషన్లు బంద్

జీతాల బిల్లులూ పంపని ఓపెన్ వర్సిటీ అధికారులు

రెణ్నెల్లుగా జీతాలు బంద్.. ఏపీ ఉన్నత విద్యామండలి లేఖ

జగన్ హయాంలో వర్సిటీల విభజనపై తీవ్ర నిర్లక్ష్యం

ప్రభుత్వం మారినా ఇప్పుడూ కనిపించని కదలిక



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటింది. ఉమ్మడి రాజధాని గడువు కూడా ముగిసింది. కానీ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విభజనపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఏర్పాటు చేయడంపై శ్రద్ధ కనిపించడం లేదు. విభజన జరిగాక మొదటి ఐదేళ్లు ప్రభుత్వ సంస్థల విభజన ప్రక్రియ సంక్లిష్టంగా ఉంది. అనంతరం విభజనకు అవకాశమున్నా వైసీపీ ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. నాటి తెలంగాణ ప్రభుత్వంతో చెట్టపట్టాలేసుకుని తిరిగిన జగన్ యూనివర్సిటీల విభజనను ఏమాత్రం పట్టించుకోలేదు. ఎన్నికల ముందు ఓట్ల కోసం ఓపెన్ యూనివర్సిటీని తిరుపతిలో ఏర్పాటు చేయాలని హడావుడిగా నిర్ణయం తీసుకున్నా అది అక్కడే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చినా వర్సిటీల విభజన విషయంలో తీరు మారలేదు. దీంతో ఈ రెండు యూనివర్సిటీలు రాష్ట్రంలో

మిగతా 2వ పేజీలో...



విశాఖ జిల్లా మధురవాడలో ఎప్పుడో 18 ఏళ్ల కిందట రాజీవ్ స్వగృహ ప్రాజెక్టుకు 48 ఎకరాల భూమి ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కూడా పూర్తయింది. రాజీవ్ స్వగృహ కింద ప్లాట్‌లు కొనుగోలు చేసినవారు సర్కారుకు రూపాయి కూడా బాకీలేరు. చెల్లింపులు పూర్తయ్యాక ఎన్‌ఓసీలు తీసుకున్నారు. అయినా రెవెన్యూ అధికారులు రీ సర్వేలో ఆ భూమిని 22(ఏ)లో చేర్చారు. ఇది అన్యాయమని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియానే చెబుతున్నారు. తక్షణమే ఆ భూమిని 22(ఏ) నుంచి తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అయినా ఏం ఉపయోగం? రెవెన్యూ శాఖ స్పందిస్తే కదా!

తేల్చకపోతే ముంచేస్తారు!

నాడు జగన్ సర్కారు 'రీ సర్వే' తప్పులు.. నేడు కూటమి ప్రభుత్వానికి తిప్పలు

రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా భూసమస్యలే

పరిష్కారానికి కూటమి సర్కారు సకల యత్నాలు

గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల నిర్వహణ

లక్షల సంఖ్యలో వెల్లువెత్తిన ఫిర్యాదులు

పరిష్కారంలో అధికారుల అలసత్వం

కొన్నిచోట్ల కాసుల కోసం కొర్రీలు

కొత్త చిక్కులూ తెస్తున్న రెవెన్యూ సిబ్బంది

సమస్యల పరిష్కారంలో మందగమనం

ప్రభుత్వంపై ప్రభావం చూపే ప్రమాదం

రెవెన్యూ శాఖను సంస్కరించాల్సిందే!

సమూల మార్పులు తేవాలంటున్న నిపుణులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఏ మూలకు.. ఏ జిల్లాకు వెళ్లినా భూ సమస్యలే. వందలు, వేలు కాదు.. ఏకంగా లక్షల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రెవెన్యూ శాఖకు సంబంధించి ఏకంగా 3.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 70 శాతం జగన్ సర్కారు చేపట్టిన రీ సర్వే తర్వాత వచ్చిన సమస్యలు కాగా, అందులో సింహభాగం 22 (ఏ) జాబితాకు సంబంధించినవే. జగన్ సర్కారు చేసిన తప్పులు సరిదిద్దాల్సిన భారం కూటమి ప్రభుత్వంపై పడింది. అయితే ఫిర్యాదులు గుట్టల్లా పేరుకుపోతున్నాయే కానీ పరిష్కారం కావడం లేదు. కూటమి సర్కారు తమ సమస్యలను పరిష్కరిస్తుందని

మిగతా 2వ పేజీలో...

పేద రైతులు విలవిల

నెల్లూరు జిల్లా కలువాయి మండలం మాదన్నగారిపల్లె రెవెన్యూ గ్రామంలోని రామన్నగారిపల్లెలో 1986లో 465 ఎకరాల భూమిని పేదలకు అసైన్ చేశారు. వాటిని పేదలు సాగు చేసుకుంటున్నారు. బావుల తవ్వకానికి సంబంధించిన జీవన్‌ధార, ఎన్టీఆర్ జలసిరి వంటి పథకాలను అమలు చేశారు. అయితే రీ సర్వే సందర్భంగా ఆ భూముల కేటాయింపు చెల్లదని చావుకబురు చల్లగా చెప్పారు. అప్పట్లో అసైన్ చేసిన డీఫామ్ పట్టా రిజిస్టర్‌లో తహశీల్దార్ సంతకం చేయలేదని ఇప్పుడు చెబుతున్నారు. ఇదెక్కడి రూలో రెవెన్యూ అధికారులు చెప్పడం లేదు. ఇదే పంచాయతీలో సర్వే నెంబర్ 331లో రైతులకు అసైన్ చేసిన భూములతో పాటు రెవెన్యూ, అటవీ భూములు కూడా ఉన్నాయి. అయితే రైతుల భూములను సర్వే, సబ్ డివిజన్ చేయలేదు. రీ సర్వే తర్వాత ఈ సర్వే నంబర్‌లోని రైతుల భూములను కూడా మొత్తం అటవీ భూమిగా నమోదు చేశారు. ఇదీ రెవెన్యూ అధికారులు చేసిన ఘోర తప్పిదం. దీంతో రైతులు అల్లాడిపోతున్నారు.



హైదరాబాద్ అశోక్‌నగర్‌లో గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళన

మెయిన్స్ పరీక్షను ఆపేయండి

గ్రూప్-2 కేసులో సింగిల్ జడ్జి ఉత్తర్వులపై

ధర్మాసనం ముందు అప్పీలు 12

రోస్టర్‌లో మార్పుల తర్వాతే పరీక్ష పెట్టాలి

హైదరాబాద్‌లో గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళన

హద్దులు దాటారు!

సజ్జల భార్గవరెడ్డి పోస్టులపై హైకోర్టు స్పష్టీకరణ

ఆ పోస్టులను కట్టడి చేయాల్సిందే

ప్రత్యర్థులపై ప్రతీకార సాధనంలా సోషల్ మీడియా

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అంటే.. వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించడం కాదు

అనుచిత పోస్టుల నియంత్రణకు చర్యలేం తీసుకున్నారు?

సామాజిక మాధ్యమ సంస్థలకు ఏమైనా సూచనలు చేశారా?

వివరాలను మా ముందుంచండి

ప్రాసిక్యూషన్‌కు కోర్టు ఆదేశం

విచారణ ఈ నెల 27కి వాయిదా





అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా అసభ్యకర పోస్టులను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. అసభ్యకర పోస్టులను నిరోధించకుంటే, భవిష్యత్‌లో ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకునేందుకు సామాజిక మధ్యమాలు ఓ సాధనంగా మారతాయని వ్యాఖ్యానించింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే విషయంలో పిటిషనర్లు సజ్జల భార్గవ్‌రెడ్డి తదితరులు హద్దులు దాటారనడంలో సందేహం లేదని స్పష్టం చేసింది. రాజకీయ పార్టీల మధ్య

మిగతా 12వ పేజీలో...



అటవీ భూముల ఆక్రమణపై శుక్రవారం సజ్జల ఎస్టేట్‌లో సర్వే చేస్తున్న అధికారులు

సజ్జల సామ్రాజ్యంలో కొనసాగుతున్న సర్వే

55 ఎకరాల అటవీ భూముల ఆక్రమణపై

ఆర్డీవో బృందం ప్రత్యక్ష పరిశీలన 11

హాజరైన సజ్జల కుటుంబ సభ్యులు

వారికున్న భూముల సరిహద్దులు గుర్తింపు

నేడు, రేపు కూడా అధికారుల సర్వే

అటవీ హద్దులు గుర్తించి కోర్టుకు నివేదిక



ఆక్రమించిన భూమిలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి నిర్మించిన విలాసవంతమైన భవనం

30 ఎకరాల ప్రభుత్వ భూమిలో 'ఆకేపాటి ఎస్టేట్'!

రాజంపేట వైసీపీ ఎమ్మెల్యేకు జేసీ నోటీసులు 11

భూఆక్రమణపై నేడు విచారణకు రావాలని అమరనాథరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు ఆదేశం

ఆక్రమిత భూముల్లో విలాసవంత భవనం

గుర్రపుశాలలు, గోశాల, స్విమ్మింగ్‌పూల్ కూడా

ఫైబర్ నెట్‌లో ఏం జరుగుతోంది?

ఫైబర్ పంచాయితీపై రంగంలోకి సర్కారు



దినేశ్‌కుమార్

తక్షణమే ఆధారాలతో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాలు

మంత్రి జనార్దనరెడ్డితో కార్యదర్శి యువరాజ్, ఎండీ దినేశ్‌ల భేటీ



జీవీ రెడ్డి

తన ఆరోపణలకు ఆధారాలతో మంత్రికి వివరణ ఇచ్చిన జీవీ రెడ్డి 11

అదొక కిక్‌బ్యాక్ స్కీమ్!

నిధులను ఖర్చు పెట్టుకుంటారు.. 10

వాటిని పంపినవారి లబ్ధికి పని చేస్తారు

భారత్‌కే ఆ నిధులు పోతున్నాయా?

యూఎస్‌ఎయిడ్ నిధులపై ట్రంప్ మళ్లీ ఫైర్



విభిన్న ఉత్పత్తులు.. విస్తృత వ్యాపారం!

డిజిటల్ కామర్స్‌తో మహిళా సాధికారత 12

ఓఎన్‌డీసీ ద్వారా ఆన్‌లైన్ మార్కెట్ అవకాశాలు

డ్వాక్రా గ్రూపులు, చేతి వృత్తుల వారికి గొప్ప చాన్స్

దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్మకాలు

కేంద్ర సహకారంతో రాష్ట్రంలో అమలుకు శ్రీకారం

తేల్చకపోతే.. ముంచేస్తారు!

శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో పురుషోత్తంనగర్ కాలనీ ఉంది. ఇందులో శ్రీరామకృష్ణ ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సొసైటీ 1976 నుంచే పని చేస్తోంది. అక్కడ స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నవారు ప్రభుత్వానికి రూపాయి బాకీ లేరు. ఎన్‌ఓసీలు కూడా పొందారు. ఇప్పుడు ఈ సొసైటీ పరిధిలో నివాస సముదాయాలున్న 55 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు రాళ్లగుట్టగా చూపిస్తూ నిషేధ జాబితాలో చేర్చారు. ఇదెక్కడి అరాచకం? అని రెవెన్యూ నిపుణులు, ప్రజలు, కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ఇల్లు అమ్మడం, కొనడం అసాధ్యంగా మారింది. ఈ ఘోరమైన తప్పిదానికి బాధ్యులెవరు? ఆ భూమిని నిషేధ జాబితా నుంచి తొలగించాలని కాలనీవాసులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు.


గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ (ఫైల్)

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో ఆశతో ఎదురు చూసిన రైతులు, స్థలాల యజమానులకు నిరాశే ఎదురవుతోంది. సమస్యలను సరిదిద్దాల్సిన రెవెన్యూ అధికారులే వాటికి కారణమవుతున్నారు. అధికారుల అవినీతి, అలసత్వంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. సర్కారు మేల్కోకపోతే నష్టం తప్పదని రెవెన్యూ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సర్కారు, రెవెన్యూ తలోదారి

రెవెన్యూకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా వివాదాలు ఉండగా, జగన్ సర్కారు చేపట్టిన రీ సర్వే తర్వాతే ఏకంగా లక్షల సంఖ్యలో పెరిగిపోయాయి. నివాస స్థలాలను, రైతుల భూములను నిషేధ జాబితా 22 (ఏ)లో చేర్చడం.. పట్టా భూములను వెబ్‌ల్యాండ్‌లో మాయంచేయడం.. ఎన్నో ఏళ్ల నుంచి రైతులకు ఉన్న భూములను ప్రభుత్వ ఆస్తులుగా చూపడం.. వ్యక్తుల పేరు మీద ఇష్టానుసారం భూరికార్డులు మార్చడం... ఇలా ఎన్నోతప్పులు జరిగాయి. కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత పేదలు, సామాన్య రైతుల భూవివాదాలను పరిష్కరించి మేలు చేద్దామని కృతనిశ్చయంతో ఉంది. కానీ సర్కారుది ఓ దారి అయితే రెవెన్యూశాఖది మరోదారి అన్నట్టుగా పరిస్థితి ఉంది. ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా సర్కారు ముందుకు సాగుతుంటే... వాటిని అడ్డంపెట్టుకొని మరిన్ని అక్రమాలకు తెరలేపుదామన్నట్టుగా కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నారు. దీంతో భూవివాదాల పరిష్కారం కాగితాలకే పరిమితమవుతోంది. రీ సర్వేకు ముందు, తర్వాత, కూటమి సర్కారు వచ్చాక కూడా అధికారుల తీరు మారడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జగన్ హయాంలో రెవెన్యూలో పెంచి పోషించిన అవినీతి, అక్రమాలు ఇంకా కొనసాగుతున్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లో సభలు, రెవెన్యూ సదస్సులతో పాటు ప్రభుత్వానికి రెవెన్యూకు సంబంధించి 3.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 80 శాతం సమస్యలు పరిష్కరించినట్లుగా రెవెన్యూ శాఖ లెక్కలు చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. జిల్లాల పర్యటనలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియాకు ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సమస్యలను పరిష్కరించామని, ఆడిట్ చేశామని సర్కారు అంటోంది. నిజమే అయితే అవే సమస్యలు మళ్లీ ఎందుకు వస్తున్నాయి? అంటే... రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధిగా, నిజాయితీగా భూవివాదాలను పరిష్కరించకపోవడమే కారణం. అధికారులు మాటలు చెబుతున్నారు తప్ప ఆచరణలో పరిష్కారం చూపడం లేదని కూటమి పార్టీల నేతలే అంటున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ప్రభుత్వం సభలు, రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. భూరికార్డుల పునఃపరిశీలన చేయించింది. అయినా తప్పులు ఉన్నాయంటే లోపం రెవెన్యూ శాఖలోనే ఉందని నిపుణులు చెబుతున్నారు. శాఖలో తగినంత సిబ్బంది అంటే... రెగ్యులర్ తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ, సర్వేయర్‌లు లేకపోగా.. ఉన్నవారిలో కూడా కొందరు సమస్యల పరిష్కారాన్ని ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు.

తప్పు చేసినా చర్యలు ఉండవా?

రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఎలా ఉందో చెప్పడానికి తాజాగా విశాఖ కేంద్రంగా వెలుగుచూసిన ఉదంతమే నిదర్శనం. రెవెన్యూశాఖ పరువు మరింత తీసేలా.. ఓ రిటైర్డ్ తహశీల్దార్ పేరిట ఏకంగా 460 ఎకరాల భూమిని రాయడం సంచలనం సృష్టిస్తోంది. రీసర్వే తర్వాతా అదే తప్పు కొనసాగించారు. సాధారణంగా 60ఎకరాలకు మించి ఏ వక్తి పేరిటా భూమి ఉండటానికి వీల్లేదు. అలాంటిది ఒక్కరిపై 460 ఎకరాలు నమోదు చేయడం, అధికారులు గుడ్డిగా వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో పొందుపరచడం రెవెన్యూ పనితీరుకు మచ్చుతునక. తహశీల్దార్‌గా పనిచేసి రిటైర్డయిన వ్యక్తి పేరిట పెద్దఎత్తున భూమిని రికార్డు చేయడం రెవెన్యూకే చెల్లింది. అధికారులు తలుచుకుంటే ఎవరి పేరు మీద ఎంత భూమిని అయినా నమోదు చేస్తారని నిరూపించారు. ఈ తప్పు బయటపడ్డా సర్కారు ఏ చర్య తీసుకోలేదు. దీంతో అధికారులు దర్జాగా తమ తప్పును సమర్థించుకుంటున్నారు. సాంకేతిక పొరపాటే తప్ప ఎలాంటి దురుద్దేశం లేదని చెబుతున్నారు. శిక్షలు ఉండవు కాబట్టి ఏమైనా చెప్పగలరు. భవిష్యత్తులో వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట రాసినా ఏ చర్యా ఉండదన్నమాట.

రెవెన్యూ శాఖను సంస్కరించాలి

రెవెన్యూ శాఖలో సమూల సంస్కరణలు తీసుకొస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. ఏ శాఖలోనూ అధికారులకు లేని అధికారాలు ఒక్క రెవెన్యూలోనే ఉన్నాయి. వాటితో ప్రజలకు మంచి చేయవచ్చు. ఎలాంటి సమస్యను అయినా పరిష్కరించవచ్చు. కానీ కొందరు ఆ అధికారాలను దుర్వినియోగం చేసి సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. సమస్యల పరిష్కారానికి చేసే రీ సర్వే తర్వాత లక్షలాది మందికి కొత్త సమస్యలు తీసుకొచ్చారు. దీన్నిబట్టి రెవెన్యూ, సర్వే వాళ్లు క్షేత్రస్థాయిలో ఏం చేసి ఉంటారో ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ఇప్పుడు సమస్యల పరిష్కారం కూడా సజావుగా సాగడం లేదు. రెవెన్యూ వ్యవస్థను సమూలంగా సంస్కరించాలి. గ్రామం నుంచి మండల స్థాయి వరకు అధికారులకు జవాబుదారీతనం తీసుకురావాలి. అవినీతి, అక్రమాలు, అడ్డగోలు తప్పులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్న భయం కలిగించాలి. అపరిమితమైన అధికారాలు తొలగించాలి. నిరంతరం ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ ఉండాలి. అప్పుడే రెవెన్యూ శాఖ పనితీరులో మార్పు వస్తుంది.

- రిటైర్డ్ అధికారి, రెవెన్యూ చట్టాల నిపుణుడు రామయ్య

రీ సర్వే తప్పుల పరిష్కారం ఏదీ?

రీ సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతున్నామని ప్రభుత్వం చెబుతోంది. రెవెన్యూ అధికారులు బాగా కష్టపడుతున్నారని ఆ శాఖ నివేదిస్తోంది. కానీ ఆచరణలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. పరిష్కారం కాగితాల్లోనే తప్ప రైతులకు న్యాయం జరగడం లేదు. ఏళ్ల నాటి ప్రైవేటు భూములను కూడా రీ సర్వే తర్వాత ప్రభుత్వ ఆస్తులుగా పేర్కొంటూ రికార్డులు మార్చేశారు. ఆ తర్వాత వాటిని నిషేధ జాబితాలో చేర్చారు. దీంతో ఆ భూముల యజమానులు లబోదిబోమంటున్నారు. ఇదెక్కడి రెవెన్యూ అరాచకమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మచ్చుకు కొన్ని ఉదంతాలు....

వెబ్‌ల్యాండ్‌లో భూమి మాయం


శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కొత్తకుంకాం రెవెన్యూ విలేజ్ పరిధిలోని కొండకుంకాంలో ఓ రైతుకు సర్వే నెంబర్ 12-9లో 45 సెంట్ల భూమి ఉంది. రీ సర్వే తర్వాత వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో నుంచి ఆ భూమిని తీసేశారు. ఆ గ్రామంలో రీ సర్వే పూర్తయినట్లుగా 13 నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ సర్వేకు ముందు రైతుకు నోటీసు ఇవ్వలేదు. సర్వే చేస్తున్నట్లు సమాచారం ఇవ్వలేదు. ఆ భూమిని మాయం చేసిన రెవెన్యూ అధికారులు ఇదే గ్రామంలో అనధికారిక మ్యుటేషన్‌లు లెక్కలేనన్ని చేశారు. రైతుల ఫిర్యాదులపై అధికారులు స్పందించడం లేదు.

విస్తీర్ణంలో తేడాలు

కాకినాడ జిల్లా కరప మండలం ఎండమూరు రెవెన్యూ గ్రామంలో ఓ రైతుకు 1 ఎకరా 50 సెంట్ల పట్టా భూమి ఉంది. భూముల సర్వే సమయంలో రైతుకు నోటీసు ఇవ్వలేదు. కనీసం సర్వే చేస్తున్నామన్న సమాచారం కూడా ఇవ్వలేదు. సొంతంగా సర్వే చేసి రికార్డు మార్చారు. ఇప్పుడు ఆ రైతుకు 1 ఎకరా 20 సెంట్లు మాత్రమే ఉన్నట్లు రికార్డు చేశారు. ఆ రైతుకు చెందిన 30 సెంట్ల భూమి ఎక్కడికి వెళ్లినట్లు? దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. ఈ గ్రామంలో 60 శాతం మంది రైతులు రీ సర్వే అనంతరం విస్తీర్ణంలో ఇలా తేడాలు ఎదుర్కొంటున్నవారే ఉన్నారు. కానీ గ్రామంలో ఏ సమస్యా లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

పట్టా భూమి... ప్రభుత్వ భూమిగా

ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం గొట్లగట్టు గ్రామంలో గోరంట్ల వెంకటస్వామి అనే రైతు పేరిట 80 సెంట్ల పొలం ఉంది. వారసత్వంగా తండ్రి నుంచి వచ్చిన భూమి అది. గత 60 ఏళ్లుగా ఆయన సాగులోనే ఉంది. పట్టా కూడా ఉంది. వెంకటస్వామి మరణానంతరం భూమిని ఆయన భార్య కృష్ణకుమారి పేరిట రికార్డు మార్చాలి. వెంకటస్వామి వారసులు ఇదే విషయంపై రెవెన్యూ అధికారులకు దరఖాస్తు ఇచ్చారు. అయితే దాన్ని ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో మార్చారు. రైతు పేరిట పట్టా ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా ఎప్పుడు మార్చారు? రైతుకు ఎందుకు నోటీసు ఇవ్వలేదో అధికారులు బదులివ్వడం లేదు. ప్రస్తుతం ఈ భూమిని అసైన్డ్‌గా చూపిస్తున్నారు. అంటే రెవెన్యూ అధికారులు తలుచుకుంటే ఏ భూమిని అయినా ఇష్టానుసారం మార్చేస్తారనడానికి ఇదే నిదర్శనం. ఇప్పుడు ఆ కుటుంబం ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.



కృష్ణబిలాల రహస్యాల శోధనలో మరో ముందడుగు

- మరగుజ్జు గెలాక్సీల అతిపెద్ద నమూనా గుర్తింపు
- అమెరికాలో భారత విద్యార్థిని రాగదీపిక ఘనత


తల్లిదండ్రులతో రాగదీపిక

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో కృష్ణబిలాలకు ఆతిథ్యమిచ్చే మరగుజ్జు గెలాక్సీల అతిపెద్ద నమూనాను భారత్‌కు చెందిన పరిశోధకురాలు పుచ్చా రాగదీపిక గుర్తించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రాగదీపిక అమెరికాలోని యూటా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ నెల 19న ఆమె పరిశోధన వివరాలు ఆస్ట్రో ఫిజికల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. క్రియాశీల కృష్ణబిలాన్ని కలిగి ఉన్న ఇంటర్మీడియట్ మాస్ కృష్ణబిలం, మరుగుజ్జు గెలాక్సీల పెద్ద నమూనాలను రాగదీపిక నేతృత్వంలోని పరిశోధకుల బృందం గుర్తించింది. గెలాక్సీలో లోతైన అధ్యయనం చేసేందుకు ఆమె పరిశోధన దోహదపడనుంది. దీపిక నేతృత్వంలోని బృందం నాలుగు లక్షల గెలాక్సీల డేటాను పరిశీలించింది. పాలపుంతలో భారీ గెలాక్సీలు, వాటిలో బ్లాక్‌హోల్స్‌ను కనుగొనడం సవాల్‌గా ఉంది. వీటిపై మరింత అధ్యయనం చేసేందుకు తన పరిశోధన దారి చూపింది. దీపిక తల్లిదండ్రులు రాజగోపాల్, కనకదుర్గ తెనాలిలోని రామలింగేశ్వర పేటలో నివాసం ఉంటున్నారు. రాజగోపాల్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి రిటైరయ్యారు.

వర్సిటీల విభజన ఇంకెప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పుడు ఏర్పాటవుతాయో అర్థంకాని అయోమయ పరిస్థితి.

ఇంకా ఉమ్మడిగానే...

రాష్ట్ర విభజన జరిగి దశాబ్దకాలం దాటినా ఇప్పటికీ అనేక ప్రభుత్వ సంస్థల విభజన పూర్తికాలేదు. ఆస్తుల విషయంలో ఏర్పడిన న్యాయ వివాదాల కారణంగా ఉమ్మడిగానే ఉన్నాయి. అయితే రెండు రాష్ట్రాల మధ్య ఉమ్మడి సేవలు అందించడం కష్టమని భావించి చాలా సంస్థలు అనధికారికంగా విడిపోయాయి. ఉదాహరణకు విభజన జరగకపోయినా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ, ఉన్నత విద్యామండలి వంటి వాటికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సొంతంగా కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించాయి. కానీ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉమ్మడిగా కొనసాగుతున్నాయి. ఏపీలో ఓపెన్ వర్సిటీకి 76 స్టడీ సర్కిళ్లు ఉన్నాయి. తెలుగు విశ్వవిద్యాలయానికి రాజమండ్రి, శ్రీశైలం, కూచిపూడిలో కేంద్రాలు ఉన్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య స్వల్పంగానే ఉంది. కానీ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా చదివే విద్యార్థులు ఏపీలో సుమారు 30వేల మంది ఉన్నారు. కాగా ఉమ్మడి రాజధాని కాల పరిమితి ముగిసిందనే కారణం చూపుతూ హైదరాబాద్‌లోని ఓపెన్ యూనివర్సిటీ ఈ ఏడాది నుంచి ఏపీలోని స్టడీ సర్కిళ్లకు సేవలు ఆపేసింది.

ఆగిన అడ్మిషన్లు, జీతాలు

దూర విద్య ద్వారా ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఏటా జూన్, జనవరి నెలల్లో అడ్మిషన్లు చేపడతారు. కానీ ఈ ఏడాది నుంచి ఏపీలోని స్టడీ సర్కిళ్లకు ఓపెన్ యూనివర్సిటీ సేవలు నిలిపివేయడంతో కొత్తగా విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వలేదు. ఏపీలోని స్టడీ సర్కిళ్ల ద్వారా చదివే విద్యార్థులు ఏటా దాదాపు రూ.16 కోట్ల ఫీజులు యూనివర్సిటీకి చెల్లిస్తున్నారు. ఆ ఫీజులు తీసుకుంటున్న యూనివర్సిటీ.. స్టడీ సర్కిళ్లు ఏపీలో ఉన్నందున అక్కడి ఉద్యోగులకు జీతాలు ఇవ్వబోమని గతంలోనూ మెలిక పెట్టింది. దీంతో ఉద్యోగుల జీతాల బిల్లులు జనరేట్ చేసి పంపితే ఏపీ ప్రభుత్వమే ఇక్కడి ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తోంది. ఇప్పుడు వర్సిటీ సేవలు ఆపేసినందున జీతాల బిల్లులు కూడా పంపబోమంటూ అక్కడి అధికారులు అడ్డం తిరిగారు. దీంతో రెండు నెలలుగా ఏపీలోని స్టడీ సెంటర్లలో ఉద్యోగుల జీతాలు ఆగిపోయాయి. జీతాల చెల్లింపులకు బిల్లులు పంపాలంటూ సోమవారం ఏపీ ఉన్నత విద్యామండలి... అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి లేఖ రాసింది.

జగన్ సర్కారు నిర్లక్ష్యం

రాష్ట్ర విభజన అనంతరం తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత లోపించింది. అప్పటి టీడీపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలకు అన్ని విషయాల్లోనూ వివాదాలు ఏర్పడ్డాయి. దీంతో అప్పట్లో ఉమ్మడి సంస్థల విభజన ముందుకు కదల్లేదు. అనంతరం ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో విభజన సమస్యలు కొలిక్కి వస్తాయని అందరూ ఊహించారు. ప్రభుత్వాల పరంగానూ, వ్యక్తిగతంగానూ వైసీపీ, టీఆర్ఎస్ సర్కార్లు, నాటి సీఎంలు జగన్, కేసీఆర్ సన్నిహితంగా మెలిగారు. ఆ సమయంలో ప్రభుత్వ సంస్థల విభజనకు మంచి అవకాశం ఏర్పడినా జగన్ సద్వినియోగం చేసుకోకుండా నిర్లక్ష్యం చేశారు. ఎంతసేపూ వ్యక్తిగత అంశాలు తప్ప ఉమ్మడి ఆస్తుల విభజనను పట్టించుకోలేదు. పోనీ రాష్ట్రంలో వర్సిటీలను ఏర్పాటు చేయడంపైనా దృష్టి పెట్టలేదు. దీనిపై విమర్శలు తీవ్రం కావడంతో ఎన్నికలకు ముందు హడావిడిగా తిరుపతిలో ఓపెన్ యూనివర్సిటీని నెలకొల్పే ఫైలు పెట్టారు. సరిగ్గా ఎన్నికల కోడ్ విడుదలైన రోజునే షార్ట్ సర్క్యులేషన్ ద్వారా దీనికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దానిపై ఆర్డినెన్స్ జారీకి అనుమతివ్వాలని ఈసీని కోరింది. ఈసీ అంగీకరించకపోవడంతో ఏర్పాటు ప్రక్రియ ఆగిపోయింది. కాగా, కూటమి ప్రభుత్వంలో అయినా యూనివర్సిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటారని ఆశించారు. హైదరాబాద్‌లోని ఓపెన్ వర్సిటీ ఏపీకి సేవలు నిలిపివేయడంతో తాత్కాలికంగా నాగార్జున వర్సిటీ కేంద్రంగా ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. కానీ, ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం స్పందించలేదు.

కంచె.. మేస్తోంది

ఆర్టీసీలో నిఘా అధికారుల అవినీతి పర్వం

- ఆధారాలతో సహా ఫిర్యాదులు
- కడప జోన్‌లో విజిలెన్స్ అధికారి విశ్వరూపం
- దళారీలను పెట్టుకుని మరీ వసూళ్లు
- మహిళా ఉద్యోగికి బెదిరింపులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



కళ్లు, చెవులు ఒక మనిషికి ఎంత ముఖ్యమో.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా ఒక సంస్థకు అంతే ముఖ్యం. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా జరిగే సంస్థల్లో అవినీతి అక్రమాలకు తావులేకుండా విజిలెన్స్ విభాగం మరింత అప్రమత్తంగా ఉండాలి. కానీ ఏపీఎస్ఆర్టీసీలో మాత్రం అందుకు విరుద్ధంగా నడుస్తోంది. కంచే చేను మేసిన చందంగా.. విజిలెన్స్ విభాగమే అవినీతి కూపం అయిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో ఐజీ ర్యాంకు ఐపీఎస్ అధికారిని ఆర్టీసీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అధిపతిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించేది. జోన్ల వారీగా డీఎస్పీ ర్యాంకు అధికారులు విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్లుగా ఉండేవారు. అప్పట్లో ఏ చిన్న అతిక్రమణ కనిపించినా నివేదికలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపేవారు. లోపాలు, అవినీతిపై ఆధారాలతో సహా రిపోర్టులు ఎండీకి చేరేవి. తక్షణమే చర్యలుండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. విజిలెన్స్ విభాగం ఆర్టీసీ అడ్మిన్ ఈడీ చేతుల్లో ఉండటమే అందుకు ప్రధాన కారణమని సిబ్బంది చెబుతున్నారు.

కడప జోన్‌లో వరుస ఫిర్యాదులు

కడప జోన్‌లో పనిచేస్తున్న వీ అండ్ ఎస్‌వో డబ్బుల కోసం వేధిస్తున్నారని ఆర్టీసీ కానిస్టేబుళ్లు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. కడప జోనల్ వర్క్‌షాపులో పనిచేసే రంగనాథ్ అనే ఉద్యోగి తనను విజిలెన్స్ అధికారి ఏ విధంగా ఇబ్బంది పెట్టారో వివరిస్తూ రాతపూర్వకంగా అవినీతి బాగోతాలు ఎండగట్టారు. ఆయన అవినీతిని ఉద్యోగ సంఘాలు ఆధారాలతో సహా యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చాయి. రూ. 10 వేల నుంచి 75 వేల వరకూ ఆన్‌లైన్‌లో పంపినట్టు కంప్లయింట్‌లో పేర్కొన్నారు. కొందరు హెడ్ కానిస్టేబుళ్లను దళారీలు పెట్టుకుని రాయలసీమలో వసూళ్లు చేస్తున్న వైనాన్ని వివరించారు. పులివెందులలో కేవీ రెడ్డి, కడపలో ప్రసాద్, నంద్యాలలో రామచంద్రారెడ్డి, కర్నూలులో మనోహర్, ఉమ్మడి అనంతపురంలో నాగసుందర్, గిరి ప్రతి పనికీ డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

విజయవాడ జోన్‌లోనూ ఇదే పరిస్థితి..

కడప జోన్ విజిలెన్స్ అధికారికి తీసిపోని విధంగా విజయవాడ జోన్ విజిలెన్స్ అధికారిపైగా వరుసగా ఫిర్యాదులు వస్తున్నాయి. బస్టాండులో షాపుల నుంచి వసూళ్లు మొదలుకొని పలు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బస్టాండులోకి వచ్చి ప్రైవేటు వాహనాల వ్యక్తులు ప్రయాణికుల్ని బయటికి తీసుకెళ్లి పోతున్నా మామూళ్లతో ఆయన కళ్లు మూసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అద్దె కార్లకు ఆర్టీసీ డ్రైవర్లను వాడుతోన్న అధికారులపైనా ఫిర్యాదు చేయడం లేదని, లక్షలాది రూపాయల కొనుగోళ్ల వ్యవహారంలో ఆడిట్ అధికారులకు బిల్లులు పంపట్లేదని, టోల్ ఫీజు కోట్లలో పోతున్నా కనీసం అప్రమత్తం చేయడం లేదంటూ విజయవాడ జోన్ అధికారులపై ఫిర్యాదులు వస్తున్నాయి. అయితే ఉన్నతాధికారికి బహుమతులు ఇస్తూ వీరు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

'కారుణ్యం' లేకుండా బెదిరింపులు

కడప రీజియన్‌లో పనిచేసే ఒక ఉద్యోగి మరణించడంతో ఆయన భార్యకు సెక్యూరిటీ కానిస్టేబుల్‌గా కారుణ్య నియామకం కింద ఆర్టీసీలో ఉద్యోగం లభించింది. అయితే ఆ తర్వాత ఆమె పెళ్లి చేసుకోవడంతో విజిలెన్స్ అధికారి బ్లాక్ మెయిల్‌కు దిగారు. పెళ్లి చేసుకున్నావు కాబట్టి ఉద్యోగం తీయించేస్తా.. అని బెదిరించి ఆమె వద్ద రూ. 5 లక్షల వరకూ వసూలు చేసినట్లు ఫిర్యాదు అందింది. ఇలాంటి ఫిర్యాదులపై ఎట్టకేలకు యాజమాన్యం స్పందించి విజిలెన్స్ ఉన్నతాధికారిని విచారణకు పంపింది. అయితే విచారణ అధికారితో వసూళ్ల అధికారికి సత్సంబంధాలు ఉన్నాయి. ఆయన ముందే బాధితులను పిలిచి బహిరంగంగా విచారణ చేపట్టారు. ఎవరిపై తాము ఫిర్యాదు చేశామో.. ఎవరి పరిధిలో పని చేస్తున్నామో.. ఆయన సమక్షంలోనే విచారణ చేపట్టడం అంటే దీనిని పూర్తిగా నీరుగార్చడమేనని బాధితులు వాపోతున్నారు. కడప జోన్‌లో సిబ్బందిని వేధిస్తోన్న విజిలెన్స్ అధికారిపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. విచారణలో అవి నిరూపితం కావడంతో యాజమాన్యం రివర్షన్ ఇచ్చింది. అయితే ఒక మహిళా అధికారి ఆశీర్వాదంతో కొన్ని నెలల్లోనే తిరిగి అదే పోస్టులో నియమితులయ్యారు. వారిద్దరి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలకు ఇదే నిదర్శనం అని రాయలసీమ బస్ డిపోల్లో సిబ్బంది బహిరంగంగా చెబుతున్నారు.

ఇకపై టీచర్లకు ఒకటే యాప్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ప్రస్తుతం 45 రకాల అధికారిక యాప్‌లు ఉపయోగిస్తుండగా, వాటిని ఇకపై ఒక్కటిగా మారుస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఉపాధ్యాయ సంఘాల నేతలకు హామీ ఇచ్చారు. శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో సంఘాల నేతలతో పలు అంశాలపై సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అనంతరం ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు విడుదల చేస్తామన్నారు. జీవో 117 రద్దు, ప్రత్యామ్నాయంపైనా ఎన్నికల అనంతరం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. క్లస్టర్ సమావేశాలపై అభిప్రాయాలు తీసుకున్నారు.

ఏపీటీఎఫ్-1938తో మాకు సంబంధం లేదు: ఏపీటీఎఫ్ 1947

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్-1938 సంఘంతో తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని ఏపీటీఎఫ్-257 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. ఏపీటీఎఫ్ 1947లో ఏర్పాటైందని, 1987లో సంఘం నుంచి బహిష్కరణకు గురైనవారు ఏపీటీఎఫ్-1938 పేరుతో సంఘం పెట్టుకున్నారని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రిజిస్ట్రేషన్ నంబరు లేకుండా ఏపీటీఎఫ్ పేరుతో పలు అభ్యర్థులకు మద్దతు అని ప్రకటిస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు.

అగ్రి, హార్టికల్చర్ వర్సిటీల విలీనం వద్దు: ఏపీ చాంబర్స్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల విలీన ప్రతిపాదనను పునఃపరిశీలించాలని ఏపీ వాణిజ్య పరిశ్రమల సమాఖ్య(ఏపీ చాంబర్స్) రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకమైన ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో వ్యవసాయ, ఉద్యాన అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆ రెండు వర్సిటీలకు స్వతంత్ర హోదాను కొనసాగించాలని కోరింది. ఈ మేరకు ఛాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి లేఖ రాశారు.

ఏప్రిల్ 1 నుంచే ఇంటర్ తరగతులు

- మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్, గణితంలో బ్రిడ్జి కోర్సు ప్రారంభం
- విద్యా సంవత్సరంలో సమూల మార్పులు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరంలో ఇంటర్ బోర్డు సమూల మార్పులు తీసుకొచ్చింది. ప్రస్తుతం పబ్లిక్ పరీక్షలు ముగియగానే కాలేజీలకు వేసవి సెలవులు ఇచ్చి, తిరిగి జూన్ 1న తెరిచే విధానం అమలులో ఉంది. అయితే ప్రైవేటు కాలేజీలతో పోటీపడాలనే లక్ష్యంతో పరీక్షలు ముగియగానే తర్వాత విద్యా సంవత్సరాన్ని ప్రారంభించే విధానం తీసుకొచ్చింది. ఇకపై మార్చి చివరి నాటికి పరీక్షలు ముగిసిన తర్వాత ఏప్రిల్ 1నుంచి సెకండియర్ విద్యార్థులకు రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తారు. వచ్చే 2025-26 విద్యా సంవత్సరం ఏప్రిల్‌లో ప్రారంభించనున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఏప్రిల్ 5 నుంచి అడ్మిషన్లు తీసుకుంటారు. ఫస్టియర్‌లో చేరిన వారికి ఇంగ్లిష్, గణితంపై బ్రిడ్జి కోర్సు ప్రారంభిస్తారు. ఏప్రిల్ 22 వరకు తరగతులు నిర్వహించి 23 నుంచి మే నెలాఖరు వరకు వేసవి సెలవులు ఇస్తారు. జూన్ 1నుంచి విద్యాసంవత్సరం తిరిగి కొనసాగుతుంది. దీనివల్ల ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు పెరుగుతాయని బోర్డు భావిస్తోంది.

ఇంటర్ హాల్‌టికెట్లు విడుదల

- 'మనమిత్ర' ద్వారా 4 లక్షల మంది డౌన్‌లోడ్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లను ఇంటర్ బోర్డు శుక్రవారం విడుదల చేసింది. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వాట్సాప్ మనమిత్ర యాప్(9552300009) ద్వారా, కాలేజీ లాగిన్‌ల ద్వారా వాటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. శనివారం నుంచి ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. కాగా, మనమిత్ర యాప్ నుంచి దాదాపు 4లక్షల మంది విద్యార్థులు ఇప్పటికే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు.

అమరావతిలో నార్త్ కరోలినా వర్సిటీ కేంద్రం?

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నార్త్ కరోలినా సిస్టమ్స్ యూనివర్సిటీ విస్తరణ కేంద్రాన్ని ఏర్పాటుచేసే అంశంపై ఉన్నత స్థాయి చర్చ జరిగింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, నార్త్ కరోలినా వర్సిటీ చాన్స్‌లర్ అశ్విని కె.వోలేటి శుక్రవారం మండలి కార్యాలయంలో భేటీ అయ్యారు. మెరైన్ సైన్సెస్, డ్రోన్ టెక్నాలజీస్, ఫార్మసూటికల్ టెక్నాలజీ, సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌పై పరస్పర సహకారంపైనా చర్చించారు. ఈ అంశాలపై అశ్విని కె.వోలేటి ప్రజెంటేషన్ ఇచ్చారు. జెరెమీ డికెర్సన్, క్రిస్టోఫర్ ఎం.ఫినెల్లి, గణతి, బాల వీరమాచినేని, కె.శివరామకృష్ణ, గంటా సుబ్బారావు చర్చల్లో పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాలో ఒకరికి జీబీఎస్?

మచిలీపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. పెడనకు చెందిన 33 ఏళ్ల ఓ వ్యక్తి అనారోగ్యంతో ఈనెల 20న మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చేరాడు. జ్వరం లేకుండానే తీవ్ర ఒంటి నొప్పులతో ఇబ్బంది పడుతుండటంతో వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించారు. ఆయనకు జీబీఎస్ లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత ఈ మేరకు వెల్లడించారు.



భక్తకన్నప్ప ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో శుక్రవారం జరిగిన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 14 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు క్షేత్ర సంప్రదాయం ప్రకారం పరమశివుడి భక్తుడైన కన్నప్పకు తొలి పూజతో శ్రీకారం పలికారు. ముక్కంటి ఆలయంలోని అలంకార మండపం నుంచి భక్తకన్నప్ప ఉత్సవమూర్తిని కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. వార్షిక ఉత్సవాలకు సకల దేవతామూర్తులను ఆహ్వానిస్తూ వేదోక్తంగా ధ్వజారోహణం చేశారు. ఇక శనివారం ఆలయంలో స్వామి వారి సన్నిధికి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభానికి కొడి ఉత్సవం నిర్వహించనున్నారు.



హంస వాహనంపై ఆది దంపతుల విహారం

» మూడోరోజు శ్రీశైలంలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

» నేడు టీటీడీ, కాణిపాకం నుంచి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీశైలం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇల కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. ఈ వాహనసేవలో భక్తులు వేలాదిగా తరలిరావడంతో క్షేత్ర వీధులన్నీ కిక్కిరిశాయి. కాగా.. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి మయూర వాహనసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం, సాయంకాలం తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

పాఠశాల బస్సు బోల్తా

డ్రైవర్ సహా 16 మంది విద్యార్థులకు గాయాలు



బోల్తాపడిన బస్సులో నుంచి విద్యార్థులను బయటకు తీస్తున్న స్థానికులు

తడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా తడ మండలం కరిపేటి కాలవ బ్రిడ్జి వద్ద పాఠశాల బస్సు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. సూళ్లూరుపేటలోని నారాయణ విద్యాసంస్థకు చెందిన బస్సు వరదాయపాళెం మండలం నుంచి ఉదయం విద్యార్థులను తీసుకొస్తుండగా కట్టలు, స్టీరింగ్ రాడ్ విరగడంతో అదుపుతప్పింది. బస్సు బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొని 15 అడుగుల లోతు కాలవలో బోల్తా పడింది. స్థానికులు, పోలీసులు అక్కడకు చేరుకొని విద్యార్థులను బయటకు తీసి సూళ్లూరుపేట, తడ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. రిషిత అనే చిన్నారికి నాలుక తెగి గాయమవగా, డ్రైవర్ వినోద్‌కు కాలు విరిగింది. 15 మంది విద్యార్థులు గాయపడ్డారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా కృషి చేయాలి

» రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేసేలా సిబ్బంది కృషి చేయాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ సూచించారు. రైతు సాధికార సంస్థ 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కార్యక్రమం'లో భాగంగా ఐదు రోజులపాటు ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై గుంటూరులో రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసింది. శుక్రవారం శిక్షణా కార్యక్రమానికి హాజరైన సిబ్బందిని ఉద్దేశించి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సమాజం చూడాలి అంటే అందరూ ప్రకృతి వ్యవసాయం అనుసరించాలని అన్నారు. ప్రతిరైతు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్)ను అనుసరించేలా చూడాలని సూచించారు. పీఎండీఎస్ వల్ల అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయని, తద్వారా పరిష్కరించలేని సమస్య అంటూ ఏదీ లేదని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, ఆదాయం పీఎండీఎస్ ద్వారా సాధించవచ్చని చెప్పారు. ప్రపంచ దేశాల్లో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో పీఎండీఎస్ విధానం ద్వారా 365 రోజుల పాటు భూమిని పంటలతో కప్పి ఉంచి పంట వైవిధ్యం పాటించడం వల్ల రైతుకు లాభం చేకూరుతుందని చెప్పా రు. ప్రకృతి వ్యవసాయం అమలు తీరును కలెక్టర్లు సమీక్షిస్తారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమానికి నిధుల కొరత లేకుండా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు విజయ్‌కుమార్ పేర్కొన్నారు.



శ్రీవారి సేవలో జస్టిస్ దుర్గాప్రసాద్ రావు

తిరుమల శ్రీవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ రావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

– ఆంధ్రజ్యోతి, తిరుమల







ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఢిల్లీలో కొత్త ఆరంభం

మూడుసార్లు కౌన్సిలర్‌గా పనిచేసి, తొలిసారి ఎమ్మెల్యే అయిన ఒక మహిళ నేరుగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించడం విశేషమే. దేశరాజధాని నగరాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఓ యుద్ధమే చేసిన భారతీయ జనతాపార్టీ, ఆ విలువైన స్థానాన్ని రాజకీయాల్లో కాకలు తేరిన పురుష పుంగవులకు కాకుండా అక్షరాలు దిద్దుతున్న రేఖాగుప్తాకు అప్పగించడం విచిత్రమే. ముఖ్యమంత్రుల ఎంపికలో కొత్తదనాన్ని చూపుతూ వస్తున్న బీజేపీ, ఆప్ అధినేతనే ఓడించిన మాజీ ముఖ్యమంత్రి తనయుడిని సైతం పక్కనబెట్టింది. ముమ్మారు నెగ్గిన వ్యక్తిని స్పీకర్ పదవిలో కూచోబెట్టింది. బీజేపీకి ఉన్న పద్నాలుగుమంది ముఖ్యమంత్రుల్లో ఏకైక మహిళ రేఖ. పరివార్ మూలాలతో ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకురాలిగా ఎదిగివచ్చిన ఆమె సమర్థత విషయంలో అనుమానాలు లేకున్నా పాలనానుభవం లేనిమాట నిజం.

ఢిల్లీ ఓటర్లలో మహిళలు ఎక్కువ, బీజేపీ ఓటర్లలోనూ పైచేయి వారిదే కనుక రేఖను సీఎం చేశారని ఓ విశ్లేషణ. ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉన్న వ్యాపారవర్గాన్ని సంతృప్తిపరచే ఉద్దేశమూ ఉన్నదట. ఇప్పటివరకూ ఉన్న ఏకైక మహిళా ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అన్నివిధాలా పోటీపెట్టడానికేనని కొందరంటారు. మహిళా ఓటుబ్యాంకును బీజేపీ నమ్ముకుందని, పలు పథకాలు, హామీలతో దానిని విస్తరించుకున్నదని కొందరు గుర్తుచేస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీవాసులకు పరిచయం ఉన్న, పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీచేసిన నాయకులకంటే, పెద్దగా ప్రచారంలో లేని, చెడ్డపేరుకు అవకాశమేలేని ఓ కొత్తమొఖం ఉత్తమమని పార్టీ పెద్దలు అనుకొని వుంటారు. ఒక మహిళ ఉన్నతస్థానంలోకి వస్తే దానికదే చర్చనీయాంశం కనుక, రేఖ రాకమీద మరికొంతకాలం విశ్లేషణలు సాగవచ్చు. అన్ని సామాజికవర్గాలకు సముచిత ప్రాతినిధ్యంతో మంత్రివర్గం ఏర్పాటు, ఆయుష్మాన్ భారత్‌లోకి ఢిల్లీని తీసుకురావడం ఇత్యాది నిర్ణయాలతో రేఖ పాలన మొదలైంది.

ఆప్ సుదీర్ఘపాలనమీద విరక్తిచెందారో, ఆ పార్టీ ఉన్నంతకాలం బీజేపీతో నిత్యఘర్షణలవల్ల తమకు అన్యాయం జరుగుతుందనుకున్నారో తెలియదు కానీ ఊహించనంత ఘనంగా బీజేపీకి ఢిల్లీ ప్రజలు అధికారం కట్టబెట్టారు. కేజ్రీవాల్ నిర్ణయాలకు లెఫ్టినెంట్ గవర్నర్ మోకాలడ్డటం, సీఎంగా ఉంటూ కూడా ఈయన దీక్షలు, ధర్నాలు చేయడం, ఎల్జీ అధికారాలు, పరిధులు, పరిమితులమీద న్యాయస్థానాల్లో సుదీర్ఘపోరాటాలు సాగడం ఢిల్లీ వాసులకు విరక్తి కలిగించివుంటాయి. సుప్రీంకోర్టు పలుమార్లు జోక్యం చేసుకున్నా, ఇద్దరి మధ్యా హద్దులు గీసినా తెగని ఆ పంచాయితీ చూసి డబుల్ ఇంజన్ సర్కార్ పరిష్కారమని అనుకొని ఉంటారు. ఇకపై ఏ సమస్యా ఉండదు. ఎవరి అధికారాలు ఏమిటో ఎవరూ చెప్పనక్కరలేదు, ఒకరిమీద ఒకరు దుమ్మెత్తిపోసుకోవడాలు ఉండవు. ఎవరిమాట వినాలో, ఎవరి ఆదేశాలు బేఖాతరు చేయాలో తెలియని గందరగోళస్థితి అధికారులకు సైతం ఉండదు. పాలనకూ, ప్రభుత్వానికి సంబంధించి కిందనుంచి పై వరకూ సమస్త వ్యవస్థలూ బీజేపీ చేతుల్లోకి వచ్చేసినందున ఏలుబడి సవ్యంగా, నల్లేరుమీద నడకవుతుందని ఆశించాలి. అధిష్ఠానం ఆశీస్సులు దండిగా ఉన్న కొత్త ముఖ్యమంత్రి వారి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటూ రాజ్యం చేయవచ్చు. తమపార్టీ ప్రభుత్వాలే ఉన్న హర్యానా, యూపీల సహాయసహకారాలను పొందవచ్చు. కేజ్రీవాల్‌ను కూల్చడం ఇప్పుడు కాకుంటే ఇప్పట్లో కాదన్నరీతిలో బీజేపీ ఎన్నికల యుద్ధం చేసింది. ఆయనను అవినీతిపరుడిగా చిత్రించేందుకు వ్యవస్థలన్నింటినీ దింపి, జైలుకు సైతం పంపింది. మోదీ పరిభాషలో చెప్పాలంటే మిగతా పార్టీల కంటే ఎక్కువగా రేవడీలను ప్రకటించి, రెండున్నర దశాబ్దాల తరువాత రాజ్యాన్ని గెలుచుకుంది. ఆప్ ఆరంభించిన పథకాలన్నింటినీ ఏ లోటుపాట్లు లేకుండా కొనసాగించడంతో పాటు, భారీ నగదు బదిలీలతో సహా, అన్ని ఎన్నికల హామీలను అమలు చేయడం కొత్త ప్రభుత్వం విధి. వాయు, జల కాలుష్యాలతోనూ, ట్రాఫిక్ సమస్యలతోనూ సతమతమవుతున్న ఢిల్లీవాసులను నిర్దిష్టమైన ప్రణాళికలతో ఒడ్డునపడవేయడం కొత్తప్రభుత్వం విధి. సభలో మూడింట రెండువంతుల సంఖ్యాబలం ఉన్న కొత్తముఖ్యమంత్రి ఢిల్లీని ఎక్కడికో తీసుకుపోతాననీ, ఏదేదో చేసేస్తాననీ చెప్పడం వల్ల ప్రయోజనం లేదు. వీధిపోరాటాల్లో ఆరితేరిన ఆప్ ప్రభుత్వాన్ని కనిబెడుతూనే ఉంటుందని, ప్రశ్నిస్తూనే ఉంటుందని రేఖాగుప్తా గుర్తుపెట్టుకోవాలి.

పేదలు లేనేలేరా నిర్మలమ్మా?!

ఒక ప్రభుత్వం యథోచితంగా ఇచ్చే హామీలను నేను సాధారణంగా సంశయిస్తాను; చేసిన వాగ్దానాలను అమలుపరిచేందుకు, అంతిమంగా అవి ఎలాంటి ఫలితాలనిచ్చాయో పార్లమెంటుకు నివేదించేందుకు ఒక నిర్దిష్ట గడువును సూచిస్తూ ఇచ్చే హామీలకు మాత్రమే నేను ప్రాధాన్యమిస్తాను. నరేంద్ర మోదీ, ఆయన ప్రభుత్వం 2014 నుంచి ఇచ్చిన హామీలలో మచ్చుకు కొన్నిటిని పేర్కొంటాను. ఇవేవీ నిర్దేశిత లక్ష్యాల పరిపూర్తితో ప్రజల శ్రేయస్సుకు దోహదం చేసినవి కావని మరి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇవిగో ఆ హామీలు: 2022 సంవత్సరం నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ రెట్టింపు అయి 5 ట్రిలియన్ డాలర్ల విలువ సంతరించుకుంటుంది: మోదీ (సెప్టెంబర్ 20, 2014); 2022లో దేశంలోని ప్రతి గృహానికి ప్రతి రోజూ రేయింబవళ్లు పూర్తిగా విద్యుత్ సరఫరా జరుగుతుంది : మోదీ (సెప్టెంబర్ 4, 2015); 2022 నాటికి ప్రతి భారతీయుడికీ గృహవసతి సమకూరుతుంది: మోదీ (ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఉటంకింపు); 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది: మోదీ (జూన్ 20, 2018); 2022లోగా ఇండియా బుల్లెట్ ట్రైన్‌లు ఒక వాస్తవంగా ప్రజలకు సేవలు అందిస్తాయి: (ఒమాన్‌లో ప్రవాస భారతీయుల సమావేశంలో మోదీ ఉవాచ). ఇంతకూ 2022 మన జీవన గమనంలో గడిచిపోయిన సంవత్సరమా లేక రాబోయే సంవత్సరమా?



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

2025–26 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌లో 7 పథకాలు, 8 లక్ష్యసాధన సంఘాలు (మిషన్స్), 4 నిధులు (ఫండ్స్)తో సహా అనేక హామీలు ఉన్నాయి. అయితే ఈ పథకాలు, లక్ష్య సాధన సంఘాలలో చాలా వాటికి డబ్బు కేటాయించనే లేదు. సహజంగానే బడ్జెట్‌పై చర్చలో బడ్జెట్‌లో అంకెల గురించి పలువురు ఎంపీలు గౌరవనీయ ఆర్థికమంత్రిని ప్రశ్నించారు. బడ్జెట్ అనేది డబ్బు గురించి కదా. కేటాయించిన డబ్బు, ఖర్చు చేసిన డబ్బును సమగ్ర అంకెలలో తెలుపుతారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు రూ.1,00,000 కోట్ల మేరకు తాను తగ్గించిన మొత్తంలో సంపన్నుల (వార్షికాదాయం రూ.1 కోటికి పైగా ఉన్నవారు)కు, మహా సంపన్నుల (వార్షికాదాయం రూ.100 కోట్లు ఉన్నవారు)కు, కుబేర సమానుల (వార్షికాదాయం రూ.500 కోట్లు ఉన్నవారు)కు ఇచ్చిన పన్ను మినహాయింపులు కూడా ఉన్నాయని ఆర్థికమంత్రి అంగీకరించారు. అయినా తాను ధనవంతులకు చాలా స్వల్పస్థాయిలో మాత్రమే పన్ను మినహాయింపు నిచ్చానని ఆమె వివరించారు! 'రూ.1 కోటి నుంచి రూ.500 కోట్ల దాకా వార్షికాదాయం ఉన్నవారు పన్ను తగ్గింపునకు అసలు ఎలా అర్హులు అవుతారు అన్న ప్రశ్నకు ఆర్థిక మంత్రి సమాధానమివ్వలేదు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన ప్రతి నిర్ణయంలోనూ సమానహక్కు, నైతికత (ఈక్విటీ, మొరాలిటీ) సూత్రం అంతర్భూతంగా ఉంటుంది. మోదీ ప్రభుత్వం ఈ సూత్రాన్ని చాలా కాలం క్రితమే త్యజించింది. ఆర్థికమంత్రి 'పన్ను మినహాయింపుల' నివ్వడంలో తమ నాయకుడిని అనుసరించారు.



రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చకు ఆర్థికమంత్రి సమాధానంలో పెరుగుతున్న నిరుద్యోగిత లేదా కుదించుకుపోతున్న వస్తూత్పత్తి రంగం గురించి ఒక్కమాట లేదు. దేశ జనాభాలో ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది గురించి ప్రస్తావించనే లేదు. యుఎన్‌డిపి ప్రకారం దేశంలోని పేదలలో నిరుపేదలు అయిన 21 కోట్ల మంది గురించి ఆమె పూర్తిగా విస్మరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దృష్టిలో మన దేశంలో పేదలు లేనే లేరు!

మూలధన వ్యయాలలో 'కోత'లను వివరించడంలో కూడా ఆర్థికమంత్రి అదే పద్ధతిని అనుసరించారు. 2024–25లో కేంద్ర ప్రభుత్వ మూలధనవ్యయంలో రూ.92,682 కోట్ల మేరకు కోత పెట్టారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలకు మూలధన వ్యయానికి మంజూరు చేసిన మొత్తాలలో రూ.90,887 కోట్లు కోత పెట్టారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో మూల ధన వ్యయానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు గత ఆర్థిక సంవత్సరంలో కంటే అధిక మొత్తంలో ఉన్నాయని ఆమె అన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆ అంచనా వ్యయాలలో కోత పెట్టరనే భరోసా ఏమున్నది?

ఈ కోతల పర్యవసానాలు ఎలా ఉన్నాయి? 2024–25లో మూలధన వ్యయం, రెవెన్యూ వ్యయంలో కోతలు ఆయా రంగాలలో ఈ విధంగా ఉన్నాయి: (అంకెలు అన్నీ కోట్ల రూపాయాలలో)– ఆరోగ్యం: 1,225; విద్య: 11,584; సాంఘిక సంక్షేమం: 10,019; వ్యవసాయం: 10,992; గ్రామీణాభివృద్ధి: 75,133; పట్టణాభివృద్ధి: 18,907; ఉపాధి కల్పన: 8,283. వ్యయాలలో కోతల వల్ల ఎక్కువగా నష్టపోయింది ఎవరు? పేదలు. ఆర్థికమంత్రి ఉదారంగా ఇచ్చిన ఆదాయపు పన్ను మినహాయింపు వల్ల లబ్ధి పొందింది ఎవరు? పేదలు ఎంత మాత్రం కాదు.

సమానహక్కు, నైతికత సూత్రానికి ఆర్థికమంత్రి నిబద్ధమయి ఉంటే వస్తు సేవల పన్ను రేట్లు లేదా పెట్రోల్, డీజిల్‌పై పన్నులలో కోత ద్వారా పన్ను తగ్గింపు చేసి వుండేవారు. లేదూ గ్రామీణ ఉపాధి హామీ పథకం లబ్ధిదారుల దినసరి వేతనాల పెంపుదల, అలాగే అన్నిరకాల ఉద్యోగితలోను చట్టబద్ధమైన కనీస వేతనాలను పెంచడం ద్వారా ప్రజల చేతుల్లో భారీ మొత్తంలో డబ్బు ఉంచేవారు.

రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చకు ఆర్థికమంత్రి తన సమాధానాన్ని సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. ఆమె వాదనా ధోరణి ఎంపీలకు బాగా తెలుసు కనుక, ఆమె సమాధానం తీరు వారినేమీ నిరుత్సాహపరచలేదు. 5.20 గంటలకు మన్మోహన్ సింగ్‌పై ఆమె ఒక విసురు విసిరారు. ఆయన 1991 దార్శనికత, వివేకాన్ని ఆమె పరిహసించారు, ప్రధానమంత్రిగా ఆయన పదేళ్ల హయాంలో సంస్కరణలు 'స్తంభించి' పోయాయని ఆమె అన్నారు. 5.30 గంటలకు పేదలను ఆమె అపహసించారు. 'మీరందరూ పేదవాళ్లే, నేనూ పేదవ్యక్తినే' అని ఆమె వ్యాఖ్యానించారు కొద్ది నిమిషాల అనంతరం రాఘవ్ చద్దా (ఆప్ సభ్యుడు)ను ఉద్దేశించి 'మీరు ఒక చార్టర్డ్ అకౌంటెంట్ అని భావించడంలో నేను సరిగానే ఉన్నానా?' అని హేళన చేశారు. 6 గంటల తరువాత 1 నిమిషానికి ఆమె తన సమాధానాన్ని ముగించారు.

ఆర్థికమంత్రి సమాధానంలో పెరుగుతున్న నిరుద్యోగిత లేదా కుదించుకుపోతున్న వస్తూత్పత్తి రంగం గురించి ఒక్కమాట లేదు. ద్రవ్యోల్బణం, వేతనాల స్తంభన, పెరుగుతున్న కుటుంబ రుణభారం గురించీ ఒక్క మాటంటే ఒక్క మాట లేదు. విద్య ఆరోగ్య భద్రతా రంగాలకు బడ్జెట్ కేటాయింపులలో ఖర్చుచేయని నిధుల గురించి ఆమె పెదవి విప్పనేలేదు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల స్థితిగతులపై మౌనమే ఆమె ప్రతిస్పందన. దేశ జనాభాలో ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది గురించి ప్రస్తావించనే లేదు. యుఎన్‌డిపి (ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం) ప్రకారం దేశంలోని పేదలలో నిరుపేదలు అయిన (దేశ జనాభాలో) 14.96 శాతం (21 కోట్లు) మంది గురించి ఆమె పూర్తిగా విస్మరించారు. ఇంతెందుకు, ఒక్క మాటలో చెప్పాలంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దృష్టిలో మన దేశంలో పేదలు లేనే లేరు! ఈ భారత భాగ్య విధాతలను అభాగ్య భారత జన కోటి క్షమించుగాక!!

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

సామాజిక న్యాయంతో సుస్థిరాభివృద్ధి

'పర్యావరణ విధానాలకు ముఖ్య మద్దతు ధనిక దేశాలు, సుఖజీవనులు అయిన సంపన్నులు, మధ్య తరగతి ప్రజల నుంచి రావడం యాదృచ్ఛికమేమీ కాదు. అధికమవుతున్న, ఉద్యోగ, ఉపాధి రాహిత్యంతో కునారిల్లుతున్న పేదలు అధికస్థాయిలో ఆకాంక్షిస్తున్నారు' అని ప్రముఖ మార్క్సిస్టు చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్ బామ్ తన 'The Age of Extremes' (1994)లో రాశారు. పేదలు ఎక్కువగా ఆరాటపడుతున్నది ఏమిటి? మరిన్ని వినియోగ సరుకులు, విలాస వస్తువులు, మరింత ఆర్థికాభివృద్ధిని కోరుతున్నట్టు ఆ చరిత్రకారుడు భావించాడు. పేదలు ఆశిస్తున్నవి సిద్ధించడానికి పర్యావరణ రాజకీయాలు అవరోధంగా, ప్రతిబంధకంగా ఉన్నాయని హాబ్స్ బామ్ ముక్తాయించాడు.



మన పర్యావరణ సంక్షోభాలు తీవ్రమవనున్నాయి. వాటి ప్రతికూల పర్యవసానాలు పేద ప్రజల ఆరోగ్యం, జీవనాధారాలపై విషమ ప్రభావాన్ని చూపుతాయి. బహుశా, వివేచనాశీలురు అయిన యువ భారతీయులు అంతిమంగా తమ మేధో, కార్యాచరణ సామర్థ్యాలను సమీకరించుకుని, అర్ధ శతాబ్ది క్రితం పర్యావరణ సుస్థిరతకు చిప్కో ఉద్యమ నిర్మాతలు సాహసోపేతంగా నిర్దేశించిన బాటలో దేశాన్ని ముందుకు తీసుకువెళతారు. అభివృద్ధిని సామాజిక న్యాయంతో సమ్మిళితం చేసేందుకు ప్రయత్నించిన మార్గమది.

నేను ఈ మాటలను మొదటిసారి చదివిననాటికే, రెండు దశాబ్దాలుగా పేద ప్రజల పర్యావరణ ఉద్యమాలను అధ్యయనం చేస్తున్నాను. చిప్కోగా సుప్రసిద్ధమైన హిమాలయ ప్రాంతాల రైతుల నిరసనోద్యమంపై నా డాక్టోరల్ థీసిస్‌ను రాశాను. సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిస్తూ ధ్వంసమైన అడవుల పునరుద్ధరణకు జరిగిన పర్యావరణ పరిరక్షణ మహోద్యమమది. 1973లో ప్రారంభమైన ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా అటువంటి ఉద్యమాలు వెల్లువెత్తడానికి స్ఫూర్తిగా నిలిచింది. అడవులు, జలవనరులు, పచ్చిక భూములపై ప్రజల ఉమ్మడి హక్కుల సంరక్షణకు సాగిన ఉద్యమాలవి.

చిప్కో ఉద్యమం ప్రభావంతో భారత్ ఒక ప్రత్యామ్నాయ, మరింత పర్యావరణ హితకరమైన అభివృద్ధి నమూనాను అనుసరించాల్సిన అవసరమున్నదా అనే విషయమై తీవ్ర చర్చ జరిగింది. వైజ్ఞానికులు, సామాజిక శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, ప్రజా ఉద్యమాల క్రియాశీలురు అందరూ ఈ చర్చలో పాల్గొన్నారు. ఉన్నత స్థాయి సైద్ధాంతిక వాదోపవాదాలుగా కాకుండా రంగాల వారీ నిర్దిష్ట ప్రశ్నలపై ఈ చర్చ జరిగింది. అడవులపై రాజ్య వ్యవస్థ యాజమాన్య నమూనా కంటే స్థానిక జన సముదాయాల ఉమ్మడి నియంత్రణ శ్రేయోదాయక, సామాజిక న్యాయసమ్మతమైన ఫలితాలను ఇస్తుందా? హైవేలు, డ్యామ్‌లు మొదలైన మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టుల ఫలితంగా నిర్వాసితులు అయిన రైతులు, గిరిజనులకు ఆర్థిక నష్ట పరిహారం చెల్లిస్తే సరిపోతుందా? లేక వారికి ప్రత్యామ్నాయ జీవనాధారాలు, ఉపాధి ఉద్యోగాలను సమకూర్చాలా? పట్టణీకరణ ప్రక్రియలు గ్రామీణ ప్రాంతాల వనరులను నగరాలు మితిమీరిన స్థాయిలో ఉపయోగించుకునేందుకు దారి తీస్తున్నాయా? వన్యప్రాణుల సంరక్షణ కార్యక్రమాలు పులుల, ఏనుగుల జనాభాను కాపాడడానికే ప్రాధాన్యమిస్తూ మాగాణి భూములు, తుప్పలు, పొదలను, ప్రమాదంలో పడిన సహజావాసాలను పరిరక్షించడాన్ని ఉపేక్షిస్తున్నాయా?

ఇవీ, ఇంకా ఇటువంటి ఎన్నో ప్రశ్నలను వైజ్ఞానిక జర్నల్స్, వెబ్‌సైట్‌లు, ఉద్యమ వేదికలపై చురుగ్గా చర్చించడం జరిగింది. అయితే ఇదే సమయంలో 'భారత్ పేద దేశమని, పర్యావరణాన్ని హరితంగా ఉంచుకోగలగడం సాధ్యంకాని విషయమని, అది అభిలషణీయం కూడా కాదు' అన్న అభిప్రాయం ఒకటి మన అధికార, ప్రభావశీలవర్గాలలో బలంగా ఉన్నది.

భారతదేశ విద్యావంతుల మాటా మంతీలోగానీ, సామాన్యుల పిచ్చాపాటీలో గానీ పర్యావరణ విషయాలు ఏవైనా ప్రస్తావనకు వస్తే అవి వాతావరణ మార్పుకు సంబంధించినవి మాత్రమే అవుతాయి. ఇక్కడ సైతం వాతావరణ మార్పు పర్యవసానాల తీవ్రతను యథాలాపంగా త్రోసిపుచ్చడం జరుగుతుంది మనం శిలాజ ఇంధనాలపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని, పూర్తిగా స్వచ్ఛఇంధన వినియోగానికి త్వరితగతిన పరివర్తన చెందాలని పాశ్చాత్య సంపన్న దేశాలు మనకు ఉపదేశాలు చేయడాన్ని తీవ్రంగా ప్రశ్నించడం జరుగుతోంది.

వర్తమాన భారతదేశం ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లలో వాతావరణ మార్పు ఒకటి మాత్రమే. బహుశా అది అంత ప్రధానమైనది కూడా కాదు. ఢిల్లీ, ఇతర ఉత్తర భారతావని నగరాలలోని వాయు కాలుష్యం స్థాయి ప్రపంచంలో మరెక్కడ కంటే అధికంగా ఉంటోంది. మన మాతృభూమిని పావనం చేస్తున్న నదులలో చాలా భాగం జైవికంగా మరణించినవే. వాటిలో పారుతున్న నీరు నిర్మలమైనది కాదు. మనుషులుగానీ, పశువులు గానీ ఆ నీటిని తాగలేకున్నాయి. భూగర్భ జలాలు అంతకంతకూ ఇంకి పోతున్నాయి. భారతదేశ ధాన్యాగారంగా ప్రసిద్ధి పొందిన పంజాబ్‌లో కూడా భూగర్భ జలాలు ఆందోళనకరంగా అడుగంటిపోయాయి. పంటభూముల్లో రసాయన కాలుష్యం పరిమితులను మించిపోతోంది. సహజ అరణ్యాలను పరసీమల కలుపు మొక్కలు ఆక్రమిస్తున్నాయి. ఫలితంగా జీవ వైవిధ్యం నానాటికీ తరిగిపోతోంది.



▪ రామచంద్ర గుహ

గతానుగతం

మన దేశంలో సంభవిస్తోన్న పర్యావరణ దుర్వినియోగం, ధ్వంసాన్ని అర్థం చేసుకునేందుకు నాలుగు కీలక అంశాలు ఉన్నాయి. మొదటిది– పర్యావరణ వినాశనాలలో వేటికీ వాతావరణ మార్పుతో సంబంధం లేదు. అసంబద్ధంగా రూపొందించి, అమలుపరుస్తున్న ఆర్థిక విధానాల ఫలితాలే ఆ విధ్వంసాలు. కార్పొరేట్ కంపెనీల పేరాశ, ప్రభుత్వాధికారుల ధన దాహం అందుకు అధిక భాగం దోహదం చేస్తున్నాయి; రెండోది– పర్యావరణ నష్టాలు స్వతంత్రంగా సంభవిస్తున్నప్పటికీ వాతావరణ మార్పు ఆ సమస్యలు మరింతగా విషమించేందుకు కారణమవుతోంది. విలువైన జలవనరులు, అపార జీవ వైవిధ్యం ఉన్న పశ్చిమ కనుమలలోను, హిమాలయ ప్రాంతాలలో తరచు చోటుచేసుకుంటున్న భూపాతాలు మొదలైన ప్రాకృతిక విపత్తులే అందుకు నిదర్శనాలు. అనియంత్రిత మైనింగ్ కార్యకలాపాలు, విచక్షణారహితంగా పర్యాటక కేంద్రాల పెరుగుదల, అధ్వాన్న రహదారులు తరచు కొండచరియలు విరిగి పడడానికి కారణమవుతున్నాయి. అకాల వర్షాలు మొదలైన వాతావరణ వైపరీత్యాలు ఆ విపత్తుల ప్రభావాలను మరింత తీవ్రం చేస్తున్నాయి. మూడోది– కాలుష్యం, పర్యావరణ ధ్వంసం కారణంగా కష్టనష్టాలను ప్రధానంగా ఎదుర్కొంటున్నది పేద ప్రజలే. ఢిల్లీలో కులీన వర్గాలవారు హైటెక్ ఎయిర్ ప్యూరిఫైయర్స్‌తో వాయు కాలుష్యం నుంచి తమను తాము కాపాడుకుంటుండగా విష వాయువును పీల్చి అనారోగ్యం పాలవుతున్నది మురికివాడల వాసులే. ఓపెన్ కాస్ట్ మైనింగ్‌తో గనుల పొరుగున ఉన్న పంట భూములు చవుడు పట్టిపోతున్నాయి. సంపన్నులు రక్షిత మంచినీటిని సమకూర్చుకుంటుండగా పేదలకు కలుషితమైన నదీ జలాలు, చెరువులు, బావుల్లో నీరు మాత్రమే అగత్యమవుతున్నది. కలుపు మొక్కల విస్తరణతో అడవులు శిథిలమవుతుండడం వల్ల పశువులకు ఆహారకొరత పెరిగిపోతోంది. చేతి వృత్తుల వారికి ముడిపదార్థాలు అలభ్యమైపోతున్నాయి. ఫలితంగా వేలాది పేద కుటుంబాలు జీవనాధారాలు కోల్పోయి అల్లాడుతున్నాయి.

పర్యావరణ విధ్వంసకర అభివృద్ధి మూలంగా పేద ప్రజల ఆరోగ్యం, జీవన సంక్షేమానికి జరుగుతోన్న నష్టాలను నివారించేందుకు అవసరమైన వైజ్ఞానిక, సామాజిక శాస్త్రాల సంబంధమైన ప్రతిభా పాటవాలు మన దేశంలో అపారంగా ఉన్నాయి. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలలో ప్రతిభావంతులు అయిన పర్యావరణవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, జల వాతావరణ శాస్త్రవేత్తలు, పట్టణ ప్రణాళికా కర్తలు, రవాణా, ఇంధన నిపుణులు ఎంతో మంది ఉన్నారు. ప్రశస్త వృత్తి నైపుణ్యంతో పాటు భారతదేశ సామాజిక, పర్యావరణ పరిస్థితులపై సమగ్ర అవగాహన ఉన్న వారిని ప్రభుత్వాలు సరిగా వినియోగించుకోవడం లేదు. ఇది గర్హనీయం. రాజకీయవేత్తలు ఈ నిపుణులను సంప్రదించడమే అరుదు. ఒకవేళ సంప్రదించినా వారి సూచనలను పాటించడం అనేది జరగదు. ఈ శోచనీయ ధోరణి అన్ని రాజకీయ పార్టీల నాయకులలోను ప్రబలంగా ఉన్నది. అజ్ఞానానికి తోడు కపటబుద్ధి వల్లే రాజకీయ నాయకులు అలా వ్యవహరిస్తున్నారని చెప్పక తప్పదు. శాస్త్రవేత్తలను ఇలా ఉపేక్షిస్తున్న, అనాదరిస్తున్న రాజకీయ నాయకులు గనుల యజమానులు, మౌలిక సదుపాయాల నిర్మాణ కాంట్రాక్టర్లు, ఫ్యాక్టరీ యజమానులకు కృతజ్ఞతాబద్ధులై ఉంటున్నారు. ఎన్నికల ప్రచారానికి, ఇతర వ్యయాలకు అవసరమైన నిధులు సమకూర్చేది ఆ సంపన్నులే కదా. సామాన్యులకు సంక్షేమాన్ని ఇచ్చినా ఇవ్వకపోయినా అవిరామంగా జరుగుతున్న ఆర్థికాభివృద్ధి, అంతకంతకూ పెచ్చరిల్లుతున్న వినియోగదారీ సంస్కృతి మధ్యతరగతి ప్రజలను బాగా ఆకట్టుకుంటున్నాయి. వారి దృక్పథంలో పర్యావరణవేత్తలు ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్నవారుగా కన్పిస్తున్నారు. భారత్‌ను అభివృద్ధి చెందని దేశంగా ఉంచడానికి పాశ్చాత్య దేశాల తరపున వ్యవహరిస్తున్నవారుగా పర్యావరణవేత్తలను పరిగణిస్తున్నారు.

వైజ్ఞానిక ప్రతిభాపాటవాలను రాజకీయవేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగా ఎలా ఉపేక్షిస్తున్నదీ 'పర్యావరణం–అభివృద్ధి' అన్న అంశంపై సుప్రసిద్ధ జర్నల్ 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' ఇటీవల (11 జనవరి, 2025) వెలువరించిన ఒక ప్రత్యేక సంచికలో ప్రముఖ నిపుణులు రాసిన వ్యాసాలు విశదం చేశాయి. దేశ పర్యావరణం, లక్షలాది పేద కుటుంబాల జీవనాధారాల భద్రతను అధికార వర్గాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆ ప్రత్యేక సంచిక ఎడిటర్లు శరత్ చంద్ర లెలె, గీతాంజోయ్ సాహు నిరసించారు.


సమీప భవిష్యత్తులో మన దేశంలో పర్యావరణ సంక్షోభాలు అనివార్యంగా తీవ్రమవుతాయి. వాటి ప్రతికూల పర్యవసానాలు పేద ప్రజల ఆరోగ్యం, జీవనాధారాలపై విషమ ప్రభావాన్ని తప్పక చూపుతాయి. బహుశా, చారిత్రక దురభిప్రాయాలు, అపోహల భారం లేని వివేచనాశీలురు అయిన యువ భారతీయులు అంతిమంగా తమ మేధో, కార్యాచరణ సామర్థ్యాలను సమీకరించుకుని, అర్ధ శతాబ్ది క్రితం పర్యావరణ సుస్థిరతకు చిప్కో ఉద్యమ నిర్మాతలు సాహసోపేతంగా నిర్దేశించిన బాటలో తమ దేశాన్ని ముందుకు తీసుకువెళతారు. అభివృద్ధిని సామాజిక న్యాయంతో సమ్మిళితం చేసేందుకు ప్రయత్నించిన మార్గమది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

స్వచ్ఛభారత్ స్ఫూర్తికి మూలపురుషుడు

మోదీ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చేపట్టిన మంచి పనుల్లో 'స్వచ్ఛభారత్' ఒకటి. అది కొత్తదేమీ కాదు, దశాబ్దాలుగా 'సెంట్రల్ రూరల్ శానిటేషన్ ప్రోగ్రామ్' పేరుతో ఉన్న స్కీమ్, 2012లో 'నిర్మల్ భారత్ అభియాన్'గా, మోదీ వచ్చాక స్వచ్ఛభారత్‌గా మారింది. దీనికి బ్రాండ్ అంబాసిడర్లుగా క్రీడా సినీ తారలను పెట్టుకుని, గాడ్గే మహరాజ్ లాంటి వారిని విస్మరించారని కాలమిస్ట్ సుధీంద్ర కులకర్ణి లాంటి మేధావులు అప్పట్లోనే అన్నారు.

2001 నుంచి కేంద్ర పథకానికి అనుబంధంగా, మహారాష్ట్ర సర్కారు 'సంత్ గాడ్గే బాబా స్వచ్ఛతా అభియాన్'ను ప్రారంభించి, ప్రజలను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛ గ్రామాలకి బహుమతులను ఇచ్చింది. తర్వాతి కాలంలో, స్వచ్ఛ భారత్‌ను గాంధీకి లింక్ చేశారు కానీ, గాడ్గేను పట్టించుకోలేదు.



భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ప్రభవించిన ఎందరో సాధువులు, గురువులు బాహ్య స్వచ్ఛతనే కాకుండా అంతరంగ స్వచ్ఛతను కూడా ప్రచారం చేశారు. అటువంటివారిలో గాడ్గే మహరాజ్ కూడా ఒకరు. మహారాష్ట్రలో ఒక రజక కుటుంబంలో 1876 ఫిబ్రవరి 23న పుట్టిన ఆయన 1956 డిసెంబర్ 20న కన్నుమూశాడు. జీవితాంతం ఓ వైపు కీర్తనలతో మనసుల్ని, మరోవైపు చీపురుతో వీధుల్ని పరిశుభ్రం చేశాడు. 1905లో తన 29వ ఏట భార్యనీ పిల్లల్నీ వదిలి సిద్ధార్థుడిలాగా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆనాటి నుంచి చనిపోయేవరకూ, చీపురు చేతబట్టి పరిశుభ్రతను ప్రచారం చేశాడు. ఆయనకు ఉన్న ఆస్తి ఒక మట్టిమూకుడు మాత్రమే. దాన్ని మరాఠీలో గాడ్గే అంటారు. అసలు పేరు దేబూజీ అయినా, నెత్తిమీద పెట్టుకునే మూకుడు కారణంగా గాడ్గే మహరాజ్ అని పిలవటం మొదలు పెట్టారు జనం. కులం అడిగితే అంటరాని వాడినని చెప్పి, తద్వారా అంటరానివారు ఎదుర్కొంటున్న అవమానాలను స్వయంగా అనుభవిస్తూ అర్థం చేసుకోగలిగాడు గాడ్గే. కుల వివక్షపై అలుపెరగని పోరాటాన్ని చేశాడు. భగవంతుడు మానవాళికి తండ్రయితే, కొన్ని కులాలపైనే ఎందుకు మమకారం చూపిస్తాడు? మరికొన్ని కులాలపై ఎందుకు కటువుగా వుంటాడు? అని ప్రశ్నించాడు.

గాడ్గేబాబా పండరిపూర్‌లో అంటరానివారికి ధర్మశాల కట్టించి, అంబేడ్కర్‌కి అప్పగించాడు. దేశంలోనే అంటరానివారి కోసం నిర్మించిన తొలి ధర్మశాల అది. మెహెర్ బాబాతో కలిసి కుష్ఠు రోగులకి సేవ చేశాడు. జీవితాంతం మూఢనమ్మకాలపై చీపురు తిరగేశాడు. జంతుబలుల్ని నిరసించాడు. 'గోపాల గోపాల దేవకీ నందన్ గోపాల' అని దేవుడిని కీర్తిస్తూనే, దేవుడి పేరుతో జరిగే కర్మకాండలను, మోసాలను వ్యతిరేకించాడు. దీనుల సేవను మించిన దైవసేవ లేదన్నాడు. ఆకలికి అన్నం, దప్పికకి నీరు, దేహానికి దుస్తులు, గూడు లేనివారికి నీడ, రోగుల పట్ల శ్రద్ధ, పేదపిల్లలకి చదువు, జంతువులు పక్షుల మీద ప్రేమ, నిస్సహాయస్థితిలో వున్నవారికి ఆలంబన.. ఇవీ ఆయన సూత్రాలు. అదే ఆయన నమ్మిన ధర్మం.

గాడ్గే బాబా నిరక్షరాస్యుడు. అందరికీ చదువుకునే అవకాశం, ఆలోచన లేని ఆ రోజుల్లో, ఆయన బడుగు వర్గాల పిల్లల చదువు గురించి తపన పడ్డాడు. పేదరికం నుంచి, నిస్సహాయత నుంచి బయట పడాలంటే చదువొక్కటే మార్గమని చెప్పేవాడు. అంబేడ్కర్ అడుగు జాడల్లోనే విముక్తి ఉందన్నాడు. కొన్ని పాఠశాలలు కూడా కట్టించాడు. 1918లో తమకి కూడా శాసనసభలోకి వెళ్లే అవకాశమివ్వాలని శూద్రులూ, వెనకబడిన కులాలూ చేస్తున్న డిమాండ్‌ను బాల గంగాధర్ తిలక్ వ్యతిరేకించారు. దానికి గాడ్గే మహరాజ్ నిమ్నకులాలన్నీ చట్టసభల్లోకి వెళ్లడానికి సహకరించాలని, లేదా అందరినీ బ్రాహ్మణులుగా మార్చాలని తిలక్‌ను కోరాడు. ఆయనకి గాంధీజీతోనూ పరిచయం ఉంది. మహాత్ముడిని దైవదూతగా అభివర్ణించేవాడు. హేతువాదీ, పాత్రికేయుడూ అయిన ప్రబోధాంకర్ థాక్రే తొలిసారి గాడ్గే జీవిత చరిత్ర రాస్తే, కొడుకు బాల్ థాక్రే దానికి ముఖ చిత్రం గీశాడు. మరాఠీలో ఆయనపై రెండు సినిమాలు కూడా వచ్చాయి. అమరావతి యూనివర్సిటీకి గాడ్గే పేరు పెట్టారు.

గాడ్గే బాబా 'ఫాదర్ ఆఫ్ ది క్లీన్లీనెస్' మాత్రమే కాదు. సంస్కర్తగా, పర్యావరణవాదిగా, జంతు ప్రేమికుడిగా, కుల వివక్షపై పోరాడిన సామాజిక న్యాయయోధుడిగా, సమాజసేవకుడిగా ఆయనలో భిన్న కోణాలున్నాయి. ఆయన జీవిత చరిత్రను పిల్లల పాఠ్యాంశాలలో పెట్టాలి. స్వచ్ఛత గురించి ఆయన బోధించేనాటికి, అవి ప్రభుత్వం తప్పనిసరిగా చేయాల్సిన పనులన్న భావన కానీ, ఐక్యరాజ్యసమితి కార్యక్రమంగా గానీ రూపొందలేదన్న విషయాన్ని మనం గమనించాలి. ఆయన భారత రత్న పురస్కారానికి పూర్తిగా అర్హుడు. ఆయన జీవితం, ఆచరణ ఎప్పటికీ ఆదర్శప్రాయమే.

– నూతలపాటి నూతన్, జర్నలిస్ట్

(ఫిబ్రవరి 23: గాడ్గే మహరాజ్ జయంతి)

రెండు విప్లవ పార్టీల విలీనసభ

ప్రపంచం నిరంతరం మార్పులకు గురికావడం సాధారణమైనదే. కొన్ని నిర్దిష్ట దశలలో అనూహ్య మార్పులకు గురౌతుంది. ఇప్పుడదే జరుగుతోంది. అదే ప్రతిప్రపంచీకరణ (డీగ్లోబలైజేషన్) ప్రక్రియ! 1990లలో సోవియట్ రష్యా పతనం ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్)కి దారితీసి దేశాల మధ్య సరిహద్దుల్ని చెరిపింది. అడ్డుపడ్డ జాతీయవాదంపై పెను యుద్ధాలు చేసింది. అది విఫలమై నేడు ప్రతిప్రపంచీకరణ (డీగ్లోబలైజేషన్) రూపం తీసుకుంటోంది.

పెట్టుబడి, శ్రమశక్తి పరస్పర విరుద్ధ శక్తులైనా పరస్పరాధారితాలే. కాబట్టి పెట్టుబడి ప్రపంచీకరణ అనివార్యంగా శ్రమశక్తి ప్రపంచీకరణకి దారితీస్తుంది. అందులో భాగమైన సరళీకరణ నిర్జీవ సరుకులతో పాటు సజీవ శ్రమశక్తికి విస్తరించి దేశాంతర వలసలకు దారితీసింది. సుంకాలు లేని సరళ వాణిజ్యంతో పాటు సరళ శ్రమశక్తి వలసీకరణ ఉనికిలోకి వచ్చింది. అది ఇప్పుడు వికటించింది.

'ప్రపంచీకరణ' ప్రకారం నిర్జీవ సరుకులకీ, సజీవ శ్రమశక్తికీ అడ్డుగోడలు ఉండరాదు. దేశాల మధ్య సరిహద్దు గోడలు ఉండరాదు. ఫలితంగా ఆసియా, ఆఫ్రికాలకు యూరోప్, అమెరికాల పెట్టుబడులు ఆటంకాలు లేకుండా ప్రవహిస్తే; యూరోప్, అమెరికాలకు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల శ్రమశక్తి ప్రవహించింది. వాటికి నేడు బ్రేక్ పడుతోంది. ఇదే ప్రతిప్రపంచీకరణ ప్రక్రియ! అది ట్రంప్‌ని సృష్టించి వేగవంతం చేస్తున్నది.


కమ్యూనిజానికి కాలం చెల్లిందనే వాదనతోనే గ్లోబలైజేషన్ ఉనికిలోకి వచ్చింది. కాపిటలిజానికి ప్రత్యామ్నాయం లేదనే వాదన దానికి తోడైంది. అది నేడు తిరగబడింది. తద్వారా తనకే కాలం చెల్లిందని కాపిటలిజం అంగీకరించడమే. అంటే కమ్యూనిజం ప్రాసంగికత గల సిద్ధాంతమని అది సైతం ఒప్పుకోవడమే. కమ్యూనిజం ప్రాసంగికత గల సజీవ సిద్ధాంతంగా ఒప్పించాల్సిన అవసరం ఇక కమ్యూనిస్టులకు లేదు. శ్రామికవర్గ విప్లవీకరణ కృషి కమ్యూనిస్టు పార్టీల తక్షణ లక్ష్యం. అందు కోసం విప్లవోద్యమ నిర్మాణంపై వాటి కేంద్రీకరణ ఉండాలి. గత సూత్ర రహిత చీలిక సంస్కృతికి స్వస్తి చెప్పి, విప్లవ సంస్థల మధ్య విలీన ప్రక్రియ ఓ తక్షణ కర్తవ్యంగా మారింది.

అటు ప్రపంచవ్యాప్తంగా, ఇటు దేశంలో నియో నాజీజం పెరుగుతోంది. కమ్యూనిస్టు ఉద్యమం విప్లవీకరణ ప్రాతిపదికన సమైక్య, సంఘటిత శక్తిగా మారాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సీపీఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ రెండు పార్టీల విలీనం జరిగింది. ఇది కేంద్ర కమిటీల స్థాయిలో మొదట జరిగింది. ఆ వెలుగులో ఆంధ్రప్రదేశ్‌లో తాజాగా జరుగుతోంది. ఫిబ్రవరి 23 ఉదయం 10 గంటలకి విజయవాడ రాఘవయ్య పార్క్ వద్ద మాకినేని బసవపున్నయ్య భవన్ ఆడిటోరియంలో విలీన సభ జరుగనుంది. ఏపీ పార్టీ అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సభలో కేంద్ర కమిటీ సీనియర్ నేత వై. సాంబశివరావు, పార్టీ కేంద్ర కమిటీ నేత సాదినేని వెంకటేశ్వరరావు, తెలంగాణ పార్టీ అధికార ప్రతినిధి జేవీ చలపతిరావు, ఏపీ పార్టీ అధికార ప్రతినిధి పి. ప్రసాద్, పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్. విష్ణు, రాష్ట్ర పార్టీ నేత కె. పోలారి మాట్లాడతారు.

కమ్యూనిస్టు ఉద్యమం చీలికలతో బలహీనపడే కాలంలో కలయికలకు కూడా అవకాశం ఉందని కొత్త రాజకీయ సంకేతం ఇది. విలీనాలు జరగాల్సిన రేపటి లక్ష్యంతో పోల్చితే ఈ విలీనం చిన్నదే. ఇది గొప్పగా సంబరపడేది కాకపోయినా, సంతోషం పొందే పరిణామమే. విప్లవ పార్టీలు విలీనమైనంత మాత్రాన విప్లవం పురోగమించదు. ఐతే ఈ విలీన ఉత్తేజంతో విప్లవ పార్టీలు శ్రామిక, పీడిత ప్రజల మనస్సులలో ఆదరణ పొంది బలమైన ప్రజా ఉద్యమాల్ని నిర్మిస్తేనే విప్లవోద్యమ పురోగతి సాధ్యం అవుతుంది.

– పి. ప్రసాద్

సీపీఐ–ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఏపీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి



టమాటా కేజీ రూ.4

కుదేలవుతున్న రైతులు



* బహిరంగ మార్కెట్లో రూ.15 వరకు విక్రయం
* కూలి ఖర్చులు కూడా రావడంలేదని ఆవేదన

కష్టపడి పండించిన టమాటాకు మార్కెట్‌లో ధర లేక రైతులు కుదేలవుతున్నారు. మార్కెట్‌లో హెచ్చు తగ్గులు, పోటీ తత్వంతో నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.15 పలుకుతున్న టమాటాలను మేము మాత్రం కిలో రూ.4లకే అమ్ముకోవాల్సి వస్తుందని కన్నీరు పెట్టుకుంటున్నారు. కూలి ఖర్చులు కూడా రాని పంట ఎందుకని పలువురు రైతులు పంట పొలాలను దున్నేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, జి.కొండూరు

8

హోటళ్లకు గ్రీన్ లీఫ్ రేటింగ్

- స్వచ్ఛతా ప్రమాణాల ఆధారంగా వన్ లీఫ్, త్రీ లీఫ్, ఫైవ్ లీఫ్ స్టేటస్‌కు కార్యాచరణ
- డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు
- కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి

6లో

రంగ.. రంగా!

మల్లవల్లిలో ప్రైవేటు వెంచర్ కబ్జా

2014లో ప్లాట్లుగా అమ్మిన భూమిని 2018లో పొలంగా కొన్నట్లు డాక్యుమెంట్

చక్రం తిప్పిన వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి రంగా!

- రోడ్డున పడ్డ ప్లాట్ల కొనుగోలు బాధితులు
- డబుల్ రిజిస్ట్రేషన్లు ఎలా సాధ్యమని ఆవేదన
- కూటమి ప్రభుత్వమే న్యాయం చేయాలని వేడుకోలు



మల్లవల్లిలో ఆక్రమణకు గురైన వెంచర్

ప్రైవేటు వ్యక్తుల భూముల కబ్జాలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అనుచరులు గురువుకు తగ్గ శిష్యులుగా నిరూపించుకుంటున్నారు. 2014లో వెంచర్ వేసి ప్లాట్లుగా అమ్మిన భూమిని 2018లో పొలంగా కొన్నట్లు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేశారు. ఉద్యోగ విరమణ సమయంలో వచ్చిన సొమ్మును దాచుకుని కొన్న ప్లాట్ల యజమానులను రోడ్డున పడేశారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగారు. ఈ మొత్తం వ్యవహారంలో వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి రంగా చక్రం తిప్పినట్లు తెలిసింది. వీరికి ఎదురు తిరిగే శక్తిలేని బాధితులు న్యాయం కోసం ప్రభుత్వ అధికారులు, న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి, గుణదల /హనుమాన్ జంక్షన్ రూరల్: గన్నవరం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుల భూదందాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తాజాగా బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామ పరిధిలో వసంతాడ రత్తయ్య కుమారుడు సాంబశివరావు అనే వ్యక్తి సాయితేజ ఇన్‌ఫ్రా హైలెట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో 2014లో వెంచర్ వేసి ప్లాట్లను సేల్‌కు పెట్టారు. ఆ కంపెనీకి సాంబశివరావు ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయన కుమారుడు దినేష్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. వీరు వేసిన వెంచర్‌లో శ్రీగంధం మొక్కలు వేసి పెంచి తద్వారా వచ్చే లాభాలను ప్లాట్ల యజమానులకు ఇస్తామని చెప్పడంతో కొద్ది కాలంలోనే ప్లాట్లన్నీ అమ్ముడుపోయాయి. శ్రీగంధం చెట్లను పెంచి పెద్ద చేసినందుకు గాను 12 సంవత్సరాలకు వచ్చే లాభంలో 30 శాతం తాము తీసుకుని మిగిలిన 70 శాతం ప్లాట్ల యజమానులకు ఇస్తామని చెప్పి 10 రూపాయల స్టాంప్ పేపర్ మీద ఓ అగ్రిమెంట్ కూడా రాసి ఇచ్చారు. ప్లాట్ల సేల్స్ ప్రక్రియ పూర్తయిన కొద్ది రోజులకే వసంతాడ సాంబశివరావు అనారోగ్య కారణాలతో మరణించారు.



ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు

2018లో దొంగ డాక్యుమెంట్ పుట్టించి..

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రధాన అనుచరుడు రంగా తన వద్ద ఉండే మేదరమెట్ల శివాజీ, మరికొందరి పేర్ల మీద ఆ వెంచర్ మొత్తాన్ని పొలంగా కొన్నట్లు 2018లో డాక్యుమెంట్ పుట్టించారు. దాని ఆధారంగా వెంచర్‌కు చుట్టూ ఫెన్సింగ్ చేసి వెంచర్లో ఉండాల్సిన శ్రీగంధం మొక్కలను తొలగించి వాటి స్థానంలో ములగ మొక్కలు నాటి వ్యవసాయం చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు ఒక్కొక్కరుగా వెంచర్ వద్దకు చేరుకుని ఇదేమిటని ప్రశ్నిస్తే 'ఇందులోకి అడుగుపెట్టే హక్కు మీకు లేదు. నాకు అమ్మేశారు' అని శివాజీ సమాధానం చెప్పడంతో వారంతా నివ్వెరపోయారు. ఈ పొలం నాదే అనడానికి కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉందనడంతో ఆందోళన చెందారు. తమకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసిన సాంబశివరావు తనయుడు దినేష్‌ను దీనిపై నిలదీస్తే అతని మిగతా 6లో..

రంగానే చక్రం తిప్పాడు

తాము కొనుగోలు చేసిన వెంచర్‌లోని ప్లాట్లన్నింటిని మరొకరి పేరు మీదకు మా ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్ చేయించిన వ్యవహారంలో వంశీ అనుచరుడు రంగా చక్రం తిప్పాడు. రంగా అనుచరుడే ఈ శివాజీ. 2014లో మాకు రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లను తిరిగి 2018లో మరొకరికి ఎలా రిజిస్ట్రేసన్ చేస్తారు. ఈ విషయంపై రెవెన్యూ సదస్సులో అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. శ్రీగంధం మొక్కలు పెంచుతామని చెప్పి ప్లాట్లు కొనుగోలు చేసిన 175 మందికి ఒక ఎగ్రిమెంట్ కూడా అప్పట్లో రాసి ఇచ్చారు. ఈ విషయమై ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని న్యాయం చేయాలి. -భూపతిరెడ్డి, బాధితుడు

ఉద్యోగ విరమణ సొమ్ముతో కొన్నాం

ఉద్యోగ విరమణ చేసిన సమయంలో వచ్చిన సొమ్ముతో పాట్లు కొన్న వారే బాధితుల్లో ఎక్కువ మంది ఉన్నారు. పిల్లలకు ఉపయోగ పడతాయనుకుంటే మొత్తంగా మా సొమ్ము మట్టి పోతుందనుకోలేదంటూ ప్లాట్ల యజమానులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఒక్కో ప్లాటును రూ.8 లక్షలు వెచ్చించి కొంటే 12 సంవత్సరాల తర్వాత శ్రీగంధం మొక్కల ద్వారా వచ్చేలాభం మొత్తంగా కలిపి రూ.35 లక్షల వరకు చేతికి వస్తుందని చెప్పడంతో ప్లాట్లను కొన్నామని వారంతా వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు వేడుకుంటున్నారు.

వేగంగా..



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంపై ప్రభుత్వం దృష్టి

జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పూర్తికి చర్యలు

- పనులు ఆలస్యమవ్వడంతో.. మరో సంస్థకు అప్పగించాలన్న ఆలోచన
- చివరకు కాంట్రాక్టు సంస్థ ఎన్‌కేజీనే కొనసాగిద్దామని నిర్ణయం!
- ఏప్రిల్ నాటికి అందుబాటులోకి రానున్న నూతన ఏటీసీ టవర్

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనుల్లో వేగం పెంచడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. జూన్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేయించాలని నిర్ణయం తీసుకుంది. పనులు ఆలస్యం కావడంతో మరో సంస్థకు కాంట్రాక్టు ఇవ్వాలన్న డిమాండ్ వచ్చినా పాత సంస్థ ఎన్‌కేజీనే కొనసాగించాలని భావిస్తోంది. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను రచిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.540 కోట్ల అంచనా వ్యయంతో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో భూమి పూజ నిర్వహించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో టెండర్లను పిలిచారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ ఎన్‌కేజీ నిర్మాణ పనులు ప్రారంభించింది. ఈ టెర్మినల్ బిల్డింగ్ పనులను గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రోజు కూడా సమీక్షించలేదు. దీంతో రెండేళ్లలో పూర్తి చేయాల్సిన టెర్మినల్ బిల్డింగ్ పనులు నేటికీ పూర్తికాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఇందులో భాగంగా పలు ఆలోచనలను చేసింది. కాంట్రాక్టు సంస్థ ఎన్‌కేజీని సాగనంపి మరో కొత్త సంస్థకు పనులు అప్పగిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేసింది. అయితే ప్రస్తుత కాంట్రాక్టు సంస్థను సాగనంపాలంటే కనీసం ఏడాది సమయం పడుతుంది. దీనికంటే సదరు సంస్థతో పని చేయించుకోవటం మేలన్న ఆలోచనకు వచ్చింది. ఎన్‌కేజీ సంస్థపైనే ఒత్తిడి పెంచి పనులు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలని భావిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో జూన్ నాటికి పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం మిగతా 6లో..



నిర్మాణంలో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్

అదనంగా ప్రవేశపెట్టిన విమానాలన్నీ ఫుల్

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో అదనంగా ప్రవేశపెట్టిన విమానాలన్నీ ఫుల్ రష్‌గా నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో కొత్తగా ముంబాయికి ఒకటి, వైజాగ్‌కు రెండు, ఢిల్లీకి రెండు, హైదరాబాద్‌కు ఒకటి చొప్పున అదనంగా విమానాలను ప్రవేశపెట్టారు. ఇవన్నీ కూడా 95శాతం ఆపైన ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. ఇటీవల విశాఖపట్నానికి నడుపుతున్న రెండు అదనపు విమానాలు కూడా మంచి ఆక్యుపెన్సీతో ప్రయాణిస్తున్నాయి.

చురుగ్గా ఏటీసీ టవర్ నిర్మాణం

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతనంగా చేపడుతున్న ఏటీసీ(ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) టవర్ ఏప్రిల్ నాటికి పూర్తి కానుంది. ఇది అందుబాటులోకి రాగానే పాత ఏటీసీ టవర్‌ను తొలగిస్తారు. కొత్త ఏటీసీ టవర్‌లో సేఫ్టీ ఆపరేషన్స్ నిర్వహిస్తారు. నూతన టవర్ వెనుక చేపడుతున్న టెక్నికల్ బ్లాక్ పనులు కూడా 63 శాతం మేర పూర్తయ్యాయి. ఈ బ్లాక్‌లో కమ్యూనికేషన్స్ అండ్ నేవిగేషన్స్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేస్తారు.



ఏటీసీ టవర్



ప్లాట్‌ఫాంపైకి

దూసుకెళ్లిన బస్సు

పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ఘటన

విజయవాడ(బస్‌స్టేషన్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లిన ఘటన విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సును ప్రయాణికులను ఎక్కించుకోవటానికి రెండవ నంబరు ప్లాట్ ఫాం వద్ద పెడుతుండగా అదుపు తప్పి ప్లాట్‌ఫాంపైకి దూసుకుపోయి పిల్లర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బస్సు అద్దాలు పగిలిపోయాయి. పిల్లర్‌కు ఏర్పాటు చేసిన పబ్లిసిటీ బోర్డులు ధ్వంసమయ్యాయి. బస్సు ఎయిర్ బ్రేకులు ఫెయిల్ కావటంతో అదుపు తప్పి ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఉలికిపాటు

మచిలీపట్నంలో జీబీఎస్ కేసు నమోదు

సర్వజన ఆస్పత్రిలో బాధితుడికి చికిత్స

- ఆరోగ్యం నిలకడగానే ఉందంటున్న వైద్యులు
- జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం



బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో నమోదు కావడంతో కృష్ణాజిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇటీవల కాలంలో గుంటూరు జిల్లాలో జీబీఎస్‌తో ఒకరిద్దరు మరణించారనే వార్తలు వెలువడ్డాయి. తాజాగా జిల్లాలోనూ జీబీఎస్ లక్షణాలతో మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో ఒక వ్యక్తి చికిత్స పొందుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత శుక్రవారం ప్రకటించారు. దీంతో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ ఐసీయూ వార్డులోకి వెళ్లి బాధితుడిని అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఇది అంటువ్యాధి కాదని, ఇతరులకు సోకదని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.


బాధితుడు పెడన వాసి

పెడనకు చెందిన యువకుడు (33) కైకలూరు మండలం తామరకొల్లులో బతుకుదెరువు నిమిత్తం ఉంటున్నాడు. అక్కడ తీవ్ర అనారోగ్యం బారిన పడటంతో రెండు రోజుల కిందట పెడనలోని తన ఇంటికి వచ్చాడు. ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో మిగతా 6లో..



భారీ గోతులు, బయటపడిన రాళ్లతో ప్రమాదకరంగా ఉన్న కాజ్‌వే

తెలుగురాష్ట్రాల మధ్య రాకపోకలకు ప్రధాన మార్గాల్లో ఒకటి.. చిల్లకల్లు-వైరా రోడ్డులో మున్నేరు ఉపనదిపై అర్ధ శతాబ్దం క్రితం నిర్మించిన 'కాజ్‌వే'.. ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాలను అనుసంధానం చేసే ఈ కాజ్‌వే ప్రస్తుతం శిథిలావస్థకు చేరి వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. ప్రస్తుతం కాజ్ వే పటిష్టతపై అనుమానాలు నెలకొన్నాయి. రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగుతున్నా.. ఎప్పుడు కూలిపోతుందో అన్నట్టుగా ఈ కాజ్‌వే పరిస్థితి తయారైంది. భారీ గోతులు, పగుళ్లు వాహనదారులను భయపెడుతున్నాయి. దెబ్బతిన్న రెయిలింగ్, స్లాబ్, కాంక్రీట్ అప్రోచ్ బండ్ నుంచి బండరాళ్లు ఊడి పెను ప్రమాదానికి సంకేతంలా నిలుస్తున్నాయి. మున్నేరుపై కాజ్‌వే పునర్నిర్మాణానికి ప్రభుత్వం పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రోడ్డుపై గోతులు

ప్రమాదకరంగా.. కాజ్ వే!

- ధ్వంసమైన రోడ్డుపై వాహనదారుల ఫీట్లు
- ఏపీ, తెలంగాణా మధ్య రెండో ప్రధాన మార్గం..
- చిల్లకల్లు-వైరా రోడ్డులో మున్నేరుపై కాజ్ వేకు 50 ఏళ్లు
- ఏటా కాజ్‌వే మీదుగా వరద ప్రవాహం
- దెబ్బతిన్న రెయిలింగ్, స్లాబ్ పగుళ్లు.. భారీ గోతులు
- కాంక్రీట్ అప్రోచ్ బండ్ నుంచి బయటకు వస్తున్న రాళ్లు
- కాజ్‌వే పటిష్టపరచాలని వాహనదారుల డిమాండ్

(వత్సవాయి, ఆంధ్రజ్యోతి)
చిల్లకల్లు-వైరా రహదారిలో లింగాల వద్ద మున్నేరు ఉపనదిపై ఉన్న కాజ్‌వేపై వెళ్లాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ప్రతీ ఏడాది వచ్చే వరదల తాకిడికి కాజ్‌వే కొట్టుకుపోతోంది. దీంతో దెబ్బ తిన్న కాజ్‌వేపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా.. పటిష్ఠంగా నూతన కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో యాభైఏళ్ల వంతెన



మున్నేరుపై లింగాల వద్ద 1975లో మొత్తం 50 ఖానాలతో 12 అడుగుల ఎత్తున నిర్మించిన కాజ్‌వేకు దాదాపుగా యాభై ఏళ్లు పూర్తవుతోంది. వర్షాకాలంలో ఎగువన కురిసిన వర్షాలకు మునేరు పరవళ్లు తొక్కడంతో కాజ్‌వేపైకి నాలుగైదు అడుగుల వరదనీరు ప్రవహిస్తుంటుంది. ప్రవాహం తగ్గే వరకు నాలుగైదు రోజుల పాటు ఆంధ్రా, తెలంగాణాల మధ్య వాహన రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరద తాకిడికి కాజ్‌వేకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్ పోల్స్ మొత్తం విరిగిపోయి పూర్తిగా భారీ గుంతలమయంగా మారింది. ఈ రహదారిపైనే ఖమ్మం, భద్రాచలం, ఏలూరు, రాజమండ్రి తదితర ప్రాంతాలకు నిత్యం సిమెంట్ లారీలు తిరుగుతుంటాయి. పెనుగంచిప్రోలులో కొలువైన తిరుపతమ్మ దేవాలయంలో నిత్యం పూజలందుకునే అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ గ్రామాలకు చెందిన భక్తులు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాజ్‌వేను పునర్నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

కాజ్‌వే పై ప్రయాణం నరకం

- కట్టా శ్రీనివాసరావు, మక్కపేట రైతు



మూడు అడుగుల లోతు గుంతల్లో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు కాకుండా పటిష్ఠంగా ఏర్పాటు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసుకోవాలన్నా తిప్పలు పడుతున్నాం.

రాత్రి వేళల్లో కాజ్‌వేపై వెళ్లే పరిస్థితి లేదు

- భూక్యా సోమ్లానాయక్, లారీడ్రైవర్



రాత్రి వేళల్లో కాజ్‌వే పై ప్రయాణం నరకం.. విద్యుత్ దీపాలు లేక రాత్రుళ్లు ప్రమాదకరంగా ఉంటోంది. కాజ్‌వేకు ఇరువైపులా రెయిలింగ్ కనిపించక గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. రాత్రి సమయంలో కాజ్‌వే పక్కన వాహనాలను నిలిపి ఉదయం ప్రయాణం చేయాల్సి వస్తోంది.

మరమ్మతులు చేపడుతున్నాం

- పరుశురాముడు, ఆర్అండ్‌బీ డీఈ

కాజ్‌వే పునర్నిర్మాణం దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాం.. ప్రస్తుతం కాజ్‌వే మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. త్వరలోనే పనులు చేపడతాం.



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

స్పీకర్ ఓం బిర్లాను కలిసిన ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం, వెంకటేశ్వరస్వామి ప్రతిమను ఇచ్చి సత్కరించారు.

రేపు జిల్లా ట్రెజరీ ఉద్యోగ సంఘ ఎన్నికలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ట్రెజరీ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 23న జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా ఎస్‌కె హసీనా బేగం, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎస్‌కె పయాజ్ అహమ్మద్, పరిశీలకురాలిగా ఐ.అరుణ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

రంగ.. రంగా!

(5వ పేజీ తరువాయి)

నుంచి స్పందన లేదు. లోతుగా ఆరా తీస్తే రంగా అనుయాయుడు పేరుతో ఉన్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో దినేష్ సాక్షిగా ఉన్నాడన్న విషయం తెలిసి నివ్వెరపోయారు. తాము మోసపోయామని గ్రహించారు. రంగా ప్రోద్బలంతోనే శివాజికి మరో డాక్యుమెంట్ పుట్టిందని నిర్ధారించుకున్న ప్లాట్ల యజమానులంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. వీరిలో కొంతమంది కోర్టును ఆశ్రయించారు. విచారణ జరుగుతోంది. రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు కూడా చేశారు. అధికారుల దృష్టికి ఈ విషయాన్ని ప్లాట్ల యజమానులు తీసుకెళితే కోర్టులో తేల్చుకోవాల్సిందే, తామేమీ చేయలేమని స్పష్టం చేయడంతో బాధితులంతా కన్నీరుమున్నీరవుతున్నారు.

ఒకే పొలాన్ని ఇద్దరికి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు

- సోమరౌతు సూరిబాబు, బాధితుడు

మల్లవల్లిలోని వెంచర్లో స్థలాన్ని 2014లో కొనుగోలు చేశా. నాకు స్థలం అమ్మింది వసంతాడ రత్తయ్య కుమారుడు సాంబశివరావు. ఆయన సాయితేజ ఇన్‌ఫ్రా హైలెట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. స్థలం రిజిస్ట్రేషన్ చేసిన కొద్ది కాలానికే ఆయన మరణించారు. తర్వాత కంపెనీకి డైరెక్టర్ హోదాలో ఆయన కుమారుడు దినేష్ వ్యవహారాలన్నీ చూసుకునేవాడు. డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారమై దినేష్‌ను నిలదీస్తే సమాధానం లేదు. ఒకే పొలాన్ని ఇద్దరికి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు. వల్లభనేని వంశీ అనుచరుడు రంగా ఈ వ్యవహారంలో చక్రం తిప్పినట్లుగా తెలుసుకుని విస్తుపోయాం.

సూర్యఘర్ లక్ష్యాలపై దృష్టిపెట్టండి

- అమలు పురోగతిపై నిరంతర సమీక్ష : కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్‌లతో పాటు సౌర ఫలకాల ఏర్పాటు (ఇన్‌స్టలేషన్)పై ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాలపై అధికారులు దృష్టిసారించాలని, పథకం అమలు పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్ పథకం అమలుపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్‌లతో పాటు ఇన్‌స్టలేషన్స్‌పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు లక్షల విద్యుత్ సర్వీసుల్లో కనీసం రెండు లక్షల ఇళ్లకు సూర్యఘర్ కనెక్షన్లు లక్ష్యంగా నిర్దేశించుకొన్న నేపథ్యంలో విద్యుత్, గ్రామీణాభివృద్ధి విభాగాల అధికారులు, బ్యాంకర్లు, వెండర్లు, ఇలా వివిధ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే 75 వేల రిజిస్ట్రేషన్లు వచ్చినందున త్వరితగతిన సౌర ఫలకాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, బ్యాంకులు రుణ మంజూరును వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ఆదర్శ గ్రామాలుగా గుర్తించిన బూదవాడ (జగ్గయ్యపేట), వెల్వడం (మైలవరం), పరిటాల (కంచికచర్ల), కంభంపాడు (ఎ.కొండూరు) షేర్ మహ్మద్ పేట (జగ్గయ్యపేట), గ్రామాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు లక్ష్యాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, త్వరితగతిన 100 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏఈలను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, సూర్యఘర్ నోడల్ అధికారి ఎం.భాస్కర్, ఏపీసీపీడీసీఎల్ ఈఈ, డీఈ, ఏఈలతో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వెండర్లు హాజరయ్యారు.



అమ్మవారి దర్శనానికి భక్తుల రద్దీ, మహిళల పొణాసారాలు(కింద)

వీరమ్మ తిరునాళ్లకు తరలివస్తున్న భక్తులు



ఉయ్యూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు తరలివస్తున్నారు. తిరునాళ్లలో 14వ రోజైన శుక్రవారం అమ్మవారిని దర్శించి మొక్కుబడి తీర్చుకునేందుకు భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శనివారంతో తిరునాళ్ల ముగియనున్న నేపథ్యంలో అమ్మవారికి మొక్కులుతీర్చుకు నేందుకు పలు ప్రాంతాలనుంచి తరలి వస్తున్నారు. పట్టణ సీఐ రామారావు, ఎస్ఐ విశ్వనాథ్, సిబ్బందితో కలిసి వచ్చి దీపారాధనలతో పొటేళ్లతో ఆలయ ప్రదక్షిణచేసి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. సంతాన ప్రాప్తి కోసం మహిళలు అమ్మవారి ఆలయం వెనుక తడివస్త్రాలతో పొణాసారాలు చేశారు.



హార్డ్‌డిస్క్ పెట్టిన ప్రదేశాన్ని తాతయ్యకు చూపుతున్న బాధితుడు

పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసినా.. చోరీని నివారించలేకపోయాం!

- ఎమ్మెల్యే ఎదుట డాక్యుమెంట్ రైటర్ ఆవేదన

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివార్లలో ఇల్లు నిర్మించుకుని పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసినా చోరీని నివారించలేకపోయామని డాక్యుమెంట్ రైటర్ ప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం విష్ణుప్రియనగర్‌లో చోరీ జరిగిన ఇంటిని ఎమ్మెల్యే పరిశీలించి బాధితుడిని పరామర్శించారు. కట్టుదిట్టంగా ఇంటికి అన్నివైపులా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసుకున్నా, సీసీ కెమెరాలతో నిఘా పెట్టినా.. దొంగలు 11 అడుగుల ఎత్తులో ఉన్న హార్డ్‌డిస్క్‌ను ఎత్తుకెళ్లారని, సీసీ కెమెరా వైర్లను తొలగించారని చెప్పారు. 200 గ్రాముల బంగారం, 200 యూఎస్ డాలర్లు, రూ.20వేల నగదు చోరీకి గురైనట్టు తాతయ్యకు వివరించారు. అక్కడి నుంచే సీపీతో తాతయ్య ఫోన్‌లో మాట్లాడి అన్ని కోణాల్లో, ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి నిందితులను పట్టుకోవాలని కోరారు. ఆయన వెంట ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హోటళ్లకు గ్రీన్ లీఫ్ రేటింగ్

- స్వచ్ఛతా ప్రమాణాల ఆధారంగా వన్ లీఫ్, త్రీ లీఫ్, ఫైవ్ లీఫ్ స్టేటస్‌కు కార్యాచరణ
- డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ హిత స్వచ్ఛత, పారిశుధ్యంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ పర్యాటకులకు మధురానుభూతులు మిగిల్చే హోటళ్లు, లాడ్జిలకు ప్రభుత్వం 'గ్రీన్ లీఫ్' రేటింగ్ ఇవ్వనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టమ్ (ఎస్‌జీఎల్ఆర్ఎస్)పై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఆతిధ్య రంగం కీలకమైనదని, పర్యాటక రంగంలో భాగంగా ఆతిధ్య రంగంలో సురక్షిత పారిశుధ్య నిర్వహణను ప్రోత్సహించేందుకు 'గ్రీన్ లీఫ్' రేటింగ్ వ్యవస్థను ఆవిష్కరించినట్టు వివరించారు. హోటళ్లు, లాడ్జిలు, హోమ్‌స్టేలు, ధర్మస్థలాలు తదితర ఆతిధ్య సౌకర్యాలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వన్ లీఫ్ రేటింగ్ పొందాలంటే ఘనవ్యర్థాలు, మానవ వ్యర్థాలు, మురుగునీటి నిర్వహణలో 100-130 మార్కులు రావాలని, అదేవిధంగా త్రీ లీఫ్ రేటింగ్‌కు 130-180 మార్కులు, ఫైవ్ లీఫ్ రేటింగ్‌కు 180-200 మార్కులు సాధించాల్సి వుంటుందని వివరించారు. రేటింగ్‌కు సిఫార్సు చేసేందుకు వీలుగా జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ కన్వీనర్‌గా, జిల్లా పర్యాటక అధికారి సభ్య కార్యదర్శిగా కమిటీ వుంటుందని, అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఆర్డీవో ఛైర్మన్‌గా వెరిఫికేషన్ ఉప కమిటీ వుంటుందని తెలిపారు. ముందుగా హోటళ్లు, లాడ్జిలు తదితరాలను స్వచ్ఛ భారత్ అభియాన్ (గ్రామీణ్) వెబ్ సైట్ ద్వారా మ్యాపింగ్ చేయాల్సి వుందని, ఆయా యాజమాన్యాలకు డివిజన్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రేటింగ్ వ్యవస్థ గురించి వివరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయిలోనూ వర్క్‌షాపులతో పాటు శిక్షణ కార్యక్రమాలపైనా దృష్టిసారించాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది అక్టోబరు 2 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా కనీసం వెయ్యి ఆతిధ్య లొకేషన్లకు ర్యాంకింగ్స్ ఇవ్వాల్సి వుందని, ఈ నేపథ్యంలో జిల్లాస్థాయిలో ర్యాంకింగ్‌కు సంబంధించిన కార్యకాలాపాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ రేటింగ్స్ వల్ల పర్యాటకులతో పాటు ఆయా హోటళ్ల యాజమాన్యాలకు ప్రయోజనం వుంటుందని, అమరావతికి గేట్‌వే వంటి విజయవాడలో ఎక్కువ హోటళ్లు, లాడ్జిలు మంచి గ్రీన్ లీఫ్ రేటింగ్ సాధించి, పర్యాటకపరంగా, ఆతిధ్యం పరంగా జిల్లాను ముందు నిలిపేందుకు భాగస్వామ్య పక్షాలు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్వీ స్వామి, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీపీవో పి.లావణ్యకుమారి, జిల్లా టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధి టి.రవికుమార్, డీఎల్‌డీవోలు తదితరులు హాజరయ్యారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణయ్య వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యారు.

రెవెన్యూ అర్జీలపై అధికారుల ఆరా

- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పలువురికి ఫోన్లు
- సమస్యల పరిష్కారంపై అర్జీదారులకు ఆర్డీవోలు, తహసీల్దార్ల ప్రశ్నలు
- మెరుగైన పాలనకు దోహదం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పట్టాదారు పాస్‌బుక్‌కు ఎంత డబ్బులు తీసుకున్నారు? రీ సర్వే జరుపుతున్నపుడు మీకు నోటీసు ఇచ్చారా? గతంలో ఏమైనా బెదిరింపులు వచ్చాయా? వీఆర్‌వోలు మీ దగ్గర డబ్బులు డిమాండ్ చేశారా? క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది వచ్చి మీ సమస్యను విన్నారా? పరిశీలించారా? ఇలా.. రెవెన్యూ అధికారులు ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించిన వారికి ఫోన్లు చేస్తున్నారు. రెవెన్యూ ఫిర్యాదులకు సంబంధించి అర్జీలు సమర్పించినవారితో జిల్లా ఉన్నతాధికారుల నుంచి అధికారుల వరకు ఫోన్లు చేసి స్వయంగా తెలుసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయటంతో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలలో ఆర్డీవోలు, తహసీల్దార్లు అర్జీదారులకు గత రెండు రోజులుగా ఫోన్లు చేస్తున్నారు. రెవెన్యూ సదస్సులలో ప్రధానంగా రీ సర్వే సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలపై ఎక్కువగా అర్జీలు రావటంతో వాటికి సంబంధించి ర్యాండమ్‌గా తమ దగ్గరకు వచ్చిన అర్జీలను తీసుకుని నేరుగా అర్జీదారులకు ఫోన్లు చేస్తున్నారు. రీసర్వే అంశాలకు సంబంధించిన అర్జీలు అయితే.. రీ సర్వేకు సంబంధించి గతంలో ముందస్తు నోటీసులు ఇచ్చారా? క్షేత్ర స్థాయిలో వచ్చి సర్వే జరిపారా? మీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నారా? వంటి ప్రశ్నలను అడిగి వారి దగ్గర నుంచి సమాచారం పొందే ప్రయత్నం చేస్తున్నారు. పాస్‌బుక్‌లకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే ఎక్కువ చెల్లించారా? ఎంత చెల్లించారు? ఎవరికి చెల్లించారు? పాస్‌బుక్‌ల జారీలో ఉద్దేశ్యపూర్వక జాప్యం చేశారా? వీఆర్వో, ఆర్ఐలు ఇబ్బంది పెట్టారా? డబ్బులు డిమాండ్ చేశారా? వంటి విషయాలపై ప్రశ్నలు సంధించారు. శుక్రవారం తహసీల్దార్లు పెద్ద సంఖ్యలో అర్జీదారులకు ఫోన్లు చేశారు. ఫోన్లు చేసే క్రమంలో తహసీల్దార్లకు సమస్యలు ఎదురయ్యాయి. తాము ఫోన్లు చేసిన వారిలో సగానికి పైగా అందుబాటులో లేరని తెలుస్తోంది. కొంతమంది వేరే వ్యక్తుల ఫోన్ నెంబర్లు ఇవ్వటంతో ఈ సమస్య ఏర్పడింది. అందుబాటులోకి వచ్చిన వారి నుంచి తహసీల్దార్లు వివరాలు నమోదు చేసుకున్నారు. వివరాల ప్రాతిపదికన ఆయా అర్జీదారుల సమస్యలను మరోమారు విశ్లేషిస్తారు. కేసు స్టడీ మాదిరిగా తీసుకోవటం వల్ల క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఆకళింపు చేసుకోవటంతో పాటు మరింత మెరుగ్గా ఆ సమస్యలను పరిష్కరించటానికి దోహదపడుతుంది. అలాగే రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు కూడా ఇదే సందర్భంలో అవకాశం కలుగుతుంది.

వేగంగా..

(5వ పేజీ తరువాయి)

తరఫున కూడా తరచూ సమీక్షించాలని నిర్ణయం తీసుకుంది. కూచిపూడి, అమరావతి డిజైన్స్, ఏపీ కల్చర్‌ను ప్రతిబింబించేలా ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ను తీర్చిదిద్దేందుకు నిర్దేశించిన ఆర్కిటెక్ట్ డిజైన్స్, ఇంటీరియర్‌ను వేరే సంస్థకు ఇచ్చి చేయించాలన్న ఆలోచన కూడా చేస్తోంది.

అతి పెద్ద పార్కింగ్ ఏరియా

విజయవాడ విమానాశ్రయంలో రన్‌వేకు అనుసంధానంగా అతి పెద్ద పార్కింగ్ బే ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని ఎయిర్ పోర్టుల కంటే ఇదే పెద్దది కావటం గమనార్హం. ఎయిర్‌క్రాఫ్ట్ పార్క్ ఏరియా (ఆప్రాన్)లో మొత్తం 24 స్టాండ్స్ ఉన్నాయి. ఒక్కసారిగా 24 విమానాలను పార్క్ చేయవచ్చు. ప్రస్తుతం ఆప్రాన్ రీ ఓరియంటేషన్ వర్క్స్ జరుగుతున్నాయి. నైట్ పార్కింగ్‌కు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు.

ఉలికి పాటు..

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 20న మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చేరాడు. జ్వరం లేకుండానే తీవ్రమైన ఒళ్లు నొప్పులు, నరాలకు సంబంధించిన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యులు బాధితుడికి రక్త పరీక్షతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో అతనికి గులియన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఆస్పత్రి సూపరింటెండెంటెంట్ ఆశాలత ఆదేశాల మేరకు బాధితుడిని ఐసీయూలో ఉంచి న్యూరో విభాగం వైద్యుడు కిరణ్ పర్యవేక్షణలో ప్రత్యేక చికిత్సను అందిస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యుడు కిరణ్ తెలిపారు. కాగా, జీబీఎస్ కేసు నమోదు కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ట జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులను అప్రమత్తం చేశారు. ఈ లక్షణాలతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించాలని, మెరుగైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. వారి వివరాలు జిల్లా కేంద్రానికి తెలియజేయాలని సూచించారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వేడుకలు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ శిష్య బృందం మా తెలుగు తల్లికి మల్లెపు దండ, తేనెల తేటల మాటలతో, చెక్కర కలిపిన తియ్యని పాటలకు నృత్యాలు చేసి అలరించారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ నరసమ్మ శిష్య బృందం చెక్కెర కలిపిన తీయని కమ్మని, తేనె వంటి భాష ఒక్క తెలుగే తెలుగే, ఏ దేశం కొన్నది ఈ గొప్పచరిత్ర, జయతి జయతి భారత మాత వంటి పాటలను మధురంగా గానం చేసింది. ప్రభుత్వ భాషా సంస్థ డైరెక్టర్ ఆర్. మల్లికార్జునరావు, ప్రసంగ ప్రజ్ఞానిధి డాక్టర్ గుమ్మా సాంబశివరావు తెలుగు భాష వైభవం గురించి ప్రసంగించారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, స్టెల్లా కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ ధూళిపాళ్ల రామకృష్ణ, ప్రాంత అధ్యాపకుడు డాక్టర్ యశోద పూర్ణచంద్, అధ్యాపకులు ఒలివేటి శివ రామకృష్ణ, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

మూడు రాజధానుల కేసులో కోర్టుకు రావి హాజరు

గుడివాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానులు వద్దు - అమరావతి ముద్దు అనే ఆందోళనలో పాల్గొన్న అప్పటి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు సహా పలువురు టీడీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుడివాడ, గుడ్లవల్లేరు టీడీపీ నాయకులు శుక్రవారం గుడివాడలోని ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు హాజరయ్యారు.

ఉత్సాహంగా ఆట, పాట, మాట

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీనగరంలోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా' జానపదం పేరిట ఆట-పాట-మాట కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయనీ గాయకులు తెలుగుభాషపై పాటలు మధురంగా ఆలపించి ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు తెలుగుభాష ఉద్ధరణకు తల్లిదండ్రులు తమ వంతు బాధ్యత వహించాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని రంగం రాష్ట్ర కార్యదర్శి ఆర్.రాజేష్ నిర్వహించారు. ముందుగా గొట్టుముక్కల రఘురామరాజుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అనంతరం అతిథులతోపాటు కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.



గొట్టుముక్కల రఘురామరాజును సత్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, కొలనుకొండ శివాజీ తదితరులు

విజయవాడ తూర్పు



నేటి నుంచి ఉచిత పుస్తకాల పంపిణీ



పటమట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్ సమీపంలోని శ్రీ సర్వోత్తమ గ్రంథాలయంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ సంఘం, సర్వోత్తమ గ్రంథాలయం సంయుక్తంగా 9వ ఉచిత పుస్తక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి రావి శారద తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా పూర్వ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 22, 23న సుమారు 25 వేల పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

ఎన్ఐడీఎం బృందం వీఆర్ సిద్ధార్థ సందర్శన

పెనమలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రిత్వ శాఖలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐడీఎం)ప్రొఫెసర్ల బృందం 5 రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం స్థానిక వీఆర్ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌ను సందర్శించింది. బృందం ఇటీవల విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాలుపంచుకున్న కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో సంభాషించింది. వలంటీర్లు ఆహార ప్యాకింగ్, పాత బట్టల సేకరణ, లిటిల్ హ్యాండ్స్ ఫౌండేషన్‌తో కలిసి పంపిణీ చేయడం, వరదల ప్రభావాన్ని అంచనా వేయ డానికి సర్వేలు చేయడం సహా తమ కార్యక్రమాలను ప్రదర్శించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విపత్తు నిర్వహణ పట్ల విశేష నిబద్ధత, అంకితభావాన్ని కనబరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో కల్నల్ పీఎస్ రెడ్డి, డాక్టర్ రాకా, డాక్టర్ బాలు, బీ శ్రీనివాస్, వలంటీర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



గుణదల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ముందుగా రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టిందని 26వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్ తెలిపారు. స్థానిక 26వ డివిజన్ పరిధిలోని మాచవరంలోని కుటుంబరావు వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నదీ లేనిది శుక్రవారం ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, నాయకులు కారంపూడి సత్య, కడియం ప్రకాష్, విజ్జి శశి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ప్రసాదంపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ సెక్షన్ కరణంగారి బజార్ 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ రోడ్డు, జ్యోతి విద్యాలయం రోడ్డు, యాదవుల బజార్, కరణంగారి బజార్, కిలారు వారి వీధి, దానయ్య బజార్, అచ్చమ్మ వీధి, న్యూ పోస్టల్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు ఆటోనగర్ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మాతృభాషలో పరభాషా పదాలు వాడొద్దు



మాట్లాడుతున్న రచయిత్రి కె.సత్యవతి, లయోలాలో మాట్లాడుతున్న ఫాదర్, విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న బీవీఎస్ ప్రకాష్, ప్రిన్సిపాల్ మేకా రమేష్ తదితరులు

రచయిత్రి కె.సత్యవతి

మొగల్రాజపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నేటి తరానికి మాతృభాష పరభాష మధ్య తేడా తెలియడం లేదని, మాతృభాషలో పరభాషా పదాలు కలిపి వాడేస్తున్నారని పటమటలంక జిల్లా పరిషత్ పాఠశాల మాజీ హెచ్ఎం, రచయిత్రి కె.సత్యవతి ఆవేదన వ్యక్తం చేశారు. మొగల్రాజపురం జనశిక్షణా సంస్థాన్‌లో శుక్రవారం మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అవసరం, ఉపాధి రీత్యా మాతృభాషతో పాటు మరికొన్ని ఇతర భాషలు కూడా నేర్చుకుంటున్న ఈ రోజుల్లో అచ్చతెలుగు మాట్లాడటం లేదనే విషయం గుర్తించడం లేద న్నారు. తెలుగులో ఇతర భాషల పదాలు వాడటం మానేయాలని చెప్పారు. అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషను కాపాడుకోవాలని, అందుకు ప్రభు త్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మానికి సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ అధ్యక్షత వహిం చారు. సిబ్బంది, శిక్షకులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

మాతృభాష తల్లి వంటిది

భారతీనగర్: ఆంధ్ర లయోలా కళాశాలలో ప్రాచ్యభాషా పరిషత్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల పూర్వ ఆచార్యులు కె.జోబ్ సుదర్శన్ మాట్లాడుతూ మాతృభాష తల్లి వంటిదని, మాతృభాషను మరిచిపోతే తల్లిని మరిచిపోయినట్లేనని అన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, భాషా సేవకులు, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు ఆచార్య జి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాష మధురమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ డాక్టర్ పి.ఆర్.జాన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్.కే.ఎం.ప్రభుదాస్, ప్రాచ్యభాషా శాఖాధిపతి డాక్టర్ కె.శేఖర్, కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగు శాఖ సీనియర్ అధ్యాపకుడు ఆచార్య ఆర్.రవీంద్రభాస్, అధ్యాపకుడు డాక్టర్ డి.కృపారావు, సంస్కృత అధ్యాపకుడు బి.వెంకటేశ్వరరావు, హిందీ అధ్యాపకుడు స్నేహ విమల్ శుక్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థలో..

విజయవాడ కల్చరల్: తల్లిదండ్రులను, గురువులను గౌరవించడంతో పాటు ప్రతి ఒక్కరూ మాతృభాషను కూడా గౌరవించాలని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అన్నారు. శుక్రవారం ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం నేతృత్వంలో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల తెలుగు శాఖలు సంయుక్తంగా నిర్వహించిన తెలుగుభాషా పోటీల్లో విజేతలకు ఆయనతో పాటు కళాపీఠం కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్ బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలు విశ్రాంత ఉప ప్రాచార్యులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బాలకృష్ణ, ఉపాధ్యాయులు సీతామహాలక్ష్మి, శివరామకృష్ణమూర్తి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎన్.శివకుమార్, డాక్టర్ పి.నీరజ, గోవా శేషారత్నం, డాక్టర్ సశ్రీ పాల్గొన్నారు.



ఎస్ఆర్ఆర్ కళాశాల ఎదురు రోడ్డులో, యారంవారి వీధిలో, బెత్లెహేమ్‌నగర్ చిన్న చర్చి పక్క వీధిలో, గుణదల లూర్దుమాత వద్దపాటి డేవిడ్ రాజు ఇంటి వద్ద, గుణదల క్రైస్తవుల సమాధుల వెనుక వీధిలో నిరుపయోగంగా ఉన్న బోరు పంపులు

పనిచేయని చేతి పంపులు

- నీటి కోసం కొండ ప్రాంతవాసుల ఇక్కట్లు

(ప్రభుత్వాసుపత్రి, ఆంధ్రజ్యోతి) నగరాభివృద్ధిలో భాగంగా కార్పొరేషన్ అధికారులు గుణదల, మాచవరం పరిసర ప్రాంతాల్లోని కొండవాసుల నీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. వేసవి సమీపిస్తున్న తరుణంలో వాటి అవసరం ఎంతైనా ఉంటుందని ప్రజలంటున్నారు. బోర్లకు మరమ్మతులు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వాటిని బాగు చేయడం లేదని కొండ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు పని చేయకుంటే తమకు నీటి ఇబ్బంది అధికంగా ఉంటుందంటున్నారు. వేసవిలో మంచినీరు రాకపోయినా బోరు నీటిని పట్టుకుంటామని, ఇప్పుడు అవి కూడా పని చేయడం లేదని తక్షణం అధికారులు స్పందించి బోర్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

రాజాను గెలిపించుకుందాం: ఎమ్మెల్యే గద్దె

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదిగా, విద్యావేత్తగా, మాజీమంత్రిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని ఆయనను గౌరవించుకుందామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం పటమట గోవిందరాజుల మున్సిపల్ హైస్కూల్లో, చైత్ర స్కూల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె స్వయంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈనెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, అడపా నాగేంద్ర, నర్రా కిషోర్, యడ్లపల్లి నాగరాజు, గరికపాటి బద్రీ, డాంగే కుమారి, కర్ణ కోటేశ్వరరావు, అన్నాబత్తిన బాబి, పాల్గొన్నారు.



గోవిందరాజులు స్కూల్లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉమ్మడి కృష్ణా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తదితరులు

పట్టభద్రులూ... ఆలపాటికి ఓటేయండి : గద్దె అనురాధ

మొగల్రాజపురం: ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ విజ్ఞప్తి చేశారు. మొగల్రాజపురం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయులను కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.సునీత, టీడీపీ బీసీ నాయకులు పేరేపి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పారా అథ్లెటిక్స్‌లో రాష్ట్ర క్రీడాకారులకు 15 పతకాలు

విజయవాడ(స్పోర్ట్స్)ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 17నుంచి 20 వరకు జరిగిన 23వ జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025లో రాష్ట్ర క్రీడాకారులు పలు విభాగాల్లో విజయాలు సాధించి 15 పతకాలు సాధించారు. వీటిలో 6 బంగారు పతకాలు, 3 రజిత, 6 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాలు సాధించిన క్రీడాకారులను శాప్ చైర్మన్ రవినాయుడు, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీష, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావులు అభినందించారు.

'సంగీత ప్రభంజనం ఏఆర్ రెహమాన్' పుస్తక సమీక్ష

భారతీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలలో పుస్తక సమీక్ష సంఘం ఆధ్వర్యంలో లైబ్రరీ హాల్లో కామనీ మత్తుయ్ రచించిన సంగీత ప్రభంజనం ఏఆర్ రెహమాన్ అనే పుస్తక సమీక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జేపీఏ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ రెహమాన్ తన చిన్నతనంలోనే సంగీత ప్రయాణాన్ని ప్రారంభించారని అన్నారు. రోజా సినిమాకు సంగీతం అందించినందుకు ఆస్కార్ అవార్డు దక్కించుకున్నారని అన్నారు. ప్రతి విద్యార్థి తమలోని ప్రతిభను ప్రదర్శిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలు సాధించవచ్చు అని అన్నారు. లైబ్రేరియన్ డాక్టర్ జి.ఎల్.ప్రసాద్‌రావు మాట్లాడుతూ పుస్తక సమీక్ష కార్యక్రమం విద్యార్థులకు ఉన్నత విలువలు తెలియజేయడంతో పాటు వారి మానసిక వికాసానికి తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్తుయ్ రచించిన సంగీత ప్రభంజనం ఏఆర్ రెహమాన్ అనే పుస్తకాన్ని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి జీఎల్ఎంఆర్ భాస్కర్ పుస్తక సమీక్ష చేస్తూ ఈ పుస్తకంలోని ఐదు ప్రధాన సంఘటనలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ ప్రవీణ్, లైబ్రేరియన్ టి. రోజామణి, చంద్ర కావ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

వన్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ లోడ్ లారీ ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం కృష్ణలంక ఎం హోటల్ వద్ద జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంక రాణిగారితోటలో ఉంటున్న షేక్ ఆషాబీ (70) ఆకుకూరలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. శుక్రవారం ఉదయం కృష్ణలంక ఎం హోటల్ సమీ పంలో ఆమె నిలబడి ఉండగా వేగంగా వచ్చిన గ్యాస్ సిలిండర్‌లోడు లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆషాబీ అక్కడి కక్కడే మృతి చెందింది. పోలీసులు మృత దేహాన్ని పరిశీలించి ఆమె వద్ద లభించిన గుర్తింపు ఆధారాల ద్వారా కుటుంబ సభ్యులకు సమా చారం తెలియపరిచారు. అనంతరం మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ పాత ఆసుపత్రిలో టిఫా స్కాన్ పరికరం ప్రారంభం



టిఫా స్కాన్ పరికరాన్ని ప్రారంభించిన వైద్యులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాత ఆసుపత్రిలో మాతా శిశు సంరక్షణ విభాగంలో తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ నిమిత్తం గర్భిణులకు పరీక్షలు నిర్వహించేందుకు టిఫా స్కాన్ పరికరాన్ని ప్రారంభించారు. రూ.32.6లక్షల వ్యయం చేసే ఈ పరికరాలను రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమం, వైద్య, విద్య శాఖ సమకూర్చింది. టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫీటల్ ఎనామిలీస్ (టిఫా) స్కానింగ్ సదుపాయాలను రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ రఘునందన్, డాక్టర్ డి. వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రధాన బోధన ఆసుపత్రులలో ఈ స్కానింగ్ పరికరాలను ఏర్పాటు చేసిందన్నారు. స్కానింగ్‌కు సుమారు రూ.2,500 నుంచి 3 వేల వరకు వ్యయం అవుతుందని, పుట్టుకతో వచ్చే లోపాలను ఈస్కానింగ్ ద్వారా గుర్తించవచ్చునని తెలిపారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ పార్వతీశం, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కేశవచంద్ర, చిన్నపిల్లల విభాగాధిపతి పి.అనిల్ కుమార్, మానసిక చికిత్సా విభాగం అధిపతి రాఘవరావు, ప్రొఫెసర్ హిమబిందు, ఆసుపత్రి డీసీఎస్ఆర్ఎంవో యు.శోభ, శ్రీనివాసరాజు, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాగార్జున కొండకు ఎస్ఆర్ఆర్ విద్యార్థులు

గుణదల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లోని నాగార్జున కొండకు ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థులు స్టడీ టూర్‌కు వెళ్లారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. కళాశాల రాజనీతి శాస్త్రం, చరిత్రశాఖ సంయుక్తంగా నాగార్జు కొండకు వెళ్లి చరిత్రను తెలుసుకున్నారని చెప్పారు. చారిత్రాత్మక ప్రదేశలను సందర్శించడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను సందర్శించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలసుబ్రహ్మణ్యం, కొల్లేటి రమేష్, పద్మనాభం, అజయ్‌బాబు, సుకుమార్, దాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నాగార్జున కొండకు వెళ్లిన ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థులు

దేవినేని వెంకటరమణ, ప్రణీత క్రికెట్‌లో వెల్‌కమ్ సీసీ గెలుపు

విజయవాడ(స్పోర్ట్స్),ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో శుక్రవారం వెల్‌కమ్ సీసీ, రాయల్ సీసీ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన వెల్‌కమ్ సీసీ జట్టు 46.3ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 226పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రాయల్ సీసీ జట్టు 44.4ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 212పరుగులతో ఓటమి పాలైంది. వెల్‌కమ్ జట్టు బౌలర్ ఎస్.రాజేష్ 4వికెట్లు తీశాడు.

దీప్లానగర్‌లో కోళ్లు చనిపోయింది బర్డ్ ఫ్లూతోనే

- పశువైద్యాధికారి భరత్


ఫారంలో కోళ్లు తొలగించిన ప్రత్యేక సిబ్బంది

ఎ.కొండూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామ శివారు దీప్లానగర్‌లోని హనుమాన్ పౌల్ట్రీ ఫారంలో కోళ్లు చనిపోవడానికి బర్డ్ ఫ్లూనే కారణమని కంభంపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ భరత్ తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక సిబ్బంది కోళ్ల ఫారంలోని మిగిలిన కోళ్లు, మేత, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఫారానికి 500 మీటర్ల వర కు నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. ప్రజలు ఈ ప్రాంతానికి రావొద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మూడు రోజుల తర్వాత ఈ ప్రాం తమంతా స్ప్రేయింగ్ చేస్తామని తెలిపారు. మరో మూడు నెలల వరకు ఫారంలో కోళ్లు పెంచవద్దని యాజమానికి ఆదేశాలు జారీ చేశారు.

సంక్షేమ పథకాల అమలుపై న్యాయమూర్తుల వ్యాఖ్యలు దురదృష్టకరం

- తక్షణమే ఉపసంహరించుకోవాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గాంధీనగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉచితాలు అనుచితం, సబ్సిడీలు, సంక్షేమ పథకాలతో వ్యవసాయ కార్మికులు సోమరిపోతుల్లా మారుతున్నారని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని, వాటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు రుణమాఫీ చేసిన లక్షల కోట్లు వారి నుంచి రాబట్టేలా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులను వారు కోరారు. దేశ ప్రజలకు అన్నం పెట్టే శ్రమజీవులను సోమరిపోతులు అనడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలను గుప్పెట్లో పెట్టుకుని లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయించుకున్న కార్పొరేట్లు, పెట్టుడిదారుల జోలికి వెళ్లకుండా పేదలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను, ఉపాధిహామీ చట్టాన్ని రద్దు చేయాలని అనడం బాధ్యతారాహిత్యమన్నారు. 'పేదరికం నిర్మూలించే వరకు సంక్షేమం, సబ్సిడీల బాధ్యత పాలకులదే' అనే అంశంపై ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల(బీకేఎంయూ, ఏఐఏడబ్ల్యూయూ) ఆధ్వర్యం లో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడారు. రైతులు, కార్మికుల వల్లనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకానికి కేటాయించింది రూ.86 వేల కోట్లయితే కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేస్తున్నారని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధ్యతాయుత స్థానంలోని న్యాయమూర్తులు శ్రామికులను అగౌరపరచేలా వ్యాఖ్యానించడం దురదృష్టకరమన్నారు. వీరి వ్యాఖ్యలు రాజ్యాంగ మౌలి క సూత్రాలకు తిలోదకాలు ఇచ్చేలా ఉన్నాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ పేదల పట్ల న్యాయమూర్తుల వ్యాఖ్యలు సరికాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు బి.వెంకటేశ్వర్లు, ఆవుల శేఖర్, దడాల సుబ్బారావు, కోటేశ్వరరావు, సీపీఐ, సీపీఎం నేతలు అక్కినేని వనజ, రమాదేవి పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురండి

- అన్ని రాష్ట్రాల్లో ఒకే ధర ఉండేలా చూడండి
- కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్‌కు ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):


హర్దీప్‌సింగ్‌కు రవాణా సమస్యలను వివరిస్తున్న ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల రవాణా రంగం మనుగడ సాగించలేని పరిస్థితి ఏర్పడిందని రవాణా రంగాన్ని ఆదుకోవాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరికి ఏపీ లారీ యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో కేంద్ర బడ్జెట్‌పై ఏర్పాటు చేసిన సమీక్షలో రవాణా రంగ సమస్యలను ఈశ్వరరావు వివరించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఏకరూపత సాధించడానికి వీటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని అభ్యర్థించారు. అన్ని రాష్ట్రాల్లోనూ పెట్రోల్, డీజిల్ ధరలు ఒకేలా ఉండేలా ఒక విధానా న్ని అమలు చేయాలని కోరారు. రవాణా రంగంపై విధిస్తున్న టోల్ చార్జీ లు మోయలేని భారంగా ఉందని, ఏటా 5 నుంచి 7 శాతం వరకు పెర గడం వల్ల వాహన యజమానులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. టోల్ చార్జీలను సరళీకృతం చేయాలని, వాణిజ్య రవాణా వాహనాలకు కూడా వన్‌టైమ్ టోల్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రవాణా శాఖలో ఏర్పాటు చేస్తున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను పూర్తి గా రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణలోనే నిర్వహించాలని అభ్యర్థించారు. వీటి నిర్వహణలో ప్రైవేటు సంస్థల ప్రమేయం కారణంగా ప్రభుత్వ లక్ష్యాలకు ఆటంకం కలుగుతోందని, పర్యవేక్షణ లోపించటంతో పాటు అవినీతిని ప్రోత్సహిస్తున్నట్టు అవుతుందని తెలిపారు. కేంద్రం తక్షణం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాహనాల వయస్సు ఆధారంగా ఫిట్‌నెస్ చార్జీలను నిర్ణయించేలా ప్రస్తుతం అమలు చేస్తున్న విధానం అన్యాయమైందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వాహనాలకు సమానంగా వర్తించే ప్రామాణిక ఫిట్‌నెస్ చార్జ్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వాహన్ పోర్టల్‌లో సమస్యలను పరిష్కరించడానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.


గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో ఫ్రీగా చికెన్ బిర్యానీ తినేందుకు భారీగా తరలివచ్చిన జనం

భయాన్ని పక్కనబెట్టి.. కోడి కూర ఆరగించి..

నోరూరించే కోడి కూర.. వేడి వేడి బిర్యానీ కళ్ల ముందు కనిపిస్తుంటే.. అదికూడా ఫ్రీగా పెడుతుంటే ఎవరు మాత్రం ఆగుతారు..! బర్డ్ ఫ్లూ కారణంగా కొన్ని రోజులుగా చికెన్‌కు దూరంగా ఉన్న వారంతా ఆ భయాన్నంతా పక్కనబెట్టి కడుపునిండా కోడి పలావ్ ఆరగించారు. బర్డ్ ఫ్లూపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరులోని పట్టాభిపు రం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళా ఏర్పాటు చేసింది. ఫ్రీగా చికెన్ బిర్యానీ పెట్టడంతో నగరం నలుమూల ల నుంచి వేలాదిమంది తరలి వచ్చారు. దీంతో ఆ ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. **- గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి**

టమాటా కేజీ రూ. 4

- అమాంతం పడిపోయిన ధర
- కోత ఖర్చులైనా రావట్లేదని రైతుల విలవిల
- కోయకుండా తోటలు వదిలేస్తున్న వైనం

వేసవి ప్రారంభానికి ముందే టమాటా ధర అమాంతం పడిపోయింది. రైతుకు కిలో రూ.4 పలుకుతోంది. దీంతో రైతులు పంట కోయకుండానే తోటలను వదిలేస్తున్నారు. కొందరు దున్నేస్తున్నారు. కోత ఖర్చులు వచ్చే పరిస్థితి లేదని, అందుకే తోటలను వదిలేస్తున్నామని చెబుతున్నారు.


గడ్డమణుగు గ్రామంలో గంపా శ్రీనివాసరావు పొలంలో కోయకుండా వదిలేసిన టమాటా తోట

(జి.కొండూరు-ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 216 ఎకరాల్లో టమాటా సాగులో ఉంది. ఖరీఫ్‌లో వేసిన పంట చివరి కోత దశలో ఉంది. రబీలో సాగు చేసిన తోటల్లో మరో రెండు వారాల్లో కోతకు వచ్చే అవకాశం ఉంది. మైలవరం నియోజకవర్గంలో జి.కొండూరు మండలం గడ్డమణుగు, చెర్వుమాధవరం, గంగినేనిపాలెం, జి.కొండూరు, గుర్రాజుపాలెం గ్రామాల్లో ఖరీఫ్, రబీ కలిపి 31 ఎకరాల్లో, ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి, మూలపాడు, దాములూరు గ్రామాల్లో 11 ఎకరాలు, గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, మైలవరం, జగ్గయ్యపేట మండలంలో చెదురుమదురుగా అన్నదాతలు టమాటాను సాగు చేస్తున్నారు. పంట కోసి విక్రయానికి తీసుకెళ్తే కేజీ రూ.4 పలుకుతోందని, ప్రభుత్వం నుంచి వస్తున్న విత్తన రాయితీతో పాటు మరిన్ని రాయితీలు వస్తేనే సాగు చేయగలమని రైతులు చెబుతున్నారు.

టమాటా రైతులకు పలు రాయితీలు ఉన్నాయి

టమాటా సాగుచేసే రైతుకు హెక్టారుకు రూ.3 వేలు విత్తన సబ్సిడీ వస్తోంది. ట్రెల్లీస్ పద్ధతిలో సాగు చేసుకుంటే ఎకరానికి రూ.18,500 రాయితీ వస్తుంది. మల్చింగ్‌కు రాయితీ వస్తుంది. నేల మీద పండే పంటకు ట్రెల్లీస్‌లో పండించే పంటకు నాణ్యత విషయంలో తేడా ఉంటుంది. నాణ్యమైన కాయలకే మంచి డిమాండ్ ఉంటుంది.
-నీలిమ, హెచ్‌వో

మార్కెట్‌లో మదనపల్లి ముందు నిలబడలేక..

మార్కెట్ హెచ్చుతగ్గులు, పోటీతత్వం కారణంగా ఈప్రాంతలో రైతులు పండించే టమాటాలు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర పలకడం లేదు. దీంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. నాణ్యతలో చిత్తూరు, మదనపల్లి టమాటాల ముందు నిలబడలేకపోతున్నాయి. అక్కడి రైతులు ట్రెల్లీస్ సాగు ద్వారా కాయలను నాణ్యంగా పండిస్తున్నారు. తీగను కిందకు పాకకుండా, నేలపై కాయలు వాలకుండా సాగు చేస్తారు. దడి సాగు(ట్రెల్లీస్)లో కర్రలు పాతి ఐరెన్ ఫెన్సింగ్ తీగ కట్టి చెట్లను వాటికి పాకిస్తారు. దీంతో టమాటాలు నాణ్యంగా ఉంటున్నాయి. ఈప్రాంతంలోనూ ఇలా సాగు చేస్తే మార్కెట్ పోటీని తట్టుకుంటారని ఉద్యాన అధికారులు చెబుతున్నారు.

కోత ఖర్చులు రావడం లేదు



ధర కేజీ రూ.4 పలకడంతో కోత ఖర్చులు కూడా రావడం లేదు. 27 కిలోల ట్రే కోయించేందుకు రూ.40 ఖర్చవుతోంది. రవాణా తదితర ఖర్చులు కలిపితే నష్టమే వస్తోంది. అందుకే తోటలను వదిలేశాం. మరి కొందరు దున్నేస్తున్నారు.
-నూతక్కి నాగేశ్వరరావు, రైతు, గడ్డమణుగు

రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి



టమాటా సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు పెంచాలి. పంట సాగు చేసే వారికి నష్టాలు తప్ప లాభాలు రావడం లేదు. మార్కెట్ సౌకర్యం కూడా తక్కువగా ఉంది. రైతు బజారుకు తీసుకెళ్లి అమ్ముకునే పరిస్థితి లేదు. జి.కొండూరులో రైతు బజారు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు చేకూరుతుంది.
- పాతూరి ఐమోహన్‌రావు, రైతు, గడ్డమణుగు

జగన్ ఐ ప్యాక్ డ్రామాలు

ప్రజలు నమ్మరు

- ప్రజలు దుస్తులూడదీసి ఆయనను ఇంట్లో కూర్చోబెట్టారు
- తప్పులు ప్రశ్నిస్తారనే అసెంబ్లీకి రావడం మానేశారు: మంత్రి కొల్లు రవీంద్ర

గుడివాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'మాజీ ముఖ్యమంత్రి జగన్ ఐ ప్యాక్ డ్రామాలు ప్రజలు నమ్మరు. ఇప్పటికే ప్రజలు దుస్తులూడదీసి ఆయనను ఇంట్లో కూర్చోబెట్టారు. అధికారంలో ఉండగా చేసిన తప్పులను ప్రశ్నిస్తారనే భయంతో జగన్ అసెంబ్లీకి రావడం లేదు. పోలీసులను బెదిరించి నీచ రాజకీయాలకు తెరలేపారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దళితుడిని కిడ్నాప్ చేస్తే కేసులు పెట్టరా?' అని మంత్రి కొల్లు రవీంద్ర అని ప్రశ్నించారు. శుక్రవారం ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారన్నారు. ఎన్నికల కోడ్ ఉందని అధికారులు చెప్పినా జగన్ తన రాజకీయ స్వార్థానికి మిర్చి యార్డుకు వెళ్లారని అన్నారు. మాజీ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలను పట్టించుకోవలసిన అవసరం లేదన్నారు. బూతులు మాట్లాడానికైతే నానీకి ఉద్యోగం అవసరమని, ప్రజాసేవ చేయడానికి అవసరం లేదని అని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా తాము ప్రజలకు జవాబుదారీగానే పని చేస్తున్నామని స్పష్టం చేశారు. అవినీతి, అరాచకాలు, విధ్వంసంతో నాశనమైన జిల్లా ఖ్యాతిని తిరిగి తీసుకొచ్చేందుకు తామంతా కష్టపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జనసేన జిల్లా కన్వీనర్ బండి రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సహజ నిక్షేపాలు కొల్లగొడుతున్నాయ్

- రోడ్లు, భూగర్భ జలాలు నాశనం చేస్తున్నాయ్
- గ్రామాలు అభివృద్ధి చేస్తామని అబద్ధపు హామీలిచ్చాయ్
- ఓఎన్జీసీ, మేఘా సంస్థలపై భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామస్థుల ఆగ్రహం


తహసీల్దార్ హరనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామస్థులు

నాగాయలంక, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'నంగేగడ్డ రెవెన్యూ పరిధిలోని వక్కపట్లవారిపాలెం గ్రామంలోని ఓఎన్జీసీ, మేఘా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్ వద్ద ఆయిల్ నిక్షేపాల వెలికితీస్తున్నారు. ఏడేళ్ల క్రితం డ్రిల్లింగ్‌కు ముందు ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పిస్తామని, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఆ సంస్థలు అబద్ధపు హామీలు ఇచ్చాయి. ఇప్పుడు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆయిల్, గ్యాస్‌వంటి సహజ నిక్షేపాలను కొల్లగొట్టుకుపోతున్నాయి. రోడ్లను, భూగర్భ జలాలను నాశనం చేస్తున్నాయి.' అని భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్ నుంచి ముడిచమురును తీసుకెళ్లే భారీ వాహనాలు, ప్లాంట్ వద్ద వినియోగించే భారీ యంత్రాలు వల్ల స్థానిక రోడ్లు అధ్వానంగా మారాయని రెండు గ్రామాల ప్రజలు శుక్రవారం తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు డ్రిల్లింగ్ పాయింట్ వద్ద ఆందోళనలు చేయగా సంస్థ యాజమాన్యాలు వక్కపట్లవారిపాలెం నుంచి భావదేవరపల్లి మధ్య ఉన్న ప్రధాన రహదారి నిర్మాణానికి శిలాఫలకాలు వేశాయి, కానీ అభివృద్ధి చేయలేదని వారు పేర్కొన్నారు. రహదారి మార్గం సరిగా లేకపోవటంతో గర్భిణులను ఆస్పత్రికి తరలించే సమయంలో పరిస్థితి విషమించి రెండు నిండు ప్రాణాలు కోల్పోయాయని గ్రామస్థులు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయిల్ డ్రిల్లింగ్ కారణంగా భూగర్భ జలాలు కలుషితమై చుట్టుపక్కల గ్రామాల్లో అనేక మంది క్యాన్సర్ బారిన పడి మృత్యువాత పడుతున్నారని, అయినా పట్టించుకోవటం లేదని తెలిపారు. ఏడేళ్లలో ఒక్కసారి కూడా చుట్టుపక్కల హెల్త్ క్యాంపులు నిర్వహించిన పాపాన పోలేదన్నారు. ఓఎన్జీసీ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయకపోతే గ్రామస్థులతో కలిసి భారీ ఆందోళన చేస్తామని భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామస్థులు హెచ్చరించారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించుకుంటున్నాం


రహదారి మరమ్మతులు చేస్తున్న యంత్రం

సంక్రాంతి సమయానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి రాష్ట్రంలో గుంతలరోడ్లు కనిపించకుండా తాత్కాలిక మరమ్మతులు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఏ మార్పు జరగలేదని గ్రామస్థులు తెలిపారు. శిలాఫలకాలు వేసి రోడ్లు నిర్మాణం చేస్తామని ఆయిల్, గ్యాస్ వెలికితీతల సంస్థ వాగ్దానాలు ప్రకటనలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. అందుకే గ్రామస్థులే చొరవ తీసుకుని పలువురి ఆర్థిక సహకారంతో రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయించుకుంటున్నామని వారు తెలిపారు.

వాతావరణ మార్పు సమస్యలకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కారం

- ప్రకృతి వ్యవసాయం బలోపేతానికి మద్దతిస్తాం
- పెగాసిస్ సంస్థ హామీ


కానుమోలులో 365డేస్ కిచెన్ గార్డెన్ నిర్వహిస్తున్న అనురాధతో మాట్లాడుతున్న పెగాసిస్ ప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపునకు మళ్లేందుకు ఏపీసీఎన్‌ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) అందిస్తున్న సహకారం అభినందనీయమని, వాతావరణ మార్పులకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కార మార్గమని పెగాసిస్ కాపిటల్ అడ్వైజర్ జనా మెకార్తీ, సీఈవో క్రెయిగ్ కోగట్ అన్నారు. కానుమోలు, కాకులపాడులో ఏపీసీఎన్‌ఎఫ్, ఆర్‌వైఎస్ఎస్(రైతు సాధికార సంస్థ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమెరికాకు చెందిన పెగాసిస్ కాపిటల్ సంస్థ బృంద సభ్యులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫుడ్ బాస్కట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కానుమోలులో అనురాధ నిర్వహిస్తున్న 365డేస్ కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించారు. అవలంబించే విధానాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. ఆహారభద్రత పెంపొందించేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా నిర్వహిస్తున్న ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కాకులపాడులో పద్మరాగం నిర్వహిస్తున్న ఏ గ్రేడ్ ప్రకృతి వ్యవసాయ మోడల్‌ను, చింతయ్య నిర్వహిస్తున్న రసాయనిక వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. వినూత్న విధానాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. గ్రామీణుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ, ఆరోగ్య ఖర్చులను ఆదా చేసేలా మహిళా స్వయం సహాయక సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని వైట్‌హౌస్ మాజీ నేషనల్ క్లైమేట్ అడ్వైజర్ జినా మెకార్తీ కొనియాడారు. ప్రజలకు రసాయన రహిత ఆహారాన్ని అందించేందుకు ప్రకృతి వ్యవసాయంలో స్థిరమైన పెట్టుబడులకు అవకాశాలు కలించడానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రైతు సాధికారత సంస్థ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ పార్థసారథి, అరుణ, విషి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పద్మావతి పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యం

- పట్టపగలే మూడిళ్లలోకి ప్రవేశించిన దొంగలు.. బంగారం, నగదు అపహరణ

నందిగామ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్‌లో శుక్రవారం మధ్యాహ్నం తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లలోకి దొంగలు చొరబడ్డారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని పట్టపగలే దోపిడీకి తెగబడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నెహ్రూనగర్‌లోని బీసీ హాస్టళ్ల సమీపంలో ఉంటున్న ఇసుక మునిరెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా షాపు వద్దకు వెళ్లారు. తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడిన దొంగలు రూ.మూడు లక్షల విలువైన బంగారు నగలు, రూ.ముప్పై వేల నగదు అపహరించారు. అదే వీధిలో ఉంటున్న ఉపాధ్యాయుడు కొణకాల బాలశౌరి ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు 18 గ్రాముల బంగారం అపహరించారు. పక్కనే ఉన్న లారీ డ్రైవర్ కూనపనేని శ్రీనివాసరావు ఇంట్లోకి కూడా చొరబడిన దొంగలు బీరువా తాళాలు పగులగొట్టారు. ఆ ఇంట్లో ఏమీ చోరీ చేయలేదు. సీఐ వైవి లచ్చునాయుడు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

- పోలీసు, రవాణా అధికారులతో కృష్ణా కలెక్టర్ బాలాజీ


మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో రహదారుల వెంబడి ప్రమాదాలు జరగకుండా పోలీస్, రవాణా శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ సూచించారు. జిల్లా రహదారి భద్రతాకమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ చాంబరులో నిర్వహించారు. ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటుబెల్టు ధరిస్తే ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణనష్టం తక్కువగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. ఈ ఏడాది జనవరిలో జిల్లాలో 90రోడ్డు ప్రమాదాలు జరిగాయని, 41 మరణాలు సంభవించాయని, 76మంది గాయపడ్డారని తెలిపారు. ఈ లెక్కలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయన్నారు. జాతీయ రహదారులపై వాహనాల వేగాన్ని కనిపెట్టేందుకు అధునాతన సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అతివేగంతో వాహనాలు నడిపేవారిని గుర్తించి జరిమానాలు భారీగా విధించాలన్నారు. మచిలీపట్నం మండలం ఎస్ఎన్ గొల్లపాలెం వద్ద జాతీయరహదారి నుంచి విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మచిలీపట్నం నగరంలో వివిధ వేడుకల సమయంలో ఫ్లెక్సీలు భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నారని, కార్యక్రమాలు ముగిసిన వెంటనే ఫ్లెక్సీలను తొలగించాలని మునిసిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మచిలీపట్నం నగరంలో రహదారుల వెంబడి పశువుల సంచారం అధికంగా ఉందని, వాటి కొమ్ములకు రేడియం పెయింట్ వేయించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం మూడురోజుల ముచ్చటగా కాకుండా నిత్యం వాడేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లా రవాణాశాఖ అధికారి బీఎస్ఎస్ నాయక్, ఎంవీఐ ఎల్.సిద్ధిక్, మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ, ఆర్‌అండ్‌బీ విభాగం ఈఈ లోకేష్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ధనుంజయుడి విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రతిష్ఠించాలి

గాంధీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు శాసన కర్త రేనాటి చోళరాజు ఎరి(కల్) ముత్తురాజు ధనంజయుడి విగ్రహాన్ని శాసన సభ ప్రాంగణంలో ప్రతిష్ఠించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. క్రీ.శ 575 సంవత్సరంలోనే తెలుగు భాషను రాజభాషగా చేసి తొలి తెలుగు శాసనాన్ని ఆయన చెక్కించారని పేర్కొన్నారు. తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. తొలుత ధనుంజయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రీ.శ 6 నుంచి 10వ శతాబ్దం వరకు తెలుగు భాషను రాజభాషగా కొనసాగించి తెలుగును ధనుంజయుడు అభివృద్ధి చేశారని సంఘం అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి తెలిపారు. ఆయనకు భారతరత్న ప్రకటించాలన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలుగు పుట్టుక- వ్యాప్తి గురించి ఏప్రిల్ 20న హైదరాబాద్‌లో మహాసభ నిర్వహిస్తున్నట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీఎల్ఎన్.రాజు తెలిపారు. సీనియర్ జర్నలిస్టు చలపతిరావు, సంస్కార భారతీ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత, దర్శకుడు, 14 నంది అవార్డుల గ్రహీత డాక్టర్ పీవీఎస్.కృష్ణను ఘనంగా సత్కరించారు. డాక్టర్ వెలగ జోషి, గోళ్ల నారాయణరావు, జీఆర్‌కే, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కె.జయరాజ్, చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాతృభాషా సేవకులకు సత్కారం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగు కోసం వివిధ రంగాలలో సేవలందించిన తెలుగు కళావాహిని, జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, బండారు నరసింహారావు, డేవిడ్ రాజు, మద్దెల శ్యాంప్రసాద్, పిల్లి లక్ష్మీతులసి, డాక్టర్ బెనర్జీ, బసవరాజు, గొంట్ల రామ్మోహనరావులను సత్కరించారు. చింతకాలయ చిట్టిబాబు పర్యవేక్షించారు. భారత మహిళా మండలి అధ్యక్షురాలు ఆర్.శ్రీలక్ష్మీ దేవి, కార్యవర్గసభ్యులు పి.శశిరేఖ, వి.కామేశ్వరి, శచిదేవి, ఎ.రత్నలక్ష్మి, టిసాయిలక్ష్మి, జీవీఎల్ కుమారిని సత్కరించారు.

నిలకడగా చిన్నారుల ఆరోగ్యం

- 11 మంది డిశ్చార్జ్, మరో ఇద్దరికి చికిత్స

ఎ.కొండూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు శివారు పెద్దతండాలోని అంగన్వాడీ కేంద్రంలో అపరిశుభ్ర వాతవరణంలో ఆహారం తిన్న 13 చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు, అంగన్వాడీ సూపర్‌వైజర్ శివకుమారి తెలిపారు. 11 మంది పిల్లలను శుక్రవారం డిశ్చార్జి చేశారు. జరబల యశ్వంత్‌సాయి, గుగ్గులోతు సాయిదినేష్‌కు విరేచనాలు తగ్గకపోవడంతో రెండు రోజులు చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు పెద్దతండా అంగన్వాడీ కేంద్రంలోని గుడ్లు, పప్పు, నీరు శాంపిల్ తీసుకున్నారు. ల్యాబ్ టెస్టింగ్ అనంతరం చిన్నారుల అస్వస్థతకు కారణం తెలుస్తుందని వైద్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి దుర్మరణం

మైలవరంరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆరేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని వెల్వడం గ్రామ శివారు ఇటుక బట్టీల వద్ద గురువారం అర్ధరాత్రి జరిగింది. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెద్దపాలెం గ్రామానికి చెందిన ఎందుమూరి రవి రెండు నెలల క్రితం తోలుకోడు రోడ్డులో ఉన్న ఇటుక బట్టీల్లో పని చేసేందుకు కుటుంబంతో కలిసి వచ్చాడు. బట్టీల వద్ద పాకలు వేసుకొని నివసిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి టేబుల్ ఫ్యాన్ వైర్లు లీకై మంటలు వచ్చాయి. దీంతో నిద్రిస్తున్న రవి మేల్కొని కేకలు వేశాడు. కుటుంబసభ్యులు కేకలు విని నిద్ర లేచారు. కుమారుడు యశ్వంత్ ఏదో జరుగుతుందని ఫ్యాన్ వద్దకు వెళ్లాడు. వైర్లు తగిలి కిందపడ్డాడు. కుమారుడిని కాపాడే ప్రయత్నంలో తండ్రికీ గాయాలయ్యాయి. మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రవిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రవికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

అమన్ అదుర్స్

బెంగళూరుకు షాక్

ఉత్కంఠ పోరులో ముంబై గెలుపు

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ x యూపీ
రాత్రి 7.30 నుంచి



అమన్‌జోత్ కౌర్ (3/22, 34 నాటౌట్)

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తాజా సీజన్‌లో వరుస విజయాలతో జోరుమీదున్న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు సొంత మైదానంలో చుక్కెదురైంది. శుక్రవారం చివరి బంతి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ నాలుగు వికెట్లతో బెంగళూరును ఓడించింది. పొదుపైన బౌలింగ్‌తో మూడు వికెట్లు (3/22) తీయడంతోపాటు బ్యాటింగ్‌లోనూ (27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34 నాటౌట్) సత్తా చాటిన అమన్‌జోత్ కౌర్ ముంబై విజయంలో కీలక భూమిక పోషించింది. తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 167/7 స్కోరు చేసింది. ఎలిస్ పెర్రీ (43 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 81), రిచా ఘోష్ (25 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 28), మంధాన (13 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 26) రాణించారు. ఛేదనలో ముంబై 19.5 ఓవర్లలో 170/6 స్కోరు చేసి విజయం అందుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (38 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 50), బ్రంట్ (21 బంతుల్లో 9 ఫోర్లతో 42) సత్తా చాటారు. అమన్ జోత్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 167/7 (ఎలిస్ పెర్రీ 81, రిచా ఘోష్ 28, మంధాన 26, అమన్‌జోత్ కౌర్ 3/22)
ముంబై: 19.5 ఓవర్లలో 170/6 (హర్మన్ 50, బ్రంట్ 42, అమన్‌జోత్ 34 నాటౌట్, వేర్హమ్ 3/21, గార్త్ 2/30).

అఫ్ఘాన్‌ను శతక్కొట్టి..

రికెల్టన్ సెంచరీ

107 రన్స్ తేడాతో సౌతాఫ్రికా ఘనవిజయం



రికెల్టన్ (103)

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు కదం తొక్కారు. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ (103) కెరీర్‌లో తొలి శతకం సాధించగా, కెప్టెన్ బవుమా (58), వాన్‌డర్ డుస్సెన్ (52), మార్‌క్రమ్ (52 నాటౌట్) అర్ధసెంచరీలతో చెలరేగారు. దీంతో శుక్రవారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో సఫారీలు 107 పరుగుల తేడాతో గెలిచి టోర్నీని ఘనంగా ఆరంభించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 6 వికెట్లకు 315 పరుగులు చేసింది. నబీ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో అఫ్ఘాన్ ఏ దశలోనూ విజయంవైపు సాగలేదు. రహ్మత్ షా (90) ఒంటరి పోరాటం చేయగా, సహచరుల్లో ఒక్కరూ కనీసం 20 రన్స్ చేయలేకపోయారు. ఫలితంగా అఫ్ఘాన్ 43.3 ఓవర్లలో 208 రన్స్‌కు కుప్పకూలింది. రబాడకు మూడు.. ఎన్‌గిడి, ముల్డర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రికెల్టన్ నిలిచాడు.

కలిసికట్టుగా: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌లో టాప్-6 బ్యాటర్లలో నలుగురు 50+ స్కోర్లు సాధించడం విశేషం. ఓపెనర్ జోర్జి (11) విఫలమయ్యాడు. మరో ఓపెనర్ రికెల్టన్ మాత్రం అఫ్ఘాన్ బౌలర్లను ఆరంభం నుంచి దీటుగా ఎదుర్కొన్నాడు. భారీషాట్లకు వెళ్లకపోయినా బంతులను వృథా చేయకుండా స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. కెప్టెన్ బవుమాతో కలిసి రెండో వికెట్‌కు 129 పరుగులు జత చేశాడు. హాఫ్ సెంచరీ అయ్యాక బవుమాను నబీ అవుట్ చేశాడు. ఆ తర్వాత డుస్సెన్ రాకతో స్కోరులో వేగం పెరిగింది. అటు శతకం పూర్తయ్యాక రికెల్టన్ రనౌట్ కావడంతో మూడో వికెట్‌కు ఈ ఇద్దరి మధ్య 44 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత డుస్సెన్ కూడా అర్ధసెంచరీ పూర్తి చేసుకుని 43వ ఓవర్‌లో వెనుదిరిగాడు. కానీ చివర్లో మార్‌క్రమ్ బాదుడుకు సఫారీల స్కోరు అవలీలగా 300 దాటేసింది.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా: రికెల్టన్ (రనౌట్) 103; జోర్జి (సి) అజ్మతుల్లా (బి) నబీ 11; బవుమా (సి) అటల్ (బి) నబీ 58; వాన్‌డర్ డుస్సెన్ (సి) షాహిదీ (బి) నూర్ అహ్మద్ 52; మార్‌క్రమ్ (నాటౌట్) 52; మిల్లర్ (సి) రహ్మత్ (బి) ఫరూఖీ 14; జాన్సెన్ (బి) అజ్మతుల్లా 0; ముల్డర్ (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 50 ఓవర్లలో 315/6. వికెట్ల పతనం:** 1-28, 2-157, 3-201, 4-248, 5-298, 6-299. **బౌలింగ్:** ఫరూఖీ 8-0-59-1; అజ్మతుల్లా 6-0-39-1; నబీ 10-0-51-2; రషీద్ ఖాన్ 10-0-59-0; గుల్బదిన్ 7-0-42-0; నూర్ అహ్మద్ 9-0-65-1.

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్ (సి) కేశవ్ (బి) ఎన్‌గిడి 10; జద్రాన్ (బి) రబాడ 17; అటల్ (రనౌట్) 16; రహ్మత్ షా (సి) రికెల్టన్ (బి) రబాడ 90; షాహిదీ (సి) బవుమా (బి) ముల్డర్ 0; ఒమర్జాయ్ (సి) రికెల్టన్ (బి) రబాడ 18; నబీ (సి) రబాడ (బి) జాన్సెన్ 8; గుల్బదీన్ (సి) బవుమా (బి) ఎన్‌గిడి 13; రషీద్ (సి) మార్‌క్రమ్ (బి) కేశవ్ 18; నూర్ అహ్మద్ (బి) ముల్డర్ 9; ఫరూఖీ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 43.3 ఓవర్లలో 208 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-16, 2-38, 3-50, 4-50, 5-89, 6-120, 7-142, 8-169, 9-208, 10-208. **బౌలింగ్:** జాన్సెన్ 8-1-32-1; ఎన్‌గిడి 8-0-56-2; రబాడ 8.3-1-36-3; ముల్డర్ 9-0-36-2; కేశవ్ 10-0-46-1.

సచిన్, యువీ బరిలోకి..

నేటినుంచి అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్

ముంబై: సుదీర్ఘ విరామం తర్వాత భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, డాషింగ్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ మరోసారి బ్యాట్లు చేతపట్టనున్నారు. ఈ ఇద్దరితో పాటు మరి కొంత మంది మాజీలు సైతం మైదానంలో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. తొలిసారిగా జరుగబోతున్న అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్ (ఐఎంఎల్) ఇందుకు వేదిక కానుంది. శనివారం నవీ ముంబైలో జరిగే తొలి మ్యాచ్‌లో ఇండియా మాస్టర్స్ జట్టు శ్రీలంక మాస్టర్స్‌తో తలపడనుంది. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీలో ఆసీస్, ఇంగ్లండ్, విండీస్, దక్షిణాఫ్రికా జట్లు కూడా పాల్గొంటున్నాయి. మార్చి 16న రాయ్‌పూర్‌లో ఫైనల్ జరుగుతుంది. ఇండియా మాస్టర్స్‌లో అంబటి రాయుడు, పఠాన్ సోదరులు, సౌరభ్ తివారీ, స్టువర్ట్ బిన్నీ తదితరులు ఆడుతున్నారు.





కేరళ ఆటగాళ్ల విజయానందం

68 ఏళ్లలో తొలిసారి..

రంజీ ఫైనల్లో కేరళ

విదర్భతో తుదిపోరుకు సై

రెండో సెమీస్‌లో ముంబై ఓటమి

అహ్మదాబాద్: ప్రతిష్ఠాత్మక దేశవాళీ టోర్నీ రంజీట్రోఫీలో కేరళ ఆడడం ప్రారంభించి 68 ఏళ్లు అయ్యింది. కానీ ఇన్ని దశాబ్దాలలో ఆ జట్టు ఎప్పుడూ టైటిల్ పోరుకు చేరలేదు. కానీ ఈసారి టోర్నమెంట్ ఆసాంతం అద్భుత ప్రదర్శన చేసిన ఆ జట్టు ఫైనల్లో అడుగుపెట్టి చరిత్ర సృష్టించింది. గుజరాత్‌తో సెమీఫైనల్ డ్రాగా ముగిసినా.. కేవలం రెండు పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కేరళ ఫైనల్ బెర్త్ దక్కించుకోవడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 429/7తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ మరో 29 రన్స్ చేస్తే మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం చేజిక్కించుకొనేది. కానీ తీవ్ర ఒత్తిడిని అదిమిపట్టిన కేరళ లెఫ్టామ్ స్పిన్నర్ అదిత్య సర్వతే ప్రత్యర్థి చివరి 3 వికెట్లనూ పడగొట్టాడు. దాంతో గుజరాత్ తొలి ఇన్నింగ్స్ 455 పరుగుల వద్ద ముగిసింది. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 457 రన్స్ సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో కేరళ చివరి రోజు ఆఖరికి 114/4 స్కోరు చేసింది. 1957లో రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేసిన కేరళ.. ఫైనల్లో విదర్భ జట్టుతో తలపడుతుంది. తుది పోరు ఈనెల 26 నుంచి జరుగుతుంది.

విదర్భ ప్రతీకార విజయం: నాగ్‌పూర్‌లో జరిగిన మరో సెమీఫైనల్లో నిరుటి రన్నరప్ విదర్భ.. డిఫెండింగ్ చాంప్ ముంబైని 80 పరుగులతో చిత్తు చేసింది. తద్వారా గతేడాది ఫైనల్లో ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. 406 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 83/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 325 రన్స్‌కు ఆలౌటైంది. హర్ష్ దూబే 5 వికెట్లు తీశాడు. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 383, ముంబై 270 రన్స్ చేశాయి. విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 292 రన్స్ సాధించింది.

సాత్విక్‌కు తీరని లోటు: గోపీచంద్



అమలాపురం(ఆంధ్రజ్యోతి): డబుల్స్ స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్‌కు తండ్రి మరణం తీరని లోటు అని జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నాడు. సాత్విక్ తండ్రి రంకిరెడ్డి కాశీ విశ్వనాథం గుండెపోటుతో గురువారం మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో శుక్రవారం సాత్విక్ స్వస్థలానికి విచ్చేసి అతడిని ఓదార్చిన గోపీచంద్.. కాశీ విశ్వనాథం భౌతికకాయానికి నివాళి అర్పించాడు. సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, వెటరన్ క్రీడాకారుడు ఏవీఎస్ఎన్ మూర్తి తదితరులు కూడా సాత్విక్ తండ్రికి నివాళులు అర్పించారు.

చాంపియన్స్ ట్రోఫీలో నేడు
ఆస్ట్రేలియా X ఇంగ్లండ్
మ.2.30 నుంచి - స్టార్‌స్పోర్ట్స్‌లో

'టాప్స్'లో సింధు, నిఖత్ స్థానం పదిలం

అథ్లెట్ల సంఖ్య 179 నుంచి 94కు కుదింపు

న్యూఢిల్లీ: టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) కింద ఆర్థిక లబ్ధి పొందే అథ్లెట్ల జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి స్టార్ షట్లర్ పీవీ సింధు, డబుల్స్ స్టార్ సాత్విక్ సాయిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ తమ స్థానాలను పదిలం చేసుకున్నారు. గతేడాది పారిస్ ఒలింపిక్స్ ముగియడంతో ఈసారి చాలామంది అథ్లెట్లకు టాప్స్‌లో ఉద్వాసన పలికారు. ఇప్పటిదాకా ఈ పథకం కింద 179 మంది క్రీడాకారులు ఉండగా, తాజాగా ఆ జాబితాను 94కు కుదించడం గమనార్హం. ఈ 94లో 42 మంది సాధారణ అథ్లెట్లు కాగా.. మిగతా 52 మంది పారా అథ్లెట్లు. వాస్తవానికి గతేడాది టాప్స్ పథకం కింద సాధారణ అథ్లెట్లు 78 మంది ఉండగా.. వీరిలో నుంచి ఈసారి 36 మందిని తొలగించారు. క్రీడాకారుల ప్రదర్శనను సమీక్షించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర క్రీడాశాఖ తెలిపింది. గత జాబితాలో అథ్లెటిక్స్ నుంచి 30 మంది పేర్లుండగా.. ఈసారి కేవలం ముగ్గురు జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా, స్టీపుల్ చేజర్ అవినాశ్ సబ్లే, లాంగ్‌జంపర్ శ్రీశంకర్‌లకు చోటు కల్పించారు. బ్యాడ్మింటన్‌లో సింధు, లక్ష్యసేన్, ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి చోటు దక్కగా.. ఫామ్‌లో లేని ప్రపంచ మాజీ నెంబర్‌వన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, డబుల్స్ స్టార్ అశ్విని పొన్నప్పలకు ఉద్వాసన పలికారు. బాక్సింగ్ నుంచి నిఖత్ జరీన్, ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లీనా పేర్లను మాత్రమే ఉంచిన క్రీడాశాఖ.. పురుష బాక్సర్లలో ఒక్కరికి కూడా చోటు కల్పించలేదు. ఇక, గోల్ఫ్, స్విమ్మింగ్, టెన్నిస్ నుంచి ఎవరినీ టాప్స్‌లోకి తీసుకోకపోవడం గమనార్హం. రెజ్లర్లలో రవి దహియాకు స్థానం దక్కగా, సీనియర్లు వినేశ్ ఫొగట్, బజ్‌రంగ్ పేర్లను తొలగించారు.

హాకీలో ఐర్లాండ్‌పై భారత్ గెలుపు

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో భారత పురుషుల హాకీ జట్టు 3-1తో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. కాగా, ఇదే లీగ్‌లో భారత మహిళల బృందానికి నిరాశ ఎదురైంది. శుక్రవారం పోరులో భారత్ 0-4తో జర్మనీ చేతిలో ఓటమిపాలైంది.

బిజినెస్

గ్రాన్యూల్స్ గూటికి స్విస్ కంపెనీ

ఒప్పందం విలువ రూ.192 కోట్లు

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌కు చెందిన సీడీఎంఓ (కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్) సేవల కంపెనీ 'సెన్ కెమికల్స్ ఏజీ'ని 2 కోట్ల స్విస్ ఫ్రాంక్‌లకు (సుమారు రూ.192 కోట్లు) కొనుగోలు చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన ఔషధ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. తద్వారా గ్రాన్యూల్స్ కూడా సీడీఎంఓ విభాగంలోకి ప్రవేశించినట్లైంది. సెన్ కెమికల్స్ తన గ్లోబల్ కస్టమర్ల కోసం పెప్టైడ్స్, పెప్టైడ్స్ ఆధారిత అప్లికేషన్లను అభివృద్ధి చేయడంతో పాటు ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రథమార్ధంలోనే డీల్ పూర్తి కావచ్చని గ్రాన్యూల్స్ వెల్లడించింది.

అదానీ సంపదలో రూ.లక్ష కోట్లు ఫట్



ఈ ఏడాదిలో అత్యధికంగా నష్టపోయిన బిలియనీర్లలో మస్క్ తర్వాత అదానీయే..

రూ.3 లక్షల కోట్లు తగ్గిన మస్క్ నెట్‌వర్త్

న్యూఢిల్లీ: భారత్‌లో రెండో అతి పెద్ద ధనవంతుడైన గౌతమ్ అదానీ సంపదకు భారీగా గండి పడింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు అదానీ వ్యక్తిగత ఆస్తి 1,190 కోట్ల డాలర్ల (రూ.1.03 లక్షల కోట్లు) మేర తగ్గి 6,680 కోట్ల డాలర్లకు (రూ.5.81 లక్షల కోట్లు) పడిపోయింది. ప్రపంచ కుబేరుల జాబితాలో అదానీ ప్రస్తుతం 23వ స్థానానికి జారుకున్నారు. అదానీ గ్రీన్ ఎనర్జీ నుంచి సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాలు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులకు 25 కోట్ల డాలర్ల (రూ.2,200 కోట్లు) లంచాలు ఇచ్చారనే ఆరోపణలపై గత ఏడాదిలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ సహా 8 మంది వ్యక్తులపై అమెరికాలో కేసు నమోదైంది. దాంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల విలువ గడిచిన కొన్ని నెలల్లో భారీగా తగ్గుతూ వచ్చింది. తత్ఫలితంగా గౌతమ్ అదానీ వ్యక్తిగత సంపద కూడా క్షీణించింది.

2025లో అత్యధికంగా సంపద నష్టపోయిన ప్రపంచ బిలియనీర్లలో టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ తర్వాత స్థానం అదానీదే. ప్రపంచంలో నం.1 ధనవంతుడైన మస్క్ నెట్‌వర్త్ ఈ ఏడాదిలో 3,520 కోట్ల డాలర్ల (రూ.3.06 లక్షల కోట్లు) మేర తగ్గి 39,700 కోట్ల డాలర్లకు (రూ.34.54 లక్షల కోట్లు) పడిపోయింది. కాగా, భారత కుబేరుడు ముకేశ్ అంబానీ ఆస్తి కూడా కరిగిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 294 కోట్ల డాలర్ల (రూ.25,578 కోట్లు) మేర తగ్గి 8,770 కోట్ల డాలర్లకు (రూ.7.63 లక్షల కోట్లు) పడిపోయింది. బ్లూమ్‌బర్గ్ రిచ్ లిస్ట్‌లో అంబానీ ప్రస్తుతం 17వ స్థానంలో ఉన్నారు.

ఇక సెట్ టాప్ బాక్స్‌ల పోర్టబిలిటీ!

న్యూఢిల్లీ: మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలో సెట్ టాప్ బాక్స్‌ల్లోనూ ఇంటరాపరబిలిటీ సదుపాయాన్ని అందుబాటులోకి తేవాలని టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ(ట్రాయ్) సిఫారసు చేసింది. బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీలు తమ మౌలిక సదుపాయాలను పరస్పరం పంచుకోవాలని, ఐపీటీవీ సర్వీస్ ప్రొవైడర్లకు కనీస నెట్‌వర్త్ పరిమితిని సైతం తగ్గించాలని ట్రాయ్ సిఫారసు చేసింది. సెట్ టాప్ బాక్స్‌ల్లో పోర్టబిలిటీ సదుపాయం అందుబాటులోకి వస్తే, కస్టమర్లు ఇతర బ్రాడ్‌కాస్టింగ్ సేవలకు మారినపుడు సెట్ టాప్ బాక్స్‌ను కూడా మార్చుకోవాల్సిన బెడద తప్పుతుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	450
వరంగల్	427	గోదావరి	440
చిత్తూరు	493	విశాఖపట్నం	445
		దజను గుడ్లు రూ.	60



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70	విజయవాడ	71
వరంగల్	70	గుంటూరు	60
కరీంనగర్	70	ఒంగోలు	60
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	85
కర్నూలు	70	నెల్లూరు	90
విశాఖపట్నం	70	అనంతపురం	90
గోదావరి	71		






బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	88,100 ▲	80,750 ▲	1,07,000 ▼
విజయవాడ	88,700 ▼	82,500 ▼	98,700 ▼
విశాఖపట్నం	85,960 ▼	78,800 ▼	97,320 ▼
రాజమండ్రి	87,550 ▼	80,250 ▼	1,00,000 ▲
ప్రొద్దుటూరు	88,550 ▼	82,000 ▼	98,500 ▲
ముంబై	86,090 ▼	78,860 ▼	97,150 ▲

జీరో ఫర్ జీరో టారిఫ్ వ్యూహం మెరుగు

అమెరికా పరస్పర సుంకాల ముప్పును పరిష్కరించేందుకు జీటీఆర్ఐ ప్రతిపాదన



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన పరస్పర సుంకాల సమస్యను పరిష్కరించుకునేందుకు భారత్‌కు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) ఓ సూచన చేసింది. పరస్పర సుంకాలు అమలులోకి రాకముందే యూఎస్‌కు భారత్ 'జీరో ఫర్ జీరో' టారిఫ్ వ్యూహాన్ని ప్రతిపాదించాలని సూచించింది. అమెరికాతో పూర్తి స్థాయి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం కంటే ఈ ప్రతిపాదనతో నష్టం తక్కువని జీటీఆర్ఐ అభిప్రాయపడింది. ఈ వ్యూహంలో భాగంగా, దేశీయ పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి నష్టం జరగకుండా అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఏయే ఉత్పత్తులపై సుంకాన్ని పూర్తిగా రద్దు చేయవచ్చని భారత్ గుర్తించాలి. అందుకు బదులుగా, అమెరికా కూడా అదే సంఖ్యలో భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై సుంకాన్ని పూర్తిగా రద్దు చేయాల్సి ఉంటుంది. భారత్ ఈ జాబితా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను చాలా వరకు మినహాయించవచ్చు. ఈ జాబితాను రూపొందించేందుకు జపాన్, కొరియా, ఆసియాన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను పరిశీలించాలని జీటీఆర్ఐ తన నోట్‌లో పేర్కొంది. ఏప్రిల్‌కు ముందే ఈ జాబితాపై అమెరికాతో చర్చించి, ఆమోదం పొందగలిగితే భారత్‌పై పరస్పర సుంకాల ప్రభావం అతి స్వల్పంగా లేదా దాదాపుగా ఉండకపోవచ్చని జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ అన్నారు. జీరో ఫర్ జీరో టారిఫ్ వ్యూహం ద్వారా భారత్ 90 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై అధిక సుంకాల భారాన్ని తప్పించవచ్చన్నారు. జీరో ఫర్ జీరో టారిఫ్ వ్యూహం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ, సంక్లిష్టమైన రాయితీలు, వ్యవసాయ సబ్సిడీల్లో కోత, మేధో సంపత్తి హక్కులను బలహీనపరిచే, సమాచార ప్రవాహ ఆంక్షలను ఎత్తివేయాల్సి వచ్చే పూర్తి స్థాయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కంటే తక్కువ నష్టం కలిగించేదన్నారు. 2024 నాటికి భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12,500 కోట్ల డాలర్ల స్థాయికి చేరింది. పరస్పర సుంకాలతో భారత్‌కు చెందిన పలు రంగాల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఒకవేళ అమెరికా ఏకరీతి టారిఫ్ విధిస్తే, భారత ఎగుమతులు అదనంగా 4.9 శాతం సుంకాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. రంగాల వారీగా సుంకాలు విధిస్తే మాత్రం, మన వ్యవసాయ ఎగుమతులకు అధిక నష్టం వాటిల్లనుంది. రొయ్యలు, డెయిరీ, ప్రాసెస్డ్ ఫుడ్ రంగాలు 38.2 శాతం వరకు సుంకాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పారిశ్రామిక ఉత్పత్తుల విషయానికొస్తే, ఔషధాలు, వజ్రాలు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులపైనా సుంకం భారం గణనీయంగా పెరగనుంది.

సుంకాలు తగ్గించుకుంటే మనకే మేలు

నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం



న్యూఢిల్లీ: సుంకాలు ఏ దేశాన్నీ రక్షించలేవని.. మన మేలు కోసం వాటిని తగ్గించుకోవాలని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) 69వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు భారత్‌కున్న ఐదు ప్రాధాన్యాల్లో 'ప్రపంచంతో స్వేచ్ఛా వాణిజ్యం' ఒకటని ఆయన ఈ సందర్భంగా అన్నారు. సుంకాలను తగ్గించుకునేందుకు యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్ సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో భారత్ తప్పనిసరిగా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవాలన్నారు.

వ్యాపార రుణాలపై ప్రీ-పేమెంట్ చార్జీలు రద్దు

ప్రతిపాదించిన ఆర్‌బీఐ

ముంబై: వ్యక్తులు, సూక్ష్మ, చిన్న తరహా సంస్థలు(ఎంఎస్ఈ) వ్యాపారంతోపాటు ఇతర అవసరాల కోసం తీసుకునే అన్ని ఫ్లోటింగ్ రేట్ రుణాలపై బ్యాంక్‌లు, ఇతర రుణదాతలు విధించే ప్రీ-పేమెంట్ చార్జీలను రద్దు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. అయితే, ఎంఎస్ఈ రుణగ్రహీతల విషయంలో రూ.7.50 కోట్ల వరకు రుణ పరిమితిపైనే ఇది వర్తిస్తుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ ముసాయిదా ప్రతిపాదనలపై మార్చి 21లోగా అభిప్రాయాలు తెలుపాలని సంబంధిత వర్గాలను ఆర్‌బీఐ కోరింది.

హైదరాబాద్ ఎయిర్‌పోర్టు విస్తరణ

- 2031 నాటికి ఐదు కోట్ల మంది ప్రయాణికులు
- మే కల్లా కొత్త కార్గో టెర్మినల్ నిర్మాణం పూర్తి

హైదరాబాద్: జీఎంఆర్ గ్రూప్ నిర్వహణలోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పెద్ద ఎత్తున విస్తరణ చేపట్టింది. ఈ విస్తరణతో ప్రయాణికుల వార్షిక రాకపోకలు 2031 నాటికి ఐదు కోట్లకు పెరగనున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఈ విమానాశ్రయం నుంచి 2.5 కోట్ల మంది రాకపోకలు సాగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది 2.9 కోట్లకు పెరగనుందని సంస్థ సీఈఓ ప్రదీప్ ఫణిక్కర్ వెల్లడించారు. గంటకు 42 విమానాలు టేకాఫ్, ల్యాండింగ్ అయ్యేలా ఈ ఎయిర్‌పోర్టును నిర్మించారు. ప్రస్తుతం గంటకు సగటున 34 నుంచి 35 విమానాల ల్యాండింగ్, టేకాఫ్ జరుగుతోంది.

సరుకు రవాణా: ఈ ఆర్థిక సంవత్సరం ఎయిర్‌పోర్ట్ ద్వారా జరిగే సరుకు రవాణా 1.8 లక్షల టన్నులకు చేరుతుందని యాజమాన్యం భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 20 శాతం ఎక్కువని ఫణిక్కర్ చెప్పారు. రూ.370 కోట్ల పెట్టుబడితో కార్గో టెర్మినల్ వార్షిక సామర్థ్యాన్ని నాలుగు లక్షల టన్నులకు పెంచనున్నట్టు తెలిపారు. ఇందులో రూ.215 కోట్లు ప్రస్తుత టెర్మినల్ సామర్థ్య విస్తరణ కోసం వినియోగిస్తారు. మిగతా రూ.155 కోట్లతో మరో కొత్త టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. కొత్త టెర్మినల్ నిర్మాణం ఈ ఏడాది మేకల్లా పూర్తి చేసి జూన్ లేదా జూలై కల్లా వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం భావిస్తోంది.

టాటా మోటార్స్ స్టెల్త్ ఎడిషన్ కార్లు



టాటా సఫారీ విడుదల చేసి 27 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సఫారీ, హారియెర్ స్టెల్త్ ఎడిషన్ కార్లను కంపెనీ విడుదల చేసింది. ఈ లిమిటెడ్ ఎడిషన్ కార్లు 2700 యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. చూపరులను ఇట్టే ఆకట్టుకునే ఈ ప్రీమియం ఎడిషన్ కార్లు విలాసానికి, శక్తికి మారుపేరుగా నిలుస్తాయని కంపెనీ తెలిపింది. డీలర్ల వద్ద, ఆన్‌లైన్‌లోనూ వీటి కోసం తక్షణం బుకింగ్ చేసుకోవచ్చు. ఢిల్లీ మార్కెట్లో హారియెర్ స్టెల్త్ ఎడిషన్ కారు ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర రూ.25.09 లక్షలైతే సఫారీ ఎక్స్ షోరూమ్ ప్రారంభ ధర రూ.25.74 లక్షలు.

22,800 దిగువన నిఫ్టీ

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 424.90 పాయింట్ల నష్టంతో 75,311.06 వద్ద ముగియగా నిఫ్టీ 117.25 పాయింట్ల నష్టంతో 22,795.90 వద్ద క్లోజయింది. అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ ఒక దశలో 623.55 పాయింట్లు నష్టపోయి 75,112.41 పాయింట్ల ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకింది. ఆటో, ఫార్మా, బ్యాంకింగ్, ఐటీ, టెలికాం, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి శుక్రవారం సూచీలను బాగా దెబ్బతీశాయి. ఎడతెగని ఎఫ్‌పీఐల అమ్మకాలు, డాలర్‌తో బేర్ మంటున్న రూపాయి మారకం రేటు కూడా ఇందుకు ప్రధాన కారణం.

- ఫారెక్స్ నిల్వలు ఈ నెల 14తో ముగిసిన వారంలో 254 కోట్ల డాలర్లు తగ్గి 63,572.1 కోట్ల డాలర్లకు (సుమారు రూ.55.12 లక్షల కోట్లు) చేరినట్టు ఆర్‌బీఐ తెలిపింది.

498.. వరకట్నం సెక్షన్ మాత్రమే కాదు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలేతో కూడిన ధర్మాసనం గత ఏడాది డిసెంబరు 12న వ్యాఖ్యానించింది. ఐపీసీ సెక్షన్ 498ఏలోనే క్రూరత్వ చర్యలు ఇమిడి ఉన్నాయని, భర్త, అత్తమామలపై ఈ సెక్షన్‌ను అమలు చేయడానికి అదనంగా వరకట్నం డిమాండ్‌ను జోడించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. భార్యలపై జరిగే క్రూరత్వం ఏ రూపంలో ఉన్నా అది 498 సెక్షన్ కింద శిక్షార్హమైందేనని పేర్కొంది. సెక్షన్ 498ఏ, బీ క్లాజులలో అంశాలు ఎలాంటి వేధింపులకైనా వర్తిస్తాయని స్పష్టం చేసింది. క్లాజ్-ఏ ప్రకారం.. భార్యను శారీరకంగా, మానసికంగా హింసించడం, క్లాజ్-బీ ప్రకారం.. భార్య లేదా ఆమె పుట్టింటి వారి నుంచి చట్టవిరుద్ధమైన డిమాండ్‌ను(అదనపు కట్నం, కానుకలు వంటివి) బలవంతంగా నెరవేర్చుకునేందుకు చేసే వేధింపులు వర్తిస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో సెక్షన్ 498ను ప్రవేశ పెట్టిన సందర్భంగా పార్లమెంటులో చేసిన ప్రకటనను కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. "ఈ నిబంధన.. కేవలం వరకట్న వేధింపులు, వరకట్న మరణాలకే కాదు, వివాహితలపై వారి భర్తలు, అత్తింటివారు క్రూరంగా ప్రవర్తించే కేసులను కూడా సమర్థవంతంగా పరిష్కరిస్తుంది" అని పార్లమెంటులో చేసిన ప్రకటనను ధర్మాసనం చదివి వినిపించింది. 'సెక్షన్ 498ఏ' కింద ఒక వ్యక్తి సహా ఇతరులపై ఏపీ పోలీసులు కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కట్టారు. అయితే, ఈ కేసును విచారించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. సదరు వ్యక్తి, ఇతరులపై నమోదైన అభియోగాలు సెక్షన్ 498ఏలో పేర్కొన్న క్రూరత్వం కిందకు రాబోవని, వారు వరకట్నం డిమాండ్ చేసినట్టు స్పష్టం కాలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. అనంతరం, ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. పలు తీర్పులను ఉటంకిస్తూ.. హైకోర్టు ఇచ్చిన తీర్పును(ఎఫ్ఐఆర్ కొట్టివేత) తోసిపుచ్చింది. ఈ కేసులో సదరు వ్యక్తి భార్య అప్పీల్‌ను విచారణకు స్వీకరించింది.

నకిలీ నోట్లను ముద్రించే ముఠాల గుట్టు రట్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: దేశవ్యాప్తంగా నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించే ముఠాల గుట్టు రట్టయింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు ఏకకాలంలో దేశంలోని 11 వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. మహారాష్ట్ర, హరియాణా, తెలంగాణ, తమిళనాడు, బిహార్ రాష్ట్రాల్లో ఈ నెల 20న దాడులు చేశారు. ఏడు చోట్ల నకిలీ కరెన్సీ నోట్లను ముద్రిస్తున్నట్లు గుర్తించారు. ఈ నెల 8న డీఆర్ఐ జరిపిన తనిఖీల్లో నకిలీ నోట్ల ముద్రణకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరు కరెన్సీ నోట్లలో వాడే భద్రతాపరమైన, ఆర్‌బీఐ, భారత్ అనే అక్షరాలతో కూడిన దారంతోపాటు అత్యంత నాణ్యమైన పేపర్‌ను దిగుమతి చేసుకుంటున్నారని గుర్తించారు. అనంతరం ఈ నెల 9న జరిపిన దాడుల్లో మహారాష్ట్రలోని థానే, హరియాణాలోని భివానీలో రెండు నకిలీ కరెన్సీ నోట్ల ముద్రణ స్థావరాలను కనుగొన్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ నెల 20న జరిపిన దాడుల్లో ముంబైలోని విక్రోలిలో మరో స్థావరాన్ని కనుగొన్నారు. రూ.50, రూ.100 నకిలీ నోట్లను ముద్రిస్తున్నట్లు గుర్తించారు. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లాలో కూడా సెక్యూరిటీ పేపర్, ప్రింటర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

కొవిడ్ తరహాలో చైనాలో కొత్త వైరస్!

బీజింగ్, ఫిబ్రవరి 21: గబ్బిలాల ద్వారా మనుషులకు వ్యాప్తి చెందే మరో వైరస్‌ను చైనా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దానికి 'హెచ్‌కేయూ5-కొవ్-2' అని పేరు పెట్టారు. కొవిడ్ వ్యాప్తికి కారణమైన 'సార్స్-కొవ్-2' వైరస్‌లాగే ఇది కూడా వ్యాపిస్తుందని, అయితే, దీనివల్ల కొవిడ్ అంత ప్రమాదం లేదని చైనా శాస్త్రవేత్తలు తెలిపారు. గబ్బిలాల ద్వారా వ్యాపించే కరోనా వైరస్‌ల మీద విస్తృత పరిశోధనలు జరిపి 'బ్యాట్ ఉమన్'గా పేరొందిన చైనా మహిళా శాస్త్రవేత్త షి జెంగ్లీ ఈ అధ్యయనానికి సారథ్యం వహించారు. క్షీరదాల్లో ఉండే ఏసీఈ-2 అనే ఎంజైమ్ రిసెప్టర్ ద్వారా కొవిడ్‌కు కారణమైన 'సార్స్-కొవ్-2' వైరస్ మనుషులకు సంక్రమించింది. 'హెచ్‌కేయూ5-కొవ్-2' కూడా ఏసీఈ-2 ద్వారానే వ్యాప్తి చెందుతుందని తేలింది.

అదొక కిక్‌బ్యాక్ స్కీమ్!



నిధులను ఖర్చు పెట్టుకుంటారు.. వాటిని పంపినవారి లబ్ధికి పని చేస్తారు

- యూఎస్ఎయిడ్ నిధులపై ట్రంప్ మళ్లీ ఫైర్
- యూపీఏ హయాంలోనే భారత్‌కు ఆ నిధులు భారీగా వచ్చాయన్న బీజేపీ
- కాదు, అవి బంగ్లాకు అందిన ఫండ్: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: భారత్‌కు యూఎస్ఎయిడ్ నిధుల తరలింపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారాన్ని ఆయన 'కిక్‌బ్యాక్ స్కీమ్'గా దుయ్యబట్టారు. "ఈ నిధులు భారత్‌కే పోతున్నాయని మీరు ఊహించగలరా! వాటిని అందుకున్నవారు ఏం ఆలోచిస్తారనేది తలుచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇదొక కిక్‌బ్యాక్ స్కీమ్. నిధులు తీసుకుని ఖర్చు పెట్టుకోవడంతో అయిపోయే వ్యవహారం కాదిది. వాటిని పంపినవారికి తిరిగి ప్రయోజనం కలిగేలా కూడా పని చేస్తారు" అని ట్రంప్ విమర్శించారు. కాగా, ట్రంప్ వరుస వ్యాఖ్యలు భారత్‌లో రాజకీయ వేడిని రోజు రోజుకు పెంచుతున్నాయి. రాహుల్ దేశద్రోహి అని బీజేపీ అంటే, యూఎస్ ఎయిడ్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. మరోవైపు, ఈ వివాదంలో ఏపీ మూలాలు కలిగిన అమెరికా సంతతి మహిళా అధికారి వీణారెడ్డి పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఆందోళన కలిగిస్తున్న ఈ వ్యవహారాలపై భద్రతా సంస్థలు దృష్టి సారించాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని దేశద్రోహి అంటూ బీజేపీ జాతీయ ప్రతినిధి గౌరవ్ భాటియా శుక్రవారం తీవ్రంగా విమర్శించారు. భారత్‌ను బలహీనపరచడానికి ఆయన విదేశీ శక్తులతో కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. "యూపీఏ అధికారంలో ఉన్న పదేళ్లకాలంలో భారత్‌కు అమెరికా నుంచి 2వేల మిలియన్ డాలర్లకుపైగా సహాయక నిధులు అందాయి. మోదీ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి ఇప్పటివరకు కేవలం 1.5 మిలియన్ డాలర్ల విలువైన ఫండ్ అమెరికా నుంచి వచ్చింది. భారత సార్వభౌమాధికారాన్ని కాంగ్రెస్ తాకట్టు పెడుతుందని, దేశాన్ని ముక్కలు చేస్తుందని తెలుసు కాబట్టే ఎక్కువ నిధులు అప్పట్లో అందేవి. ఆ పని మోదీ చేయబోరని తెలుసు కాబట్టే పెద్దగా నిధులు రావడం లేదు. గత పదేళ్ల నుంచి విదేశీ ఫండ్ ప్రభుత్వానికి కాకుండా ఎన్జీవోలకు అందుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల ముందు మోదీని ఓడించడానికీ, రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను నడిపించడానికీ ఎన్జీవోలకు అందే నిధులు ఒక్కసారిగా పెరిగాయి. దేశాన్ని ముక్కలు చేయడం కోసమే రాహుల్ ఆ యాత్రను అప్పట్లో నిర్వహించారు. ఆయనో దేశద్రోహి" అని గౌరవ్ భాటియా విరుచుకుపడ్డారు.

ట్రంప్ చెబుతున్న యూఎస్ఎయిడ్ నిధులు భారత్‌కు కాదు.. బంగ్లాదేశ్‌కు అందాయని కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి పవన్ ఖేడా అన్నారు. ఓ ఆంగ్ల మీడియా పరిశోధనాత్మక కథనాన్ని ఉటంకిస్తూ ఆయన బీజేపీ ఆరోపణలను ఖండించే ప్రయత్నం చేశారు. మరోవైపు, యూఎస్ఎయిడ్ నిధులకు సంబంధించి బయటకువస్తున్న అంశాలు కలవరపాటు కలిగిస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. భారత్‌లోని ఎన్నికల వ్యవస్థలో విదేశీ శక్తులు జోక్యం చేసుకోవడానికి ఆ నిధుల ద్వారా ప్రయత్నించాయన్న వార్తలు ఆందోళనకు గురి చేస్తున్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. "భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ శక్తులు జోక్యం చేసుకుంటున్నాయన్న అంశంపై సంబంధిత విభాగాలు, ఏజెన్సీలు దృష్టి సారించాయి. నిజాలు త్వరలోనే తెలుస్తాయి" అని ఆయన వివరించారు.

ఎవరీ వీణారెడ్డి?



వీణారెడ్డి యూఎస్ ఎయిడ్ మిషన్ భారత విభాగం డైరెక్టర్ హోదాలో 2021లో భారత్‌కు వచ్చారనీ, 2024 సార్వత్రిక ఎన్నికలు ముగియగానే తిరిగి అమెరికా వెళ్లిపోయారంటూ బీజేపీ చేసిన విమర్శలతో ఆమె పేరు తాజా వివాదంలో వినవచ్చింది. వీణారెడ్డికి ఆంధ్రప్రదేశ్ మూలాలు ఉన్నాయి. బీజేపీ రాజ్యసభ సభ్యుడు, న్యాయవాది మహేశ్ జెత్మాలనీ తొలిసారి వీణారెడ్డి ప్రస్తావన తెచ్చారు. 2024 ఎన్నికలప్పుడు ఓటింగు పెంపు పేరిట సాగించిన తన కార్యకలాపాలు భద్రతాసంస్థల దృష్టిలో పడకముందే వీణారెడ్డి తిరిగి అమెరికా వెళ్లిపోయారని మహేశ్ జెత్మాలనీ ఆరోపించారు. భారత్‌లో అమెరికా దౌత్యాధికారిగా పనిచేసిన ఎరిక్ గార్సెటీతో కలిసి వీణ పనిచేసేవారన్నారు. భారత్‌లోని అమెరికా ఎంబసీ, కాన్సులేట్‌కు చెందిన వెబ్‌సైట్లను అనుసరించి.. వీణారెడ్డి షికాగో యూనివర్సిటీలో ఎమ్ఏ చేశారు. కొలంబియా స్కూల్ ఆఫ్ లాలో న్యాయవిద్యను అభ్యసించారు. ప్రభుత్వంలో చేరడానికి ముందు న్యూయార్క్, లాస్ ఏంజెలెస్, లండన్‌లో కార్పొరేట్ అటార్నీగా సేవలందించారు.

'ఉమెన్ ఆఫ్ ద ఇయర్'గా పూర్ణిమా దేవి



- అసోం జీవశాస్త్రవేత్తకు 'టైమ్' అరుదైన గౌరవం

న్యూయార్క్, ఫిబ్రవరి 21: అసోంకు చెందిన ప్రముఖ జీవశాస్త్రవేత్త, వన్యప్రాణుల సంరక్షకురాలు పూర్ణిమా దేవి బర్మన్ (45)కు అరుదైన గౌరవం లభించింది. 2025కు గాను టైమ్ మేగజైన్ ప్రకటించిన 'ఉమెన్ ఆఫ్ ద ఇయర్' జాబితాలో ఆమెకు స్థానం దక్కింది. మెరుగైన, మరింత సమానమైన ప్రపంచం కోసం పనిచేస్తున్న 'అసాధారణ నాయకుల'కు ఇచ్చే ఈ అవార్డుకు ప్రపంచ వ్యాప్తంగా 13 మంది మహిళలు ఎంపిక కాగా, భారత్ తరఫున పూర్ణిమా దేవిని మాత్రమే వరించింది. అసోంకు చెందిన 45 ఏళ్ల పూర్ణిమా దేవి జంతుశాస్త్రంలో మాస్టర్స్ చేశారు. అనంతరం స్థానికంగా ఉండే గ్రేటర్ అడ్జటంట్ జాతికి చెందిన పెద్ద కొంగలపై పీహెచ్‌డీ చేయాలనుకున్నారు. ఈ క్రమంలోనే అవి అంతరించిపోవడాన్ని గుర్తించారు. 2007 నుంచి వాటి సంరక్షణకు పాటుపడుతున్నారు. ఇందుకోసం 'హర్‌గిలా ఆర్మీ' పేరిట మహిళలతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఓ అంచనా ప్రకారం 2007లో అసోంలో మిగిలున్న 450 గ్రేటర్ అడ్జటంట్ కొంగల సంఖ్య 2023 నాటికి 1800కు పెరిగింది.

హథ్రాస్ తొక్కిసలాటలో భోలే బాబాకు క్లీన్ చిట్

లఖ్‌నవూ, ఫిబ్రవరి 21: ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాస్‌లో జరిగిన తొక్కిసలాటతో భోలే బాబాకు ఎలాంటి సంబంధం లేదంటూ న్యాయ విచారణ కమిషన్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఇందుకు కార్యక్రమ నిర్వాహకులు, స్థానిక అధికారులు, పోలీసులదే బాధ్యత అని తెలిపింది. గత ఏడాది జులై రెండో తేదీన విశ్వ హరి భోలే బాబా పాల్గొన్న సత్సంగ్‌లో తొక్కిసలాట జరగడంతో 121 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై విచారణ జరిపిన జ్యుడీషియల్ కమిషన్.. భక్తుల సంఖ్యకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయని నిర్వాహకులదే తప్పని తేల్చింది.

నన్ను తేలికగా తీసుకోవద్దు: షిండే



నాగ్‌పూర్, ఫిబ్రవరి 21: "నన్ను తేలికగా తీసుకోవద్దు. నన్ను ఒకసారి ఇలానే తేలికగా తీసుకుంటే 2022లో ప్రభుత్వమే మారిపోయింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది".. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నాగ్‌పూర్‌లో శుక్రవారం చేసిన వ్యాఖ్యలివి. నాకు సీఎం ఫడణవీస్‌కు మధ్య విభేదాలు లేవు. అంతా ఠండా ఠండా కూల్‌కూల్ అంటూ మూడు రోజుల క్రితం పేర్కొన్న షిండే మాటల్లో వచ్చిన మార్పు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో అంతర్యుద్ధం తీవ్ర స్థాయికి చేరిందనే ప్రచారానికి బలం చేకూర్చింది. బీజేపీ, శివసేన(షిండే వర్గం), ఎన్సీపీ(అజిత్ పవార్ వర్గం)తో కూడిన మహాయుతి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 288 స్థానాలకు గాను 230 స్థానాల్లో గెలిచి అధికారం చేపట్టింది. షిండేకు సీఎం పదవి ఇవ్వకపోవడంతో ఆయన వర్గం నేతల్లో కూటమిపై వ్యతిరేకత మొదలైంది. రాయ్‌గడ్, నాసిక్ నియోజకవర్గాల ఇన్‌చార్జి మంత్రుల నియామకం అంశంలో ఫడణవీస్, షిండే మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి.

భాష ఆధారంగా వివక్షకు యత్నం!



మరాఠీ సాహిత్య సమ్మేళన్‌లో మోదీ, పవార్

'హిందీ'పై రాజకీయ రచ్చ నేపథ్యంలో మోదీ ఆరోపణలు

త్రిభాషా ఫార్ములా అమలు చేయాల్సిందేనన్న కేంద్ర మంత్రి ప్రధాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి)/కడలూరు: భాష ఆధారంగా వివక్ష చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాని మోదీ శుక్రవారం అన్నారు. భారతీయ భాషల మధ్య ఎన్నడూ శత్రుత్వం లేదని, ఒకదానికొకటి ప్రభావితం చేసి, సుసంపన్నం చేసుకున్నాయని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా హిందీని బలవంతంగా రుద్దేందుకు కేంద్రం చూస్తున్నదనే రాజకీయ రచ్చ నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన్ ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ అపోహలు, తప్పుడు అభిప్రాయాలకు దూరంగా ఉండి, అన్ని భాషలను స్వీకరించడం మన సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మరోవైపు రాజకీయ కారణాలతో జాతీయ విద్యావిధానం అమలు చేయకపోవడం సరైంది కాదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. త్రిభాషా విధానాన్ని అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. దక్షిణాదిపై హిందీ భాషను రుద్దేందుకే ఈ సూత్రాన్ని ప్రవేశపెట్టారని, ఎన్ఈపీని అమలు చేస్తేనే సమగ్ర శిక్షా అభియాన్ నిధులు విడుదల చేస్తామనడం సరైంది కాదంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఇందుకు జవాబుగా ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం స్టాలిన్‌కు సందించిన లేఖలో త్రిభాషా ఫార్ములాకు, జాతీయ విద్యా విధానానికి అంతర్గత సంబంధం ఉందని స్పష్టం చేశారు. దీంతో ఈ ఫార్ములా పాటించని రాష్ట్రాలకు కేంద్ర నిధులు రావన్నది స్పష్టమవుతోంది!

తేనెతుట్టెపై రాళ్లు విసరొద్దు: స్టాలిన్

ప్రధాన్ వ్యాఖ్యలపై స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. తేనెతుట్టెపై రాళ్లు విసరొద్దని హెచ్చరించారు. తమిళ భాష, తమ రాష్ట్రం, ప్రజలకు హాని కలిగించే ఏ విధమైన కార్యకలాపాలను అనుమతించబోమని శుక్రవారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ స్పష్టం చేశారు. 'విద్యపై రాజకీయాలు చేస్తుంది ఎవరు? మీరా.. మేమా?' అని ప్రశ్నించారు. త్రిభాషా విధానాన్ని అమలు చేస్తేనే కేంద్ర నిధులను విడుదల చేస్తామని చెప్పడం బ్లాక్‌మెయిల్ కాదా? అని నిలదీశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

భం భం శివ...



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో విజయ్ కనకమేడల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'భైరవం'. కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై కథానాయికలు. 'భైరవం' థీమ్ సాంగ్‌ను చిత్ర బృందం శుక్రవారం విడుదల చేసింది. 'భం భం భం శివ...' అంటూ చైతన్య ప్రసాద్ సాహిత్యం, శివుని దైవిక సారాన్ని అందంగా ఆవిష్కరించింది. ఈ పాటకు శ్రీచరణ్ పాకాల సంగీతం అందించగా శంకర్ మహాదేవన్ అద్భుతంగా ఆలపించారు. బెల్లకొండ శ్రీనివాస్ పాత్ర శివ తాండవం స్ఫూర్తితో సమ్మోహన పరుస్తుంది. ఒక ఆలయం ముందు చిత్రీకరించిన సన్నివేశాలు పాటకు ఆధ్యాత్మికతను జోడించాయి.

ఈడీ తీరుపై శంకర్ ఆగ్రహం



'యందిరన్' (రోబో) తమిళ చిత్రం కథా చౌర్యానికి సంబంధించిన కేసులో రూ.10.11 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులపై దర్శకుడు శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'యందిరన్' చిత్రం నిర్మాణ సమయంలో ఆ చిత్ర కథా సంబంధిత వివాదంలో అక్రమ నగదు లావాదేవీలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై జరుగుతున్న విచారణలో భాగంగా ఆస్తులు జప్తు చేసినట్లు ఈడీ గురువారం తన ఎక్స్‌పేజీలో ప్రకటన వెలువరించింది. ఈ చర్యను శంకర్ తీవ్రంగా ఖండిస్తూ వివరణ ఇచ్చారు. 'యందిరన్' కథకు సంబంధించిన కేసులో పిటిషనర్ ఆరూర్ తమిళ్‌నాడాన్ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చిందని, ఆ కోర్టు తీర్పును విశ్వసించకుండా కేవలం ఫిర్యాదు ఆధారంగా ఈడీ తన ఆస్తులను జప్తు చేసిందని, ఈ చర్య చట్ట వ్యతిరేకమని, అధికారులు తమ చర్యలను పునః సమీక్ష జరుపుతారని తాను భావిస్తున్నానని చెప్పారు. జప్తు చర్యను ఉపసంహరించుకోకపోతే ఈడీ ఉత్తర్వును సవాలు చేస్తూ అప్పీలుకు వెళతానని శంకర్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మా సినిమాను బ్లాక్‌బస్టర్ చేయండి



'వీళ్లందరితో 'కోర్ట్' అనే సినిమా తీసి నేరం చేసింది నేనే. కావాలంటే నన్ను అరెస్ట్ చేసుకోండి. కానీ మా సినిమాను మాత్రం బ్లాక్‌బస్టర్ చేయండి' అంటూ చమత్కరించారు హీరో నాని. తన వాల్ పోస్టర్ సినిమా బేనర్‌పై ఆయన సమర్పించిన చిత్రం 'కోర్ట్ -స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించగా, రామ్‌జగదీశ్ దర్శకత్వంలో ప్రశాంతి త్రిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాత. మార్చి 14న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా యూనిట్ మీడియాతో ముచ్చటించింది. నాని మాట్లాడుతూ 'ఇలాంటి సినిమా తీసినందుకు గర్వపడుతున్నాను. దర్శి, రోషన్, శ్రీదేవి అద్భుతంగా నటించారు. కథ కోసం దర్శకుడు చాలా పరిశోధన చేశారు. ఇందులో కథే హీరో. సినిమా పూర్తయ్యాక ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొడతారు. ఇది నా గ్యారెంటీ. మీరంతా ఓ మంచి చిత్రం చూడబోతున్నారు. ప్రేక్షకులను మెప్పించే అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని చెప్పారు. ప్రియదర్శి మాట్లాడుతూ 'నాని అన్న బేనర్‌లో సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని కోరారు. 'నాని నమ్మకాన్ని వమ్ము చేయను. ఒక మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను' అని రామ్ జగదీశ్ అన్నారు. దర్శకుడు మంచి స్క్రిప్ట్‌తో అద్భుతమైన సినిమా తీశాడు అని దీప్తి గంటా తెలిపారు.

నాని

సరికొత్తగా ఎన్టీఆర్ పాత్ర



ఎన్టీఆర్ హీరోగా బాలీవుడ్‌లో స్ట్రెయిట్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'వార్ 2'. హృతిక్‌రోషన్ మరో కథానాయకుడిగా కనిపించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర అప్డేట్‌ను రచయిత అబ్బాస్ మీడియాతో పంచుకున్నారు. 'వార్ 2' చిత్రీకరణ దాదాపు పూర్తికావొచ్చిందని చెప్పారు. ఈ సినిమాలో యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయన్నారు. ఎన్టీఆర్ పాత్రను ఎవరూ ఊహించని విధంగా దర్శకుడు అయాన్ ముఖర్జీ తీర్చిదిద్దాడనీ, ప్రేక్షకుల అంచనాలకు అందదని తెలిపారు. హృతిక్‌రోషన్, టైగర్‌ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన 'వార్' చిత్రానికి ఇది కొనసాగింపు. యష్‌రాజ్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. అబ్బాస్ మాత్రం ఆగస్టు 25న 'వార్ 2' ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముందని చెప్పడం గమనార్హం.

రకుల్ సినిమా.. ఒక టికెట్ కొంటే మరొకటి ఫ్రీ!




మార్కెట్‌లో వన్ ప్లస్ వన్ ఆఫర్లు చాలా కనిపిస్తుంటాయి. ఒక వస్తువు కొంటే మరొకటి ఉచితం అన్నమాట. వస్తువుల అమ్మకాలు పెంచుకోవడానికి ఇటువంటి పద్ధతుల్ని అనుసరిస్తుంటారు. అయితే దీన్ని సినిమాకు కూడా వర్తింపజేస్తూ ఒక టికెట్ కొంటే మరొకటి ఉచితంగా ఇస్తామని ప్రకటించిన ఘనత బాలీవుడ్ సినిమాకే దక్కింది. రకుల్ ప్రీత్ సింగ్ కొత్త చిత్రం 'మేరే హజ్బెండ్‌కీ బీవీ' చిత్రం శుక్రవారం విడుదల అయింది. అర్జున్ కపూర్ హీరోగా నటించిన ఈ సినిమాలో భూమీ పెడ్నేకర్ మరో కథానాయిక. ఒక పక్క 'ఛావా' చిత్రం బాక్సాఫీసు దుమ్ము దులుపుతోంది కనుక తమ సినిమాకు ప్రేక్షకులను రప్పించడం కోసం వన్ ప్లస్ వన్ ఆఫర్‌ను ప్రకటించారు 'మేరే హజ్బెండ్ కీ బీవీ' చిత్ర నిర్మాతలు. అయినా సరే కలెక్షన్లు అంత ఆశాజనకంగా లేవని అంటున్నారు. పాజిటివ్ రివ్యూలు వచ్చాయి కనుక వసూళ్లు మరింత పెరగవచ్చనే ఆశతో నిర్మాతలు ఉన్నారు. చిన్న సినిమాలకు బాలీవుడ్‌లోనూ కష్టాలు ఉన్నాయన్న మాట!

సౌరవ్ గంగూలీ బయోపిక్



టీమిండియా మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ బయోపిక్ గురించి చాలా రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అభిమానులు కూడా ఈ మూవీపై ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. తాజాగా సినిమా గురించి గంగూలీ అధికారిక ప్రకటన చేశారు. దీంతో ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తన బయోపిక్‌లో బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు నటించనున్నట్లు చెప్పారు. అయితే ఆర్టిస్టుల డేట్స్ కారణంగా ఆలస్యం అవుతోందని మరో ఏడాది పాటు ఆగాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, రాజ్‌కుమార్ రావు తాజా చిత్రం 'స్త్రీ-2' ఇటీవలె విడుదలై ఘన విజయం సాధించింది. ప్రస్తుతం భూల్ చూక్ మాఫ్, టోస్టర్, మాలిక్ చిత్రాలతో రాజ్‌కుమార్ బిజీగా ఉన్నారు.

'లెవెన్' కోసం ఆండ్రియా ఆట, పాట



నవీన్‌చంద్ర హీరోగా నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. లోకేశ్ అజ్ల్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం శ్రుతి హాసన్ పాడిన 'ద డెవిల్ ఈజ్ వెయిటింగ్' సాంగ్ ఇప్పటికే విడుదలై ఆకట్టుకుంది. తాజాగా ఇప్పుడు ఆండ్రియా జెర్మియా ఆలపించడంతో పాటు నర్తించిన ప్రత్యేక గీతం 'ఇక్కడ రా' పాటను విడుదల చేశారు. రాకేందు మౌళి రాసిన ఈ పాటకు డి. ఇమ్మాన్ స్వరాలు అందించారు. రేయా హరి హీరోయిన్‌గా నటిస్తున్న 'లెవెన్' చిత్రం వేసవిలో విడుదల కానుంది.

అతిథి పాత్రలో



సుహాస్, మాళవిక మనోజ్ జంటగా రామ్ గోదల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. వి ఆర్ట్స్ బ్యానర్‌పై హరీష్ నల్ల నిర్మిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నారు. ఈ పాత్ర ఆయన చేస్తేనే బావుంటుందని భావించిన మేకర్స్ హరీష్ శంకర్‌ను ఒప్పించారు. ఆయన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను ఇటీవలె పూర్తి చేశారు. నిర్మాత హరీష్ నల్ల మాట్లాడుతూ 'ఈ చిత్రం సుహాస్ కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుంది. ఎక్కడా రాజీ పడకుండా ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించబోతున్నాం. అడగ్గానే మా చిత్రంలో అతిథి పాత్రలో నటించిన హరీష్ శంకర్‌కు కృతజ్ఞతలు' అని అన్నారు.

ఐదేళ్లూ ప్యాలెస్‌కే పరిమితమై
ఇప్పుడు మిర్చి యార్డులో గగ్గోలెందుకు?: అచ్చెన్న

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. ఐదేళ్లూ ప్యాలెస్‌కు పరిమితమై నేడు మిర్చి యార్డులో గగ్గోలెందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం చేశారు. రాష్ట్రాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టారు. ప్రజలు కూటమికి అధికారం ఇచ్చిన 8 నెలల్లోనే సీఎం చంద్రబాబు వ్యవస్థలన్నింటినీ గాడిలోకి తీసుకు వస్తున్నారు. ఆయన హయాంలో రూ.7 వేలు మాత్రమే మద్దతు ధర ఇచ్చి ఇప్పుడు మిర్చి రైతులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని అనటం ఎంతవరకు సమంజసం?' అని మంత్రి అచ్చెన్న మండిపడ్డారు.

రైతు సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదు: బొత్స


విశాఖపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. విశాఖపట్నంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 'మా పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి రైతులను పరామర్శించడం చట్టవ్యతిరేక కార్యక్రమంగా చిత్రీకరించడం దుర్మార్గం. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా వెళ్లకూడదని అంటున్నారు. అలాగైతే విజయవాడలో మ్యూజికల్ నైట్‌కు చంద్రబాబు ఎలా హాజరయ్యారో చెప్పాలి. జగన్మోహన్‌రెడ్డి గుంటూరు పర్యటన తరువాతే రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతుల సమస్యలపై దృష్టి పెట్టింది. చంద్రబాబుకు రైతు సమస్యల పట్ల, వ్యవసాయం అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదు. షర్మిల పార్టీ విధానాలపై మాట్లాడితే స్పందిస్తాం. వ్యక్తిగత అజెండాలకు రాజకీయాల్లో తావు లేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా యూనివర్సిటీలకు వీసీలను నియమించారు. దానిని వైసీపీ ప్రశ్నించలేదు. గ్రూప్-2 రోస్టర్ పాయింట్ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం' అని బొత్స అన్నారు.

వంశీ కస్టడీ, సౌకర్యాలపై 24కు తీర్పు వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పోలీసు కస్టడీ, జైలులో సదుపాయాల కల్పన పిటిషన్లపై విజయవాడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు తీర్పును ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. వంశీని పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. అదేవిధంగా తనకు ఇంటి నుంచి భోజనం, మంచం ఏర్పాటు చేయాలని వంశీ పిటిషన్ దాఖలు చేశారు.

వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌పై కేసా?: అజీజ్

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో భాగంగా కబ్జాదారులపై నమోదు చేయాల్సిన కేసును ఆస్తుల పరిరక్షణలో భాగంగా ఉన్న ఇన్‌స్పెక్టర్‌పై నమోదు చేశారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మండిపడ్డారు.



మిర్చి రైతుకు కేంద్రం అండ!

క్వింటాలుకు రూ.11,600 కంటే ఎక్కువ ఇవ్వాలని అడిగాం

- మార్కెట్ రేటు, పెట్టుబడి వ్యయానికి మధ్య వ్యత్యాస భారం కేంద్రం పైనే
- ఎంఐఎస్‌ను 75శాతం పొడిగించేందుకు చర్యలు: కేంద్ర మంత్రి రామ్మోహన్
- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీ





న్యూఢిల్లీ/అమరావతి/శ్రీకాకుళం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మిర్చి కొనుగోళ్లకు సంబంధించి మార్కెట్ రేటుకు, పెట్టుబడి వ్యయానికి మధ్య వ్యత్యాసాన్ని భరిస్తామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టమైన హామీ ఇచ్చారని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం(ఎంఐఎస్) కింద మిర్చి కొనుగోళ్లను 25శాతం నుంచి 75శాతం వరకు పొడిగించేందుకు కమిటీ ఆఫ్ మినిస్టర్స్ ద్వారా అనుమతి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలోని కృషిభవన్‌లో మిర్చి రైతుల సమస్యలపై చర్చించేందుకు శివరాజ్‌సింగ్ చౌహాన్, రామ్మోహన్‌నాయుడు, కేంద్ర వ్యవసాయ అధికారులతో పాటు గుంటూరుకు చెందిన మిర్చి రైతు బండారు శ్రీనివాసరావు భేటీ అయ్యారు. రాష్ట్ర వ్యవసాయ అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ భేటీ అనంతరం రామ్మోహన్‌నాయుడు మీడియాతో మాట్లాడారు. మిర్చి రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని శివరాజ్‌సింగ్‌ను కోరినట్లు తెలిపారు. మిర్చి ఉత్పత్తి వ్యయాన్ని లెక్కిస్తే క్వింటాలుకు రూ.11,600 వచ్చిందని, అయితే అంతకంటే ఎక్కువ మొత్తంలో రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. మిర్చి ఉత్పత్తి వ్యయ ధరను పెంచాలని ఐసీఏఆర్ అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారని చెప్పారు. మిర్చి ఎగుమతులను ప్రోత్సాహించేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలు, వాటి అమలుపైనా చర్చించామని తెలిపారు. త్వరలో రాష్ట్రంలో మిర్చి రైతులు, ఎగుమతిదారులతో ఒక సదస్సు ఏర్పాటుచేసి, వారి సమస్యలు తెలుసుకుని, సహాయం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. తక్షణమే మిర్చి ఎగుమతులను పెంచడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానించడంపై వచ్చే సలహాలు, సూచనలు అమలు చేస్తామని శివరాజ్‌సింగ్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కాగా, మిర్చికి మద్దతు ధర ప్రకటించాలని రైతు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మిర్చికి నల్ల తామర సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కేంద్రం తక్షణమే దీని నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, మిర్చి ఉత్పత్తి వ్యయం క్వింటాలుకు రూ.11,600గా లెక్కించగా, దీనికి అదనంగా కూలీ రేట్లు, రవాణా ఖర్చులు పెరిగిన విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పూర్తి వివరాలు పంపితే, ఐసీఏఆర్‌తో సమీక్షించి, ఉత్పత్తి వ్యయాన్ని నిర్ధారించి, ధరలో వ్యత్యాసానికి సాయం చేయడం ద్వారా రైతులను ఆదుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారన్నారు. అలాగే మిర్చి ఎగుమతులకు చర్యలు తీసుకుంటామని చెప్పారని వివరించారు.

కుంభమేళాకు తెలుగు ప్రవాసీలు!

- ఎడారి దేశం నుంచి పెద్ద సంఖ్యలో రాక
- యూపీ ప్రభుత్వ ఏర్పాట్లపై భక్తుల సంతృప్తి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ న్యూస్)



నిత్య యాంత్రిక జీవనం, భిన్న సంస్కృతులుండే గల్ఫ్ దేశాల నుంచి తెలుగు ప్రవాసీ భక్తులు ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు తరలి వెళ్తున్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో భక్తిప్రపత్తులతో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఎడారి పెట్రో దినార్ల నుంచి బయటపడి మాతృదేశంలో ఆధ్యాత్మికతను ఆస్వాదిస్తున్నారు. ప్రభుత్వ ఏర్పాట్లు బావున్నాయని ప్రశంసిస్తున్నారు. ప్రయాగ్‌రాజ్, వారణాసి, ఆయోధ్య తీర్థ స్థలాల సందర్శన అనంతరం తిరిగి గల్ఫ్‌కు వస్తున్నారు. ఎటు చూసినా జనసముద్రంలా కనిపించే గంగ, యమున, సరస్వతి త్రివేణి సంగమంలో స్నానం ఆచరించడం తన జీవిత కాలపు స్వప్నమని సౌదీ అరేబియాలో పని చేసే టి.మల్లికార్జున్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. స్నానఘట్టాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రభుత్వం చేసిన ముందస్తు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. త్రివేణి సంగమంలో స్నానం అనంతరం అయోధ్యలో రేయింబవళ్లు అనే తేడా లేకుండా జనజాతరలో కలిసి శ్రీరాముడిని దర్శించుకోవడం వర్ణనాతీతమని దుబాయ్‌లో పని చేసే ఏపీలోని తణుకుకు చెందిన వేగ్నస్న శివరామకృష్ణ భావోద్వేగపూరితంగా చెప్పారు. తన జీవితంలో ఇసుకేస్తే రాలనంతగా జనాలను చూడడం ఇదే ప్రథమమని ఖతర్‌లో నివాసముండే హైదరాబాద్‌కు చెందిన సాయి సుధ పేర్కొన్నారు. త్రివేణి సంగమంలో స్నానం చేయడం ద్వారా తాను పొందిన ఆధ్యాత్మిక అనుభూతి అమూల్యమని ఖతర్‌లో పనిచేసే కరీంనగర్‌కు చెందిన వెలదండి-రుచికలు చెప్పారు.

అరెస్టుతో ఒక్క రోమమూ ఊడదు

- వైసీపీ ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు
- 'కృష్ణా' ఎస్పీ కనుసన్నలో ఇదంతా: పేర్ని నాని

విజయవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు, వారి కుటుంబ సభ్యుల ఫోన్లను పోలీసులు ట్యాప్ చేస్తున్నారని మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. గ్రామస్థాయి నాయకులు, వారి సతీమణుల ఫోన్ నంబర్లను ప్రైవేటు వ్యక్తులు సేకరిస్తున్నారని చెప్పారు. విజయవాడ జిల్లా జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఆయన శుక్రవారం ములాఖత్‌లో కలిశారు. అనంతరం జైలు వద్ద మీడియాతో మాట్లాడారు. 'నా ఫోన్‌ను ట్యాప్ చేయడమే కాకుండా... అనధికారికంగా కొంతమంది వైసీపీ నేతలు, కార్యకర్తల ఫోన్ నంబర్లనూ సేకరిస్తున్నారు. ట్యాపింగ్‌లకు భయపడను. చంద్రబాబు బంధువు ప్రకాష్ అనే ఒక వ్యక్తి విజయవాడలో అనధికారికంగా సిబ్బందిని నియమించుకుని ఫోన్లు చేసి వైసీపీ నేతలను బెదిరించాలని చూస్తున్నారు. రమేశ్ ఆస్పత్రి దగ్గర కార్యాలయం పెట్టి అనధికారికంగా ఫోన్లను ట్యాప్ చేస్తున్నారు. ఇదంతా కృష్ణా జిల్లా ఎస్పీ కనుసన్నల్లో జరుగుతోంది. వంశీ కేసులో ఉన్నతాధికారుల పర్యవేక్షణతో పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. ఊహాజనిత ఫిర్యాదుతో ఆయనపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేసి ఆ కోర్టులో కాకుండా మరో కోర్టులో ఆయన్ను రిమాండ్‌కు పెట్టారు. గుంటూరు మిర్చి యార్డులో జగన్ పర్యటన సమయంలో నేను మచిలీపట్నంలో ఉంటే గుంటూరు వెళ్లానని కేసు నమోదు చేశారు' అని మండిపడ్డారు. మంత్రి కొల్లు రవీంద్రపై విమర్శలు గుప్పించారు. పదేపదే తనను, కొడాలి నానిని అరెస్టు చేయిస్తామని చెబుతున్నారని.. 6 నెలలుగా మచిలీపట్నం రహదారులపై తిరుగుతున్నానని, రవీంద్ర చేయించే బొంగులో అరెస్టుతో తన రోమం ఊడదన్నారు.

పవన్ కల్యాణ్ ఫొటోలు మార్ఫింగ్

- నరసరావుపేట, విజయవాడల్లో కేసులు నమోదు

నరసరావుపేట లీగల్, విజయవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి అభ్యంతరకరంగా పోస్టులు పెట్టారని జనసేన కార్యకర్త ఏ ఆనంద్ ఫిర్యాదు చేశారు. పవన్ కల్యాణ్ ఇటీవల కుంభమేళాలో పవిత్ర స్నానం చేసిన సమయంలో తీసిన ఫొటోలను మార్ఫింగ్ చేసి జగనన్న సైన్యం పేరుతో సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టారని, చర్యలు తీసుకోవాలని నరసరావుపేట పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. కాగా ఇదే అంశంపై నలుగురు జనసేన నేతలు విజయవాడ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

డీజీ అంజనీకుమార్‌ను రిలీవ్ చేయండి

- తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం కీలక ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఉన్న అంజనీకుమార్‌ను వెంటనే రిలీవ్ చేయాలని శుక్రవారం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తెలంగాణలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఆయనతోపాటు, ప్రస్తుతం కరీంనగర్ సీపీ గా పనిచేస్తున్న అభిలాష బిస్త్, టీజీ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న అభిషేక్ మహంతిలను కూడా రిలీవ్ చేయాలని సూచించింది. వారిని 24 గంటల్లో ఏపీ క్యాడర్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

ఫైబర్ నెట్లో ఏం జరుగుతోంది!



మంత్రి జనార్దనరెడ్డి

- పంచాయితీపై రంగంలోకి సర్కారు
- జీవీ రెడ్డి ఆరోపణలపై ప్రభుత్వం సీరియస్
- మంత్రి జనార్దనరెడ్డితో కార్యదర్శి యువరాజ్, ఎండీ దినేశ్ భేటీ
- తన ఆరోపణలకు ఆధారాలతో మంత్రికి వివరణ ఇచ్చిన జీవీ రెడ్డి



జీవీ రెడ్డి



దినేశ్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఫైబర్ నెట్ మేనేజింగ్ డైరెక్టర్ దినేశ్‌కుమార్‌పై ఆ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి చేసిన రాజద్రోహం ఆరోపణలు ప్రభుత్వాన్ని ఇరుకున పడేశాయి. ఈ వ్యవహారంలో నిజానిజాలు రాబట్టేందుకు వీలుగా సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ దినేశ్ కుమార్‌లను వ్యక్తిగతంగా వివరణాత్మకంగా ఆధారాలతో కూడిన సంజాయిషీ ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం కోరింది. గురువారం నాడు ఫైబర్‌నెట్ ఎండీ దినేశ్‌కుమార్‌పై సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి చేసిన ఆరోపణలు శుక్రవారంనాడు పత్రికల్లో పతాకస్థాయిలో ప్రచురితం కావడంతో.. ఏం చేయాలో తేల్చుకోలేక ప్రభుత్వ పెద్దలు మల్లగుల్లాలు పడ్డారు. దీంతో.. అసలేం జరుగుతుందనే దానిపై వాస్తవాలను ప్రభుత్వానికి తెలియజేసే బాధ్యతను మంత్రి బీసీ జనార్దనరెడ్డికి అప్పగించారు.

తొలగించినా జీతాలు: జీవీ రెడ్డి

ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన వెంటనే శుక్రవారమే మంత్రి బీసీ జనార్దనరెడ్డి రంగంలోకి దిగారు. ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరపకుండానే నేరుగా మీడియా ముందు ఫైబర్‌నెట్ ఎండీ దినేశ్‌కుమార్ రాజద్రోహం చేసినట్లుగా ఆరోపణలు ఎందుకు చేశారంటూ జీవీ రెడ్డిని మంత్రి అడిగారు. గడచిన కొద్దినెలలుగా దినేశ్‌కుమార్ తనకు సహకరించడం లేదంటూ జీవీ రెడ్డి వివరించారు. తాను మీడియా ముందు మాట్లాడిన ప్రతి మాటకూ ఆధారాలున్నాయని ఆయన మంత్రికి తెలిపారు. గత ప్రభుత్వ హాయంలో వాట్సప్ మెసేజ్ ఆధారంగానే ఉద్యోగాలు ఇచ్చేశారని జీవీరెడ్డి గుర్తు చేశారు. అసలు నియామక పత్రాలు లేని 410 మందిని తొలగించేందుకు ఎలాంటి అభ్యంతరాలూ లేనప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చాక తొమ్మిది నెలలుగా వారిని కొనసాగిస్తూనే జీతభత్యాలు చెల్లిస్తున్నారని ఎండీపై జీవీ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో ఇన్‌కమ్‌టాక్స్, జీఎస్టీ అంశాలపైనా జీవిరెడ్డి తన వాదనలు వినిపించారు. తాను ఇప్పటికే.. తన వాదనను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, మౌలిక సదుపాయాల కార్యదర్శి యువరాజ్‌కు వెల్లడించానని జీవీ రెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. ఫైబర్‌నెట్ ఆర్థికంగా బలోపేతం కావాలంటే ఎండీ దినేశ్‌కుమార్‌ను బదిలీ చేయాలని మంత్రికి సూచించారు. వీటన్నింటిపై ఆధారాలతో కూడిన సంజాయిషీ ఇవ్వాలని జీవీ రెడ్డిని మంత్రి జనార్దనరెడ్డి కోరారు. దీంతో.. జీవీ రెడ్డి తన వద్దనున్న ఆధారాలతో కూడిన నివేదికను శుక్రవారం మధ్యాహ్నానికి మంత్రికి అందజేశారు.

జీఎస్టీ వ్యవహారాలు కన్సల్టెన్సీ పనే: దినేశ్

శుక్రవారం మధ్యాహ్నం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ఫైబర్ నెట్ ఎండీ దినేశ్ కుమార్ కలిశారు. ఈ సమావేశానికి ఐఅండ్ఐ కార్యదర్శి యువరాజ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీకూ, చైర్మన్‌కు మధ్య విబేధాలు ఎందుకు వస్తున్నాయని దినేశ్ కుమార్‌ను మంత్రి ప్రశ్నించారు. ప్రభుత్వ శాఖలలోని కీలకమైనవారే మీడియా ఎదుటకు వచ్చి రచ్చచేస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ ఏం కావాలని అడిగారు. దీనిపై దినేశ్‌కుమార్ తన వాదనలు వినిపించారు. గతంలో జీఎస్టీ వ్యవహారాలు చూస్తున్న కన్సల్టెన్సీ సంస్థ ఫీజును తీసుకుంటున్నందున.. సకాలంలో చెల్లింపులు జరిగేలా చూసే బాధ్యత ఆ సంస్థదేనని దినేశ్‌కుమార్ వివరించారు. ఆదాయపు పన్ను విషయంలోనూ ఇదే వర్తిస్తుందని దినేశ్ కుమార్ వెల్లడించారు. ఆయన వాదన విన్నాక.. ఈ అంశాలన్నింటిని లిఖిత పూర్వకంగా ఆధారాలతో సహా.. సంజాయిషీని ఇవ్వాలని దినేశ్ కుమార్‌ను మంత్రి ఆదేశించారు. శనివారం నాటికి సంజాయిషీని అందజేస్తానని మంత్రికి దినేశ్‌కుమార్ చెప్పారు.

ప్రభుత్వానికి తలనొప్పిగా 'ఫైబర్' లడాయి

ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు చేయకుండా నేరుగా దినేశ్‌కుమార్‌పై సంస్థ చైర్మన్ జీవీరెడ్డి మీడియా సమక్షంలో తీవ్ర ఆరోపణలకు దిగడంపై ఇటు రాజకీయవర్గాల్లోనూ.. అటు ఆలిండియా సర్వీసు వర్గాల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమ కార్యనిర్వాహక అధికారాలను గుంజుకునేందుకు చైర్మన్లు ప్రయత్నిస్తే ఎలా ఆమోదిస్తామంటూ కార్పొరేషన్ల ఎండీలు కొందరు ప్రశ్నిస్తున్నారు. అంతగా కావాలనుకుంటే ఎండీలుగా ఐఏఎస్‌లను కాకుండా.. రాజకీయ నేతలనే ప్రభుత్వం నియమించుకోవచ్చు కదా అంటూ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కొందరు ఐఏఎస్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో తామేమీ కార్యనిర్వహణాధికారాలను కోరుకోవడం లేదని.. చైర్మన్లు చెబుతున్నారు. ఈ తరుణంలో.. గురువారం నాడు ఫైబర్‌నెట్ ఎండీపై చైర్మన్ తీవ్రమైన ఆరోపణలు చేయడంతో.. ప్రభుత్వ పెద్దలు రంగంలోకి దిగారు. ఇలాంటి వాటికి పరిష్కారం చూపేందుకు సిద్ధమవుతున్నారు.

సజ్జల సామ్రాజ్యంలో కొనసాగుతున్న సర్వే

- 55 ఎకరాల అటవీ భూముల ఆక్రమణపై ఆర్డీవో బృందం ప్రత్యక్ష పరిశీలన
- నేడు, రేపు కూడా అధికారుల సర్వే



శుక్రవారం సజ్జల ఎస్టేట్‌లో సర్వేచేస్తున్న అధికారులు

కడప, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జగన్ జమానాలో ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు అటవీ భూములను ఆక్రమించుకున్న వ్యవహారంలో అటవీ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. కడప శివారులోని సీకే దిన్నె మండలం రెవెన్యూ పొలం 1599, 1600/1, 2, 1601/1, 1ఎ, 1-2.. తదితర సర్వే నంబర్లలో సజ్జల రామకృష్ణారెడ్డి సోదరులు సజ్జల దివాకర్‌రెడ్డి, జనార్దనరెడ్డి, ఇతర కుటుంబసభ్యుల పేరుతో సుమారు 200 ఎకరాల భూములున్నాయి వీటిలో కొన్ని పట్టా భూములు, చుక్కల భూములు, ఇతరత్రా ఉన్నాయి. అయితే ఇక్కడే సర్వే నంబరు 1629లో 11,129.33 ఎకరాల అటవీ భూమి ఉంది. కడపలోని పలువురు ప్రముఖులు ఇక్కడ ఫామ్‌హౌస్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. సజ్జల బ్రదర్స్ మంచి ఎస్టేట్ ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 55 ఎకరాల అటవీశాఖ భూములను కూడా ఇందులో కలిపేసుకున్నారు. ఆక్రమిత భూముల్లో మామిడి, నేరేడు సాగు చేస్తున్నారు. ఈ ఆక్రమణలపై ఆంధ్రజ్యోతి 'రిజర్వు ఫారెస్టులో సజ్జల సామ్రాజ్యం' అంటూ జనవరి 2వ తేదీన కథనం ప్రచురించింది. దీనిపై ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశించింది. అటవీ శాఖ భూములు ఆక్రమణకు గురైనట్లు నివేదికలు అందాయి. కానీ, అవి తమవి కాదని అటవీ శాఖ చెబుతూ వచ్చింది. ఇంతలో సజ్జల బ్రదర్స్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు సర్వేకు ఆదేశించింది. గురువారం సీకే దిన్నె తహశీల్దార్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించగా.. శుక్రవారం కడప ఆర్డీవో జాన్ ఎర్విన్ ఇతర అధికారులు ఈ భూములను ప్రత్యక్షంగా పరిశీలించారు. సజ్జల కుటుంబ సభ్యులు సజ్జల జనార్దనరెడ్డి, సందీప్‌రెడ్డి హాజరయ్యారు. కాగా, శని, ఆదివారాల్లో కూడా మరోసారి సర్వే నిర్వహించి.. అటవీ శాఖ భూముల సరిహద్దులను గుర్తించి పూర్తి నివేదికను న్యాయస్థానానికి అధికారులు అందజేయనున్నారు.

ప్రభుత్వ భూమిలో 'ఆకేపాటి ఎస్టేట్'!

- రాజంపేట వైసీపీ ఎమ్మెల్యేకు జేసీ నోటీసులు
- భూఆక్రమణపై నేడు విచారణకు రావాలని ఆదేశం



ఆక్రమించిన భూముల్లో ఆకేపాటి అమరనాథరెడ్డి నిర్మించిన విలాసవంతమైన భవనం

రాజంపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాజంపేట వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మెడకు భూకబ్జాల వివాదం చుట్టుకుంది. ఆయన జగన్ ప్రభుత్వ హయాంలో తన స్వగ్రామమైన రాజంపేట మండలం ఆకేపాడు, మందపల్లి గ్రామాల్లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి 'ఆకేపాటి ఎస్టేట్' పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజంపేట టీడీపీ మండల అధ్యక్షుడు పెన్నె సుబ్బనరసయ్య నాయుడు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి భూ కబ్జాలకు పాల్పడి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో కలెక్టర్ శ్రీధర్ ఈ విచారణ బాధ్యతలను రాజంపేట సబ్ కలెక్టర్ నిధియా దేవికి అప్పగించారు. దరిమిలా రెవెన్యూ, సర్వే అధికారులు ఇటీవల విచారణ పూర్తి చేశారు. మందపల్లి రెవెన్యూ భూమిలోని సర్వే నంబరు 814/3లో 4 ఎకరాలు, 814/4లో 5 ఎకరాలు, 815/1లో 3.79 ఎకరాలు, 815/2లో 5 ఎకరాలు, 816/2 4.13 ఎకరాలు.. అలాగే ఆకేపాడు రెవెన్యూ భూమిలోని సర్వే నంబరు 56/1లో 5 ఎకరాలు, 56/8లో 5.68 ఎకరాలు, 56/9లో 2.35 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులు ఆక్రమించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సంబంధిత నివేదికను రాజంపేట సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో తహశీల్దార్ పీర్‌మున్నీ కలెక్టర్‌కు సమర్పించారు. అమరనాథరెడ్డి, ఆయన భార్య జ్యోతమ్మ, సోదరుడు అనిల్‌కుమార్‌రెడ్డి, ఆయన భార్య సృజన పేరుతో దాన విక్రయాల పేరిట తప్పుడు రికార్డులు సృష్టించి రిజిస్టర్ చేయించుకున్నట్లు నివేదించారు. దీనిపై శనివారం విచారణకు రావాలని జాయింట్ కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. కాగా, ఆక్రమించిన ప్రభుత్వ భూముల్లో ఓ చిన్నగుట్టపై ఆకేపాటి ఎస్టేట్ పేరిట ఎమ్మెల్యే విలాసవంతమైన భవనం నిర్మించుకున్నారు. విలాసవంతమైన స్విమ్మింగ్ పూల్, గుర్రపు శాలలు.. పాఠశాల....టీటీడీ కల్యాణ మండపం, సమావేశ మందిరం, గోశాల, కొన్ని కుటీరాలు నిర్మించారు. కొంత భూమిలో వాణిజ్య పంటలు సాగుచేస్తున్నారు.

టీటీడీ ఉద్యోగికి బోర్డు సభ్యుడి క్షమాపణ

▸ మహాద్వారం వివాదానికి తెర

తిరుమల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఉద్యోగిపై బోర్డు సభ్యుడు విరుచుకుపడిన వివాదానికి తెరపడింది. బాధిత ఉద్యోగికి టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్ కుమార్ క్షమాపణ చెప్పారు. ఇటీవల దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వస్తున్న టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు నరేశ్ తనకు మహాద్వారం గేటు తీయలేదని విధుల్లో ఉన్న టీటీడీ ఉద్యోగి బాలాజీసింగ్‌పై తిట్లదండకంతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. దీనిపై ఉద్యోగ సంఘాలు నిరసనలు వ్యక్తం చేశాయి. రాజకీయ పార్టీలు కూడా బోర్డు సభ్యుడిని సస్పెండ్ చేయాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, శాంతారామ్ ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి ఉద్యోగి బాలాజీ, బోర్డు సభ్యుడు నరేశ్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఉద్యోగి బాలాజీ మీడియాతో మాట్లాడారు. ఘటనపై ఉద్యోగి బాలాజీ, అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులతో మాట్లాడి పరిష్కరించుకున్నామని బోర్డు సభ్యుడు నరేశ్ చెప్పారు. మరోసారి పొరపాటు జరగదని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమిస్తున్నామని టీటీడీ ఉద్యోగ సంఘ నాయకుడు వెంకటేశ్ చెప్పారు.

పంచాయతీల్లో ఇంటింటా మళ్లీ చెత్త సేకరణ

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ప్రతి ఇంటి నుంచీ మళ్లీ చెత్త సేకరణ ప్రారంభించాని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన డీపీఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని పంచాయతీల్లో శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం చేపట్టి, గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా చెత్త సేకరణ అలవాటు చేయాలన్నారు.

మెరుగైన వైద్యసేవలకు 30 సూత్రాల ఎజెండా!

▸ ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి టార్గెట్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలందించే లక్ష్యంతో మంత్రి సత్యకుమార్ యాదవ్ 30 అంశాలతో కూడిన ఎజెండాను రూపొందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి వివిధ సమీక్షల్లో సీఎం చంద్రబాబు చేసిన ఆదేశాలు, ఆలోచనలు, వైద్య సేవలు, శాఖ పనితీరుపై మంత్రి చేసిన సమీక్షల్లో వెల్లడైన అంశాల ఆధారంగా ఈ ఎజెండా రూపొందించారు. ఆయా అంశాలపై నిర్దిష్ట కాలపరిమితుల మేరకు నిరంతర ప్రయాస, పనితీరు, ఫలితాల సమీక్షలు జరపాలని ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబును ఆదేశించారు. వీటిలో ముఖ్యంగా ఆరోగ్యరంగానికి సంబంధించి స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ లక్ష్యం మేరకు ప్రజలందరి భాగస్వామ్యం ఉండాలని, ఆ దిశగా వారికి అవగాహన కల్పించాలని అజెండాలో పొందుపరిచారు. 'వాట్సాప్ ద్వారా ప్రజలకందించే వైద్య సేవల్ని గుర్తించి తగు చర్యల్ని చేపట్టాలి. వైద్య సేవల్లో కృత్రిమ మేధ పూర్తి వినియోగ అవకాశాల్ని గుర్తించి ఆ మేరకు చర్యలు చేపట్టడంతో పాటు డిజిటల్ వైద్య సేవల్ని విస్తృతం చేయాలి. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వ సాయాన్ని రాబట్టాలి. వివిధ విభాగాధిపతుల, వైద్యులు, అధికారుల పనితీరును నిష్పక్షపాతంగా ఫలితాల ప్రాతిపదికన మదింపు చేయాలి' వంటి అంశాలను ఎజెండాలో పొందుపరిచారు. అలాగే, 175 నియోజకవర్గాల్లో స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుతో పాటు హైబ్రిడ్ విధానంలో రూ.25 లక్షల బీమాను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా త్వరలో ప్రవేశపెట్టాలన్నారు.

ఏపీలో డైనమిక్ సీఎం: కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'సొంత రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో తెలిసిన డైనమిక్ సీఎం ఏపీలో ఉన్నారు. దూరదృష్టితో కూడిన ఆయన ఆలోచనలకు మద్దతిచ్చే నరేంద్ర మోదీ ఢిల్లీలో ఉన్నారు. డబులింజన్ సర్కార్‌తో అటు దేశం, ఇటు రాష్ట్రం రెండూ ప్రగతి పథంలో దూసుకెళ్తున్నాయి' అని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ అన్నారు. గురువారం విజయవాడలో స్థానిక బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి రాష్ట్రంలోని మేధావులు, వర్తకులు, ఆర్థిక నిపుణుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో పనిచేస్తోన్న నరేంద్ర మోదీ దేశంలోని అన్ని రాష్ట్రాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉన్న ఏపీపై మరింత ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. ఇక్కడి సీఎం నిధులు అడగ్గానే బడ్జెట్‌లో కేటాయించినవి కాకుండా అదనంగా అభివృద్ధికి విడుదల చేస్తున్నారు' అని హర్దీప్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నేతలు పాతూరి నాగభూషణం, అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరుపతికి సీఎం చంద్రబాబు

రేణిగుంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదివారం తిరుపతి జిల్లాకు రానున్నారు. రేణిగుంట మండలం తూకివాకం సమీపంలోని ఓ కల్యాణ మండపంలో జరిగే యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరు కానున్నారు.

టమాటా రైతులను ఆదుకున్న ప్రభుత్వం

▸ 9 జిల్లాల్లో 102 టన్నులు కొనుగోలు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టమాటా ధరలు పతనం కావడంతో రైతుల నుంచి నేరుగా కొనుగోళ్లను ప్రభుత్వం ప్రారంభించింది. శుక్రవారం 102 టన్నుల టమాటాలను మార్కెటింగ్ శాఖ కొనుగోలు చేసింది. అనంతపురం, కర్నూలు, చిత్తూరు, శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, అనకాపల్లి, విశాఖ రూరల్, కృష్ణా జిల్లాల రైతుల నుంచి టమాటాలను కొనుగోలు చేశారు. ఉత్తరాంధ్ర టమాటాలను విశాఖపట్నం నగరంలోని రైతుబజార్లకు, కృష్ణా జిల్లా సరుకును విజయవాడకు, రాయలసీమ సరుకును విజయవాడ, గుంటూరు, ఒంగోలు రైతుబజార్లకు తరలించారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో టమాటాలకు అతి తక్కువ ధర పలుకుతున్నందున అక్కడి రైతులకు కిలోకి రూ.8 చొప్పున చెల్లించి, కొనుగోలు చేశారు. రైతుబజార్లలో లాభనష్టాలు లేకుండా టమాటాలను విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టమాటాల కొనుగోళ్లపై మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లతో మరోసారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని ఆదేశించారు.

వరద నీరూ మా ఖాతాలోనే వేస్తారా?

▸ సముద్రంలోకి వదిలేస్తే మేం వాడుకున్నట్లా?

▸ కృష్ణా బోర్డుకు ఏపీ ఈఎన్‌సీ ప్రశ్నలు

▸ సోమవారం దాకా నీటి విడుదల కొనసాగిస్తామన్న చైర్మన్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గతేడాది కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద వచ్చిందని.. ఈ నీటినంతటినీ దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు వదిలేశారని.. దాన్ని తాము వాడుకున్నట్లు వాటా కింద లెక్కిస్తే ఎలాగని రాష్ట్రప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ని ప్రశ్నించింది. తక్షణమే ఆంధ్రకు కృష్ణా జలాల విడుదలను ఆపేయాలంటూ తెలంగాణ శుక్రవారం కేఆర్ఎంబీని లిఖితపూర్వకంగా కోరడం గురించి తెలిసిన వెంటనే.. ఏపీ జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు ఫోన్లో చర్చించుకున్నారు. బోర్డు చైర్మన్ అతుల్ జైన్‌తో మాట్లాడాలని ఈఎన్‌సీని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు అతుల్ జైన్‌తో వెంకటేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాగార్జునసాగర్ నుంచి పంటలకు నీరిస్తున్న సమయంలో అకస్మాత్తుగా ఆపేస్తామంటే ఎలాగని ప్రశ్నించారు. బుడమేరు వరదంతా సముద్రంలోకే వెళ్లిందని, దీనిని కూడా ఏపీ వాడుకున్నట్లుగానే చూపుతారా అని నిలదీశారు. 'శ్రీశైలం, సాగర్‌లో జల విద్యుదుత్పత్తి కోసం తెలంగాణ నీటిని వాడేసి కిందకు వదిలేస్తే.. చేసేదేమీ లేక మేం సముద్రంలోకే వదిలేయాల్సి వచ్చింది. ఈ నీటిని కూడా మేం వాడుకున్నట్లుగా లెక్కిస్తారా? శ్రీశైలానికి భారీగా వరద వచ్చిన తరుణంలో దిగువకు నీళ్లొదలడాన్ని కూడా మేం వాడేసుకున్నట్లుగానే పరిగణిస్తారా? నీటి వాడకం లెక్కలు శాస్త్రీయంగా ఉండాలి' అని స్పష్టం చేశారు. శుక్రవారంనాటి కేఆర్ఎంబీ సమావేశం సోమవారానికి వాయిదా పడినందున.. ఆరోజున నీటి లెక్కలపై ముఖాముఖి చర్చించుకుందామని చెప్పారు. అప్పటిదాకా రాష్ట్రానికి నీటి విడుదల కొనసాగించాలని కోరారు. దీనికి అతుల్ జైన్ సానుకూలంగా స్పందించారు. యథాతథంగా నీరు వదులుతామని హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి

హరోం.. హరహర!!

ప్రతిధ్వనిస్తున్న నల్లమల గిరులు

పాదయాత్రగా ముందుకు సాగుతున్న శివభక్తులు



నల్లమల అటవీ మార్గంలో ప్రాచీన నిర్మాణం



అటవీ క్షేత్రంలో పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్తున్న భక్తులు



నల్లమల అటవీమార్గంలో రాళ్లపై వెళ్తున్న భక్తులు

దుర్భేద్యమైన కొండలు..
జారుడు బండలు...
రాళ్లు, రప్పలు.. చెట్లుచేమలు...
అన్నీ దాటుకుంటూ నడక.. ఎండ
చుర్రుమంటున్నా... కిలోమీటర్లు
కరిగిపోతున్నా.... అలుపు తెలియని,
ఆగని నడక. లింగభేదం లేదు...
వయోభారం కానరాదు... ఎటు చూసినా
తండోపతండాలు
అందరి నోట ఒకటే మాట...
హరోం హరహర! శంభో శంకర!!

భూలోక కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల క్షేత్రానికి పాదయాత్ర అంటే జీవితంలోనే మరచిపోలేని మజిలీగా భక్తులు భావిస్తారు. మహాశివరాత్రి రోజుల్లో శివయ్యను దర్శించడానికి ఉత్సాహం చూపుతారు. కష్టతరమే అయినా ఉప్పొంగుతున్న భక్తితో శివ నామస్మరణ చేసుకుంటూ ముందుకు సాగిపోతుంటారు. ఈ శివరాత్రి సందర్భంగా వేల సంఖ్యలో వస్తున్న వారి యాత్ర ఎలా సాగుతున్నదంటే.... స్వగ్రామాల నుంచే నడచి వస్తున్న వారు కొందరైతే, ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి వాహనాల్లో కొంతమంది చేరుకుంటున్నారు. అక్కడి నుంచి పంటపొలాల గుండా నాగలూటి చెంచుగూడెం చేరుకుంటున్నారు. ఆతర్వాత 5 కిలోమీటర్లు అటవీ మార్గంలో ప్రయాణించి నాగలూటి వీరభద్రాలయాన్ని దర్శించి ముందుకు సాగుతున్నారు. నాగలూటి తిప్పలు, దామర్లకుంట, నల్లమల కొండలపై అడవిమార్గం గుండా సుమారు 14 కిలోమీటర్లు ప్రయాణించి పెచ్చెర్వు చెంచుగూడేన్ని చేరుకుంటున్నారు. ఆపై కత్తుల కొండ, కొర్కొలకొండ అటవీ ప్రాంతంలో 15 కిలోమీటర్లు నడిచి భీముని కొలను ప్రాంతానికి వస్తున్నారు. అక్కడి నుంచి ప్రమాదకర జారుడు కొండపై ప్రయాణించి కైలాస ద్వారానికి చేరుతున్నారు. 6 కిలోమీటర్లు దూరం ప్రయాణించి శ్రీశైల మల్లన్న దర్శనానికి తరలివెళ్తున్నారు.... ఆదుకో శివయ్యా అంటూ అడుగు ముందుకు వేస్తున్నారు.

-ఆత్మకూరు, ఆంధ్రజ్యోతి



నాగలూటి వీరభద్ర ఆలయం వద్ద పురాతన కోనేరులో నీటిని తీసుకుంటున్న భక్తులు




నాగలూటి క్షేత్రంలో కొలువుతీరిన వీరభద్రుడు



భీముని కొలనులో కొలువు తీరిన భీముడి మూలవిరాట్



నల్లమల అటవీ క్షేత్రంలో పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్తున్న భక్తులు



నడకమార్గంలో నాగలూటి వద్ద ప్రాచీన విడిది కేంద్రం



నల్లమలలోని దామర్లకుంట వద్ద వెదురు చెట్ల కింద సేదతీరుతున్న పాదయాత్రికులు

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను ఆపేయండి

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై ధర్మాసనం ముందు అప్పీలు

రోస్టర్ విధానంలో మార్పుల తర్వాతే పరీక్ష నిర్వహించాలి



హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్ల వద్ద గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళన

అమరావతి/చిక్కడపల్లి/విజయవాడ(గాంధీనగర్), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిలుపుదల చేసేందుకు నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టు ధర్మాసనం వద్ద అప్పీలు దాఖలైంది. విశాఖకు చెందిన ఎం.పార్థసారథి ఈ అప్పీల్ వేశారు. గ్రూప్-2 పోస్టుల భర్తీకోసం 2023 డిసెంబరు 7న ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్ సుప్రీంకోర్టు తీర్పు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 77కి విరుద్ధంగా ఉందనే విషయాన్ని సింగిల్ జడ్జి విస్మరించారని అప్పీల్‌లో పేర్కొన్నారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించి, 23న జరగనున్న గ్రూపు-2 మెయిన్స్ పరీక్షను నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా, రోస్టర్ విధానంలో మార్పులు చేసేవరకు గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించవద్దని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని పలు కోచింగ్ సెంటర్ల వద్ద రోడ్డుపై బైఠాయించారు. జీవో 77 ప్రకారం రోస్టర్‌ను సరిచేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. కాగా, గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా వేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పరీక్షల తర్వాత అభ్యర్థుల నుంచి ప్రాధాన్యతలు

గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష అనంతరం అభ్యర్థుల నుంచి మరోసారి పోస్టుల ప్రాధాన్యతలు తీసుకుంటారని ఏపీపీఎస్సీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా రూపొందించే ముందు ఈ ప్రక్రియ చేపడతామని పేర్కొంది. పోస్టులు, జోన్‌లపై అభ్యర్థులు ప్రాధాన్యతలు ఇవ్వాల్సి ఉంటుంది.

అభ్యర్థులతో చర్చించండి: షర్మిల

రోస్టర్ విధానంలో తప్పులపై ఆందోళన చేస్తున్న గ్రూప్-2 మెయిన్ అభ్యర్థులతో ప్రభుత్వం చర్చించి సమస్యను పరిష్కరించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. రోస్టర్‌లో తప్పులను సవరించాలని శుక్రవారం 'ఎక్స్' వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. రోస్టర్‌లో తప్పులు దొర్లాయని న్యాయస్థానంలో అడ్వకేట్ జనరల్ అంగీకరించారని గుర్తుచేశారు.

చర్యలు తీసుకుంటాం: మంత్రి లోకేశ్

గ్రూప్-2 అభ్యర్థులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. 'పరీక్షలు వాయిదా వేయాలని గ్రూప్-2 అభ్యర్థుల నుంచి అనేక వినతులు వచ్చాయి. వారి ఆవేదనను అర్థం చేసుకోగలను. మా న్యాయ బృందాలతో చర్చించి, సమస్య పరిష్కారానికి ఉన్న అన్ని మార్గాల ద్వారా చర్యలు చేపడతాం' అని మంత్రి పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి 'శ్రీవారి' టికెట్ల పేరిట మోసం

▸ నకిలీ టికెట్లతో రూ.కోటి ఆర్జన

▸ పశ్చిమగోదావరి జిల్లా వాసి అరెస్టు

తిరుమల, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ రూ.లక్షలు సంపాయించుకునే యువకుడు.. జల్సాలకు అలవాటు పడి దొంగదారి పట్టాడు. తిరుమల శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవా టికెట్ల పేరిట ఘరానా మోసం చేసి రూ.కోటికిపైగా ఆర్జించాడు. ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. తిరుమల టూటౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా పంజవరం గ్రామానికి చెందిన పంజా రమణప్రసాద్(29) బీటెక్ చదివి, 2015 వరకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. జల్సాలకు అలవాటు పడిన రమణ ప్రసాద్.. అక్రమ సంపాదనపై దృష్టి పెట్టాడు. 2016లో తిరుమలకు వచ్చి లడ్డూ దళారీగా మారాడు. లడ్డూలు బ్లాక్‌లో విక్రయిస్తూ పరిచయాలు పెంచుకున్నాడు. శ్రీవారి దర్శనం, సేవా టికెట్లను కూడా ఇప్పిస్తానని భక్తులను నమ్మించాడు. దర్శనం, ఆర్జిత సేవలు చేయించుకోవాలనుకొనేవారు రమణ ప్రసాద్‌ను సంప్రదించేవారు. ఇదే అదునుగా వారి నుంచి నగదు తీసుకుని నకిలీ టికెట్లు పంపుతూ దోచుకున్నాడు. తనకు ఎవరైనా ఫోన్ చేసినా ట్రూకాలర్‌లో 'టీటీడీ, టీటీడీ జేఈవో ఆఫీస్' అని వచ్చేలా ఏర్పాటు చేసుకున్నాడు. కొన్ని వాట్సాప్ గ్రూపులు కూడా క్రియేట్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. తనపేరుతో పాటు కుటుంబ సభ్యుల పేర్లపై బ్యాంకు ఖాతాలు తెరిచి గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా భక్తుల నుంచి నగదు తీసుకున్నాడు. రమణ ప్రసాద్ మోసాలకు గురైన కొంతమంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుమల పోలీసులు రమణ ప్రసాద్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రూ.25 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు పంపారు. కాగా, రమణప్రసాద్ బ్యాంకు ఖాతాలను పరిశీలించగా రూ.1,33,58,390 లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. తిరుమలలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో 12 కేసులు, విజయనగరం, కాకినాడలో ఒక్కో కేసు చొప్పున చీటింగ్ కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. గతంలోనూ కొన్ని కేసులు ఉన్నాయని, వాటిలో జైలు శిక్ష కూడా అనుభవించాడని చెప్పారు.

హద్దులు దాటారు..!

(మొదటి పేజీ తరువాయి)

పోరుతో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఆర్థికంగా లాభపడుతున్నాయని గుర్తుచేసింది. వ్యక్తులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించేందుకు చట్టం అనుమతిస్తున్నప్పటికీ.. దానర్థం వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అసభ్యకర పోస్టులు పెట్టడం కాదని తెలిపింది. డీప్‌ఫేక్ ఫొటోలపై కూడా పోలీసులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, అసలు ఫొటో ఏదో, నకిలీదేదో గుర్తించలేకున్నామని పేర్కొంది. అసభ్యకర పోస్టుల నిరోధానికి ఏం చర్యలు తీసుకున్నారు.. అనుచిత, అసభ్యకర పోస్టులకు అడ్డుకట్ట వేసే విషయంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌కు ఏమైనా సూచనలు చేశారా.. తదితర వివరాలను తదుపరి విచారణలో తమ ముందుంచాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది. అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో వైసీపీ సోషల్ మీడియా పూర్వ ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి, పలువురు వైసీపీ సానుభూతిపరులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ పూర్తి స్థాయి వాదనలు వినిపించేందుకు శుక్రవారం సమయం లేకపోవడంతో విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది. అరెస్టు నుంచి వారికి రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను మరో మూడు వారాలు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

భార్గవరెడ్డి సూచనల మేరకే..

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా పలువురు మంత్రుల, వారి కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టేలా వైసీపీ కార్యకర్తలను, సానుభూతిపరులను ప్రోత్సహించారనే ఆరోపణలతో రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ సోషల్ మీడియా పూర్వ ఇన్‌చార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అలాగే అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో వైసీపీ సానుభూతిపరులు మరికొంతమంది ముందస్తు బెయిల్ పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు తుది విచారణ చేపట్టింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ శుక్రవారం వాదనలు వినిపిస్తూ.. 'వైసీపీ సోషల్ మీడియా నిర్వహణలో పిటిషనర్లు కీలక పాత్ర పోషించారు. దాని కన్వీనర్‌గా ఉన్న సజ్జల భార్గవరెడ్డి సూచనల మేరకే ప్రత్యర్థి పార్టీల నాయకులపై అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టినట్లు నిందితులు వాంగ్మూలం ఇచ్చారు. తాడేపల్లిలో వైసీపీ సోషల్ మీడియా కార్యాలయంలో 400 మంది పనిచేశారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, వారి కుటుంబ సభ్యులపై అసభ్యకర మెసేజ్‌లు, మార్ఫింగ్ ఫొటోలు సృష్టించి.. వాటిని జిల్లా స్థాయి సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లకు పంపించేవారు. కో-కన్వీనర్లు నిర్వహించే గ్రూపులో సుమారు 200 నుంచి 250 మంది సభ్యులు ఉంటారు. ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన అసభ్యకర మెసేజ్‌లు, మార్ఫింగ్ ఫొటోలను వైసీపీ మద్దతు గ్రూపుల్లో పోస్టు చేసినందుకుగాను డబ్బులు చెల్లించేవారు. సమాజంలోని ప్రతి వ్యక్తి, వర్గం ఈ అసభ్యకర పోస్టుల బాధితులే. చివరికి దేవుడిని కూడా వదిలిపెట్టలేదు. ఈ నేపథ్యంలో పిటిషనర్ల చర్య వ్యవస్థీకృత నేరం నిర్వచనం పరిధిలోకి వస్తుంది. పిటిషనర్లు నిరక్షరాస్యులు కాదు. వారందరూ బాగా చదువుకున్నవారు. అసభ్యకర పోస్టులు పెట్టి, ప్రత్యర్థుల ప్రతిష్ఠకు భంగం కలిగించడంలో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి చర్యలను అనుమతించడానికి వీల్లేదు. కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది. విచారణకు హాజరుకావాలని పోలీసులు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇచ్చినప్పటికీ పిటిషనర్లు దర్యాప్తునకు సహకరించడం లేదు. ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకుంటున్నారు. ఎస్సీ, ఎస్టీ నిరోధక చట్టం కింద నమోదైన కేసులో నిందితులు బెయిల్ కోసం నేరుగా హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదు. సెక్షన్ 14(ఏ) ప్రకారం బెయిల్ కోసం ముందుగా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలి. ఆ తర్వాత హైకోర్టులో అప్పీల్ చేసుకోవాలి. ఈ విషయంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు కూడా సమర్థించింది' అని తెలిపారు.

విభిన్న ఉత్పత్తులు.. విస్తృత వ్యాపారం..!

▸ డిజిటల్ కామర్స్‌తో మహిళా సాధికారత

▸ ఓఎన్‌డీసీ ద్వారా ఆన్‌లైన్ మార్కెట్ అవకాశాలు

▸ కేంద్రం సహకారంతో రాష్ట్రంలో అమలుకు శ్రీకారం

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక బృందాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, చేతి వృత్తుల వారు తయారుచేసే విభిన్న ఉత్పత్తులకు.. విస్తృత వ్యాపార అవకాశాలు కల్పించేందుకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. దళారీల ప్రమేయం, ఎక్కువ కమీషన్ చెల్లించే అవసరం లేకుండా డిజిటల్ వేదికగా మార్కెట్లోకి నేరుగా తమ ఉత్పత్తులను తీసుకెళ్లే సదవకాశాన్ని వారికి కల్పించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)ను ప్రవేశపెట్టింది. స్థానిక వాణిజ్యాన్ని దేశవ్యాప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్లాట్‌ఫాం ఇది. దీని వేదికగా వినియోగదారులు, చిన్న వ్యాపారులు ఆన్‌లైన్‌లో తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయవచ్చు, విక్రయించవచ్చు. ప్రస్తుతం విస్తృతంగా ఉన్న ప్రైవేట్ ఈ-కామర్స్ యాప్‌ల కంటే తక్కువ కమీషన్‌తో ఎక్కువ ఆదాయం కల్పించే వస్తువులను విక్రయించే, కొనుగోలు చేసే వెసులుబాటు లభిస్తుంది. పలు డిజిటల్ కామర్స్ ప్లాట్‌ఫాంలతో దీన్ని అనుసంధానం చేయడం వలన వ్యాపారులతోపాటు వినియోగదారులకూ మెరుగైన అవకాశాలు దక్కుతాయి.

మహిళా సాధికారిత దిశగా ముందడుగు

మహిళా వ్యాపారులకు, స్వయం సహాయక బృందాలకు టెక్నాలజీ ఆధారిత వాణిజ్య అవకాశాలను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఓఎన్‌డీసీని రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంల్లో అధిక కమీషన్ కారణంగా చిన్న తరహా వ్యాపారులకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు ఓఎన్‌డీసీ ద్వారా ప్రత్యామ్నాయ మార్కెట్ ఏర్పాటవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కూడా ఉంటుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 33,047 సూక్ష్మ, చిన్నతరహా వ్యాపారులు ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌లో నమోదు చేసుకున్నారు. వీరిలో 8,954 మందికి చెందిన 44,241 ఉత్పత్తులు విక్రయానికి అందుబాటులో ఉన్నాయి. ఓఎన్‌డీసీ రాష్ట్రంలోని మహిళా వ్యాపారులకు స్థిర ఆదాయం, విస్తృత మార్కెట్ అవకాశాలను కల్పించే సుస్థిర వేదికగా నిలవనుంది.

'అక్షరం అండగా..'తో సమస్యల పరిష్కారం

అనకాపల్లి కోట్ని వీధిలో మంచినీటి సమస్యకు చెక్.. మినీ రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా కార్యక్రమంతో సత్ఫలితాలొస్తున్నాయి. అనకాపల్లి కోట్ని వీధి, లక్ష్మీనారాయణనగర్‌లో సమస్యలను ప్రస్తావిస్తూ 'కోట్ని వీధిలో సమస్యల తిష్ట' శీర్షికతో జనవరి 27న 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ మర్నాడు కోట్ని వీధి రామాలయ కల్యాణ మండపంలో నిర్వహించిన 'అక్షరం అండగా..' పలువురు మహిళలు మంచినీటి సమస్యను ప్రధానంగా ప్రస్తావించారు. తమ ప్రాంతంలో నీరు సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఏఈ హరీష్ ఆధ్వర్యంలో సిబ్బంది రక్షిత మంచినీటి పథకం మరమ్మతులకు నడుంబిగించారు. ట్యాంకు వద్ద నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు దెబ్బతిన్న పైపులైన్లను మార్చారు. మంచినీటి పథకం వద్ద ఉన్న పాత కొళాయిలను తొలగించి కొత్తవి ఏర్పాటుచేశారు. దీంతో గురువారం ప్రజలకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా అయింది. మంచినీటి పథకానికి మరమ్మతులు చేయడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషిచేసిన 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.







అనకాపల్లి కోట్ని వీధిలో రక్షిత మంచినీటి పథకం పైపులైన్లను మరమ్మతు చేస్తున్న సిబ్బంది, కొళాయిలు బిగించిన అనంతరం మంచినీటిని పట్టుకుంటున్న మహిళలు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.